fb.com/vaartha Digital
WWW.VAARTHA.COM
epaper.vaartha.com
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

విజయవాడ
7-6-2025 శనివారం
సంపుటి: 31 సంచిక: 126
పేజీలు: 10+4 వెల: 6.50

# మరో ముంబయిలా విశాఖ



స్టేట్ ఎనర్జీ ట్రాన్సిషన్ రోడ్ మ్యాప్‌పై ఏపీ, నీతి ఆయోగ్, ఐఎస్ఈజీ ఫౌండేషన్ మధ్య ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహనా ఒప్పందం జరిగిన దృశ్యం

### వచ్చే ఏడేళ్లలో సత్వర అభివృద్ధికి చర్యలు
### 8 జిల్లాలతో విశాఖ ఎకనమిక్ రీజియన్
### 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల ఎకానమీ
### మూలపేట-కాకినాడ మధ్య బీచ్‌రోడ్డు అభివృద్ధి
### నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం చంద్రబాబు

**అమరావతి, జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** సంపదను సృష్టించే ఆదాయవనరుల రాష్ట్రాభివృద్ధికి కీలకమని,తమ ఆలోచన విధానాలు నిరంతం ఆ దిశలో ఉంటాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను ఆంధ్రప్రదేశ్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తీర్చిదిద్దాలని అధికాకులకు సూచించారు. 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల సంపద సృష్టి ఈ రీజియన్ నుంచి జరగాలని అధికారులకు సూచించారు. వచ్చే ఏడేళ్లలో విశాఖను మరో ముంబై నగరంలా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, ఏఎస్ఆర్, మన్యం.. మొత్తం 8 జిల్లాల పరిధిలో ఎకనమిక్ యాక్టివిటీ పెరిగేలా ప్రాజెక్టులు నెలకొల్పాలన్నారు. 8 జిల్లాల్లో వివిధ ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాలు గుర్తించాలని అధికారులను ఆదేశించారు. 36 వేల చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం, 15.5 మిలియన్ జనాభా కలిగివున్న విశాఖ రీజియన్‌లో ప్రస్తుతం 49బిలియన్ డాలర్ల జీడీడీపీ నమోదవు తోందని, 2032 నాటికి 20 నుంచి 24 లక్షల మేర ఉద్యోగాలు పెరిగేందుకు అవకాశం ఉండటంతో ఈ ప్రాంతం రాష్ట్ర పురోగతిలో కీలకం కానుందన్నారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో "విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్‌గా అభివృద్ధి చేసే అంశంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. 6 పోర్టులు, 7 మాన్యుఫాక్చరింగ్ నోడ్లు, 17 మేజర్ వ్యవసాయ క్షేత్రాలు, 6 సర్వీస్ హబ్స్, 12 పర్యాటక హబ్స్‌తో విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనిపై నీతి ఆయోగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పోర్టు, ఐటీ, వ్యవసాయం, పర్యాటకం, హెల్త్ కేర్, పట్టణీకరణ, మౌలికవసతుల కల్పన ఇలా 7 గ్రోత్ డ్రైవర్లుగా రూపొందించిన ప్రణాళికలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకోసం అత్యంత ప్రాధాన్యమైన 41 ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలోదేశంలోని టాప్ 3 స్టీల్ పరిశ్రమలతో స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దడం అలాగే పెట్రో కెమికల్స్, గ్యాస్ గ్రిడ్, పోర్టుల అభివృద్ధి, పెట్రోకెమికల్స్ మెడికల్ టెక్, షిప్ బిల్డింగ్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, క్లీన్ టెక్, లేబర్ ఇంటెన్సివ్ మాన్యుఫాక్చరింగ్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయం.

వచ్చే 7 ఏళ్లలో ఐటీ రంగంలో కనీసం 4 నుంచి 5 లక్షల ఉద్యోగాల కల్పన జరిగేలా లక్ష్యం. డేటా సెంటర్లు, స్టార్టప్‌లుఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడం. ప్రస్తుతం కొనసాగుతున్న 4 రైల్వే ప్రాజెక్టులతో పాటు అదనంగా 2032 కల్లా మరో 7 కొత్త రైల్వే ప్రాజెక్టులు పూర్తిచేయడం. మాన్యుఫాక్చరింగ్ నోడ్స్, పోర్టులకు అనుకూలించేలా కొత్తగా 9 రోడ్డు ప్రాజెక్టులు చేపట్టడం. 202830 కల్లా 77 కి.మీ. మేర నిర్మించే వైజాగ్ మెట్రో ప్రాజెక్టుపై చర్చించారు.దేశంలోని టాప్ 3స్టీల్ పరిశ్రమలతో స్టీల్ హబ్‌గా తీర్చి దిద్దడం. అలాగే పెట్రో కెమికల్స్, గ్యాస్ >>2



ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన జమ్ము-కాశ్మీర్‌లోని చీనాబ్ వంతెనను శుక్రవారం ప్రారంభించిన అనంతరం త్రివర్ణ పతాకాం చేతపట్టుకుని వంతెనపైనుంచి నడిచి వెళ్లిన ప్రధాని మోడీ

## జమ్ముకాశ్మీర్ పర్యాటకరంగంపై పాకిస్థాన్ కుట్రలు: ప్రధాని మోడీ 2లో

## కర్ణాటక సిఎం కార్యదర్శి, ఇంటెలిజెన్స్ చీఫ్ ఔట్ 2లో



## ఆగస్టు 3న 'నీట్' పిజి పరీక్ష
### 'సుప్రీం' అనుమతి

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** వైద్య విద్యలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే నీట్ పిజి-2025 పరీక్షను దేశ వ్యాప్తంగా ఆగస్టు 3న నిర్వహించనున్నారు. నీట్ పిజి-2025 పరీక్షను నిర్వహించడానికి నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్(ఎన్ఇడి)కి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. నీట్ పిజి పరీక్షకి సంబంధించి సుప్రీంకోర్టు మే 30న కీలక ఆదేశాలు జారీచేస్తూ.. జూన్15న జరగనున్న నీట్ పిజి- 2025 పరీక్షను ఒక షిఫ్ట్‌లోనే నిర్వహించాలని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ ఎన్.వి. అంజారియా ధర్మాసనం స్పష్టం చేసింది. మే 30న సుప్రీంకోర్టు జారీచేసిన ఆదే శాల మేరకు తమ టెక్నాలజీ భాగస్వామి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) లిమిటెడ్ సాధ్యమై నంత త్వరగా పరీక్షను నిర్వహించడానికి అనువైన తేదీగా ఆగస్టు 3ను నిర్ణయించిందని.. ఈ తేదీన పరీక్షను నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని ఎన్‌బిఇ శుక్రవారంసుప్రీంకోర్టును కోరింది. శుక్రవారం వాదనల సందర్భం >>2

# ఎఐలో యువతకు శిక్షణ

### మంత్రి లోకేష్ సమక్షంలో ఎన్ విడియా సంస్థతో ప్రభుత్వం ఒప్పందం
### 10వేల మంది విద్యార్థులకు శిక్షణ, 500 ఎఐ స్టార్టప్‌లకు లబ్ధి



శుక్రవారం మంత్రి లోకేష్ సమక్షంలో కుదిరిన ఒప్పంద దృశ్యం

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే ఏఐ ఆధారిత పరిశోధన, నవీన ఆవిష్కరణలు, నైపుణ్య అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగ్రామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) యూనివర్సిటీ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఏఐలో యువతకు నైపుణ్య శిక్షణ సహా ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించేలా ప్రపంచ ప్రఖ్యాత ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) కంప్యూటింగ్ సంస్థ "ఎన్ విడియా(విజు।దీ।తి)"తో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఉన్నత విద్య అధికారులు, ఎన్ విడియా ప్రతినిధులు అవగాహన ఒప్పందం చేసుకున్నారు.

ఈ ఒప్పందం ద్వారా 10వేల మం ది విద్యార్థులకు ఏఐలో నైపుణ్య శిక్షణ అందించనున్నారు. దీంతో పాటు 500 ఏఐ ఆధారిత స్టార్టప్‌ల అభివృద్ధికి మద్దతు ఇవ్వనున్నారు. గతేడాది అక్టోబర్ లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. ఎన్ విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ తో ముంబైలో సమావేశం అయ్యారు. అమరావతిలో ఏర్పాటుచేయబోయే ఏఐ యూనివర్సిటీకి సహకరించాల్సిందిగా కోరారు. ఇందుకు హువాంగ్ సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో ఎన్ విడియాతో ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ ను ఏఐ పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంఈ ప్రాజెక్టులో భాగంగా ప్రముఖ ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాలతో రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఆధునిక ఏఐ నైపుణ్యాలను అందించనున్నారు.

రాబోయే సంవత్సరాల్లో 10 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, 500 ఏఐ ఆధారిత స్టార్టప్‌ల అభివృద్ధికి మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏఐ యూనివర్శిటీకి అత్యాధునిక కంప్యూటింగ్ వనరులు, సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్ లు, హార్డ్‌వేర్ సామర్థ్యాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. పరిశ్రమలు, ప్రభుత్వం, విద్యా రంగం మధ్య బలమైన భాగస్వా మ్యానికి ఈ ఒప్పందం వేదికగా మారనుంది. విద్యార్థులకు ప్రాజెక్ట్‌లు, పరిశోధన, మార్కెట్ అవకాశాలు, మెంటార్‌షిప్ వంటి అనేక అవకాశాలను కల్పించనున్నారు. ముఖ్యంగా ఏఐ, స్టార్టప్‌ల అభివృద్ధికి ఇది బలమైన వేదికగా నిలవనుంది.

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అడ్వాన్స్డ్ ఏఐ రీసెర్చ్ హబ్‌గా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ ఒప్పందం కీలకమైన ముందడుగు కానుంది. ఈ కార్యక్రమంలో "ఎన్ విడియా(విజు।దీ।తి)" సౌత్ ఏసియా ఎండీ విశాల్ దూపర్, స్ట్రాటజిక్ బిజినెస్ డైరెక్టర్ గణేష్ మహబాల, ఏవీపీ ప్రైమస్ పార్ట్‌నర్ శ్రీమతి సుమన్ కసానా, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఏపీఎస్ హెచ్ఈ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### ఏడు మార్కెట్ యార్డుల ద్వారా
## హెచ్‌డి బర్లీ పొగాకు కొనుగోలు
### వ్యవసాయమంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఏడు మార్కెట్ యార్డుల ద్వారా హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి గుంటూరు,ప్రకాశం జిల్లాల్లోని పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, పెద నందిపాడు, ప్రత్తిపాడు, చిలకలూరిపేట, మద్దిపాడు యార్డులద్వారా శుక్రవారం నుంచే సేకరణ ప్రారంభిం చనున్నారు. ఇక ప్రాసెసింగ్ రకం మామిడికి కిలో రూ.12 చొప్పున చెల్లించి కొనుగోలు చేయాలని ఆహారశుద్ధి పరిశ్రమలు,ట్రేడర్లను ఆదేశించింది. ఇందులో వ్యాపారులు రూ.8, ప్రభుత్వం రూ.4 చొప్పున భరించాలని నిర్ణయించింది. కోకో రైతులకు కిలోకు రూ.500 దక్కేలా, వ్యాపారులు రూ.450,ప్రభుత్వం రూ.50 చొప్పున చెల్లించనుంది. పొగాకు, మామిడి, కోకో పంటలకు గిట్టుబాటు ధర లపై ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విలేకరులకు వివరించారు. గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.550 కోట్ల వరకు భారం పడుతుందన్నారు. హెచ్‌డీ బర్లీ,పొగాకును ఐటీసీ,జీపీఐ సంస్థలు కలిపి 25 మిలియన్ కిలోలు,చిన్న కంపెనీలు 20 మిలియన్ కిలోల చొప్పున కొనాలి. రెండు, మూడు గ్రేడ్లరకాలు కొనేలా కంపెనీలతో మాట్లాడాలి.ప్రధాన రకాన్ని క్వింటాలుకు రూ. 12వేలకు తగ్గకుండా సేకరించాలి. >>2

### చల్లపల్లి రాజవంశీకుడు
### మాజీ ఎంపి అంకినీడు ప్రసాద్
## కన్నుమూత



అంకినీడు ప్రసాద్ (ఫైల్)

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ఎంపీ యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ (86) మృతి చెందారు.కోయంబత్తూరులోని ఆయన నివాసంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు.ఆయన మృతి పట్ల సీఎం చంద్రబాబు నాయుడు.మాజీ సీఎం జగన్ వేర్వేరు ప్రకటనల్లో తీవ్ర సంతాపం ప్రకటించారు. (శనివారం) చల్లపల్లికి భౌతికకాయం తరలింపు ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల కరస్పాండెంట్‌గా సేవలు అంకినీడు ప్రసాద్ మృతికి బుద్ధప్రసాద్, కొనకళ్ల సంతాపం ప్రజాసేవలో, విద్యాభివృద్ధిలో ఆయనది చెరగని ముద్ర అని వెల్లడి చల్లపల్లి రాజా కుటుంబానికి చెందిన ప్రముఖ వ్యక్తి, మచిలీపట్నం పార్లమెంటు మాజీ సభ్యులు యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్ (86) శుక్రవారం కన్నుమూశారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఉన్న తన స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణ వార్త కృష్ణాజిల్లా వాసులను, ముఖ్యంగా చల్లపల్లి ప్రాంత ప్రజలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. అంకినీడు ప్రసాద్ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం శనివారం కృష్ణా జిల్లాలోని చల్లపల్లికి తీసుకురానున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన చల్లపల్లిలోని శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాద్ బహద్దూర్ (ఎస్ఆర్‌వైఎస్‌పీ) జూనియర్ కళాశాలకు కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తూ విద్యాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు.మాజీ ఎంపి >>2

# పోలవరం-బనకచర్ల టెండర్లు త్వరలో

### 365 రోజులు పంటలతో పచ్చగా ఉండాలి
### బుడమేరులో పూడిక తొలగించాలని అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం

**విజయవాడ, జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా, గోదావరి డెల్టాలో పంటల సాగు వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుఫాన్ల కంటే ముందుగానే పంటలు చేతికొచ్చేలా పంటల సాగు కాలంలో మార్పులు తీసుకురావాలని సూచన చేశారు. భూగర్భ జలాలు పెంచడం, రిజర్వాయర్లు నింపడం, జలవనరుల సమర్థ వినియోగంపై అధికారులు ప్రధానంగా దృష్టి పెట్టాలని సూచించారు. 365 రోజులు భూమి పచ్చగా ఉండేలా, 3 పంటలు నిరంతరం పండించేలా చూడాలన్నారు. భూగర్భ జలాల వివరాలు తెలుసుకునేందుకు ఉపయోగించే పిజియో మీటర్లు, ఇంకా ఏడబ్ల్యుఎస్ సెన్సర్లు రాష్ట్రంలో కొన్ని చోట్ల పనిచేయకపోవడంపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.శుక్రవారం సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి పలు మార్గదర్శకాలు జారీరేసారు.తక్షణం నూతన పరికరాలు కొనుగోలు చేసేందుకు రూ.30కోట్లు విడుదల చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నిర్వహణా లోపాలు సరిచేసుకుని వాటర్ ఆడిట్ శాస్త్రీయంగా చేపట్టాలని చెప్పారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలో నిర్మించాల్సిన అన్ని ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలన్నారు.

**భూగర్భ జలాల వివరాలతో బులిటెన్లు :** జలవనరుల లభ్యతను బట్టి నీటి సమర్థ వినియోగం జరగాలి. భూగర్భ జలాలు 20 మీటర్ల కన్నా తక్కువ ఉన్న మండలాలు, 820 మీటర్ల మధ్య భూగర్భ జలాలు ఉన్న మండలాల వివరాలు అందించాలి. బేసిన్లు, జిల్లాల వారీగా, సెంట్రల్‌లోకల్ బులిటెన్లు రిలీజ్ చేయాలి. రాష్ట్రంలో సగటు భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలి. సీలేరు నీరు కృష్ణా డెల్టాకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలి. హంద్రీనీవా మెయిన్ కెనాల్ వైడనింగ్ పనుల్లో వేగం పెంచాలి. వెలిగొండ స్టేజ్ 1 పనులు 2026 జూన్ కల్లా పూర్తి కావాలి. కేంద్ర ఆర్థిక సాయం కోసం సాస్కిలో పెట్టండి. శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్ పూల్ మరమ్మతులకు తక్షణ చర్యలు చేపట్టండి. బుడమేరు ప్రవాహానికి అడ్డంకులు లేకుండాపూడికతీత, ముళ్ల కంపలు తొలిగించండి. ఒక్క ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినా ఆ నీటితో 3, 4 ఏళ్లు కరువొచ్చినా వాటర్ మేనేజ్మెంట్ జరగాలి. క్రాప్ ప్యాట్రన్ మార్చి తడి ఆరుతడి పంటలసాగుకు యాక్షన్ ప్లాన్ రూపొందించండి. జల సంరక్షణ కోసం వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు నిర్మించాలని చెప్పారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి అటవీపర్యావరణ అనుమతులు, డీపీఆర్ ఆమోదం తదితరాలు అన్నీ అనుకున్న సమయానికల్లా జరగాలని, భూసేకరణకు కూడా సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. హైబ్రీడ్ యాన్యుటీ విధానంలో పోలవరం బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును చేపట్టాలని చెప్పారు. అలాగే, టెండర్లకు సంబంధించిన రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీతో డ్రాఫ్ట్ డాక్యుమెంట్ రూపొందించడం, సాంకేతిక నిపుణల పర్యవేక్షణ అనంతరం టెండర్లు పిలవడం ఈ నెలాఖరు కల్లా పూర్తి కావాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు.

**బనకచర్లకు రుణ సమీకరణ ఇలా:** జలహారతి కార్పొరేషన్‌కింద పోలవరం >>2

## రేషన్ వద్దంటే నగదు పంపిణి!
### ప్రభుత్వం కొత్త ఆలోచన

**విజయవాడ, జూన్ 6 ప్రభాతవార్త ప్రతినిధి:** రేషన్ బదులు నగదు వచ్చే విషయంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన ఆలోచన చేస్తోంది. ఏపీలో గతంలో ఉన్న విధానానికి స్వస్తి చెప్పారు.ఈ నెల 1వ తేదీ నుంచి షాపుల ద్వారా రేషన్‌ను పంపిణీ చేస్తోంది కూటమి సర్కార్ ఈ క్రమంలో ప్రభుత్వం ముందుకు మరో కీలక ప్రతిపాదన వచ్చిందట ఒకవేళ ఎవరైనా రేషన్ వద్దనుకుంటే వారికిడబ్బులు ఇవ్వాలనే ఆలోచన చేస్తోందట. ఈ దిశగా రేషన్ బియ్యం తీసుకునే విధానంలో మార్పులు చేయడంపై దృష్టి సారించింది ప్రభుత్వం. ఇక బియ్యం వద్దనుకునే వారికి ఆ డబ్బులు కాకుండా అందుకు సరిపడా నిత్యావసర వస్తువులు ఇవ్వాలనే ప్రతిపాదనలు కూడా వచ్చినట్టుగా తెలుస్తోంది. మరోవైపు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 1న కోనసీమ జిల్లా పర్యటనలో బియ్యం వద్దనుకునే వారికి డబ్బులు ఇస్తామని ప్రకటించారు. రేషన్ బదులు నగదు >>2

### మరో మావోయిస్టు అగ్రనేత
## భాస్కర్ ఎన్‌కౌంటర్‌లో హతం
### కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్



**చర్ల,జూన్ 6,ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత పరంపర కొనసాగుతుంది. ఆపరేషన్ బ్లాక్ హిల్స్ ను రెండు నెలలపాటు కొనసాగించిన కేంద్ర ప్రభుత్వం భద్రతా బలగాలు అక్కడ సైతం మావోలడెన్లను నేలమట్టం చేసారు. కర్రిగుట్టల్లో మావోయిస్టులు లేరని నిర్ధారించుకున్న పోలీస్ ఉన్నతాధికారులు అక్కడ సెర్చ్ ఆపరేషన్ నిలిపివేసారు.మావోలకు పట్టున్న మాడ్ ఏరియా నేషనల్ పార్క్ అటవి ప్రాంతాలపై నిఘాను కట్టుదిట్టం చేసారు.ఈ క్రమంలో మళ్లీ ఎన్ కౌంటర్లు జరుగుతున్నాయి. గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు టెండ్ లక్ష్మీ నరసింహాచలం ఆలియాస్ సుధాకర్ మృతిచెందగా శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో >>2

## ఇక యేటా డిఎస్సీ: మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇకపై ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి టీచర్ల పోస్టులు భర్తీ చేస్తామని ఏపీ విద్యాశాఖా మంత్రి నారాలోకేష్ ప్రకటించారు. నేటి నుంచి ప్రారంభమైన మెగా డీఎస్సీ పరీక్షల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో విద్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. టీచర్ల బదిలీలు, పదోన్నతులు అన్ని పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నాలుగు వేల మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఏపీలో వందశాతం అక్షరాస్యత సాధించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ 81 లక్షల మంది నిరక్షరాస్యులు ఉన్నారన్నారు. అంటే రాష్ట్ర జనాభాలో సుమారు 19 శాతం ఉన్నారన్నారు.

## 5వేలు దాటిన కరోనా కేసులు
### 55కు పెరిగిన మృతులు

**న్యూఢిల్లీ, జూన్ 6:** భారత్‌లో కరోనా వైరస్‌వ్యాప్తి ఆందోళనకరంగా మారుతోంది. కొంతకాలంగా తగ్గుముఖం పట్టిన మహమ్మారి, తిరిగి విజృంభిస్తుండటంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య ఐదు వేల మార్కును దాటింది. గడిచిన 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 498 కొత్త కరోనా కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. నలుగురు వ్యక్తులు ఈ వైరస్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. దీంతో, దేశంలో ఇప్పటివరకు కొవిడ్ కారణంగా మరణించిన వారి మొత్తం సంఖ్య 55 కు చేరింది. ప్రస్తుతం దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 5,364గా ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు.

## అఖండ గోదావరి ప్రాజెక్టుకు 19న శంకుస్థాపన

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వ సహకారంతో మంజూరైన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టును ఈ నెల 19న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, రాజమండ్రి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి శంకుస్థాపన చేస్తారని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాస్కి 202425 ( స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్)స్కీమ్ కింద మంజూరైన రూ.97కోట్లతో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. పవిత్ర గోదావరి పుష్కరాలలోపే ప్రాజెక్టు పనులు పూర్తవుతాయన్నారు. చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని తెలిపేలా సందర్శకులకు మెరుగైన వసతుల కల్పనతో పాటు మంచి అనుభూతిని అందించడం జరుగుతుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. 127 ఏళ్ల చరిత్ర కలిగి వారసత్వ సంపతకు ప్రతీకగా నిలిచిన చారిత్రాత్మక హేవలాక్ బ్రిడ్జిని ఆధునీకరిస్తామన్నారు.



శుక్రవారం జమ్ముకాశ్మీర్‌లో చీనాబ్ వంతెనను ప్రారంభించి పరిశీలిస్తున్న ప్రధాని మోడీ

# జమ్ముకాశ్మీర్ పర్యాటకరంగంపై పాకిస్థాన్ కుట్రలు

## కాట్రా సభలో ప్రధాని మోడీ

**కాట్రా (జమ్ముకాశ్మీర్),జూన్ 6:** కశ్మీర్‌లో పర్యాట కాన్ని ధ్వంసం చేయాలని పాకిస్థాన్ కుట్ర పన్నుతోందని ప్రధాని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పొరుగు దేశం పర్యాటకానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌లోని పేదలపై పాక్ కుట్రలు చేస్తోందని, ఇక్కడి పేదల పొట్టగొట్టాలని పాక్ చూస్తోందని దుయ్యబట్టారు. ఉగ్రవాదంపై పోరాటంలో వెనక్కి తగ్గేదిలేదని ప్రధాని స్పష్టం చేశారు. పాక్ కుయుక్తులను ఎప్పటికప్పుడు భారత్ ఎండగడుతూనే ఉంటుందన్నారు.మన పహల్గాంవ్ హీరో ఆదిల్‌హుస్సేన్ అని చిన్నచిన్న గుర్రాలపై పర్యాటకులను తీసుకువెళ్లే వృత్తిలో ఉన్న ఆదిల్ పహల్గాంవ్ దాడిలో పర్యాటకులను రక్షించేక్రమంలో ప్రాణాలు అర్పించాడని కొనియా డారు. పోనీవాలాగా ఆయన పర్యాటకులను కాపాడేందుకు చేసినయత్నం దేశం గుర్తుంచు కుంటుందని అన్నారు. కశ్మీర్ లోయకు రైలును నడపాలన్న కల నేటికి సాకారమైందని మోడీ హర్షం వ్యక్తంచేసారు. చినాబ్ వంతెన ప్రారంభం సందర్భంగా కాట్రాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని మోడీ కీలకోపన్యాసం చేశారు. భారతీయ ఇంజినీర్ల నైపుణ్యానికి అంజీ ఖాడ్ రైల్వే తీగలవంతెన ఒక నిదర్శనమన్నారు. మాతా వైష్ణోదేవి ఆశీర్వాదం వల్ల జమ్మూ కశ్మీర్‌ను మరింత అభివృద్ధి చేసుకుంటున్నాం. దాదాపు రూ.40వేలకోట్లతో జమ్మూలో అభివృద్ధికి బాటలు వేశాం. బ్రిటీష్ కాలం నాటి ప్రణాళిక నేటికి కార్యరూపం దాల్చింది. అందుకే చినాబ్ రైల్వే బ్రిడ్జ్, అంజీర్ వంతెనలు జాతికి అంకితం చేశాం. మాటల్లో కాదు చేతల్లో అభివృద్ధి చేసి చూపించాం. ఇకపై జమ్మూకశ్మీర్ అభివృద్ధి మరింతగా కొంత పుంతలు తొక్కుతుందని అన్నారు. జమ్మూకశ్మీర్ సహా దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని ప్రధాని మోడీ తెలిపారు. కానీ కొన్ని రాజకీయ పార్టీలు పేదలను రాజకీయాల కోసం వాడుకుంటున్నాయని ఆయన విమర్శిం చారు. ఉగ్రవాదానికి భారత్ తలవంచదన్న మోడీ ఈసభలోనే పాకిస్థాన్‌పై నిప్పులు చెరిగారు. ఇకపై ఆపరేషన్ సిందూర్ పేరు విన్నప్పుడల్లా పాకిస్థాన్‌కు ఓటమి గుర్తుకువస్తుం దన్నారు. ఉగ్రవాదానికి భారత్ ఎన్నటికీ తలవం చదని స్పష్టం చేశారు. అయితే ఈ పోరాటంలో జమ్మూకశ్మీర్ యువత ఐక్యంగా ఉండాలని మోడీ పిలుపునిచ్చారు. అలాగే పాక్ సరిహద్దు వెంబడి ఉన్న గ్రామాల ఇళ్లల్లో పాక్ జరిపిన అప్రకటిత కాల్పులవల్ల దెబ్బతిన్న కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తామని అన్నారు. భారత్‌పాక్ ఉద్రిక్తతల సమయంలో పాకిస్థాన్ చేసిన దాడుల్లో ఇళ్లు దెబ్బతిన్నవారికి అదనంగా రూ.2 లక్షలు అందించనున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ల కోసం రూ.1 లక్ష ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయిం చిందన్నారు.

## చీనాబ్ వంతెనను ప్రారంభించిన ప్రధాని

**కాట్రా (జమ్ముకాశ్మీర్),జూన్ 6:** జమ్ము కశ్మీర్‌లో కేంద్రం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి చీనాబ్ రైలు వంతెన ను ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించారు. జెండా ఊపి రైల్వే వంతెనపై రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే బ్రిడ్జిపై పరుగులు తీసిన కోచ్‌లో ప్రధాని ప్రయాణించారు. చీనాబ్ రైలు వంతెనను భారతీయ రైల్వే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. ఈ వంతెన జమ్ము కశ్మీర్‌లోని జమ్మూ డివిజన్ రియాసి జిల్లా బక్కల్ - కౌరి మధ్య ఉంది. కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఉధంపూర్ శ్రీనగర్ బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టులో భాగంగా చీనాబ్ వంతెనను నిర్మించారు. తన పర్యటనలో భాగంగా సుమారు రూ.46,000 కోట్ల ప్రాజెక్టులకు కాట్రాలో మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఉక్కు, కాంక్రీట్‌తో నిర్మించిన చీనాబ్ వంతెన నది గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తులో చీనాబ్ నదిపై 1,315 మీటర్ల పొడవైన వంతెనను నిర్మించారు. చైనాలో బెయిపాన్ నదిపై నిర్మించిన 275 మీటర్ల పొడవైన షుబాయ్ రైల్వే వంతెన పేరుపై ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. ఇక పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌తో పోల్చితే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువగా ఉండటం విశేషం. 2003లో వాజ్‌పేయి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి ఆమోదం తెలుపగా పూర్తి కావడానికి 22 ఏండ్లు పట్టింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా కశ్మీర్ లోయకు దేశంలోని మిగిలిన ప్రాంతాలకు రైల్వే అనుసంధానం ఏర్పడింది. భూకంపాలు, గంటకు 260 కిలో మీటర్ల వేగంతో వీచే బలమైన గాలుల్ని తట్టుకో గల ఈ వంతెన జీవితకాలం 120 ఏండ్లు. ఆర్చ్ ఆకృతిలో నిర్మించిన ఈ రైల్వే వంతెన పొడవు 1,315 మీటర్లు. నదీగర్భం నుంచి ఈ బ్రిడ్జి 1,178 అడుగుల ఎత్తులో ఉంది. వంతెన నిర్మాణం కోసం 28 వేల టన్నుల స్టీల్,6 లక్షల బోల్ట్‌లు వాడారు. నిర్మాణ వ్యయం రూ.1483 కోట్లు. వంతెనకు ఇరువైపులా 93 డెక్ సెగ్మెంట్స్‌ను ఉపయోగించగా, ఒక్కోటి 85 టన్నుల బరువు ఉంటుంది. ఉధంపూర్ శ్రీనగర్ బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన ఈ వంతెన జాతి సమగ్రత, ఇంజినీరింగ్ అద్భుతానికి ఓ చిహ్నం.

## పామాయిల్,రసాయనాలు కల్తీతోనే నకిలీ నెయ్యి సరఫరా!

### బోలేబాబాడెయిరీదే పాపం! 17 లోపే సూత్రధారుల అరెస్టులు తప్పవా?!

**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి లడ్డూల తయారీకి నెయ్యిసరఫరా చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఉత్తరాఖండ్ బోలేబాబాడెయిరీ పామాయిల్, రసాయనాలు,ముడిపదార్థాలతో నకిలీనెయ్యి తయారుచేసి సరఫరా చేసిందనే నిర్ధారణకు సిబిఐ సిట్ అధికారులు తేల్చారు. ఆ డెయిరీకి పాలు సేకరణ గానీ, నెయ్యి ఉత్పత్తిచేసే వ్యవస్థలేదని స్పష్టం చేసింది. ఈ కల్తీ వ్యవహారంలో బోలేబాబాడెయిరీ షోమిల్‌జైన్ అనుచరుడు కోల్‌కత్తాలో నూనెల పరిశ్రమ నడుపుకుంటున్న పారిశ్రామికవేత్త జ్యోతిష్‌ను సిట్ అధికారులు విచారణ చేయడంతో మరిన్ని కీలక ఆధారాలు వెలుగు చూశాయి. దీంతో ఈ కేసు ఇప్పుడు మరో ప్రధాన మలుపుతిరిగింది. టిటిడికి నకిలీనెయ్యిని ఆ డెయిరీ యాజమాన్యం తమిళనాడులోని ఏఆర్‌డెయిరీ, వైష్ణవీడెయిరీ నుండి సబ్‌టెండర్లు దక్కించుకుని పూర్తిగా కల్తీచేసిన నెయ్యిని సరఫరాచేయడంలో ప్రధాన పాత్ర పోషించిందనేది సిట్ తేల్చింది. 2019-24మధ్య కాలంలో ఐదేళ్ళలో టిటిడికి అవసరమైన నెయ్యి సరఫరాకు టెండర్లు దాఖలు చేయాలని ప్రోత్స హించిన సూత్రధారులు ఇప్పుడు తెరపైకి రానున్నారు. అసలు ఆ డెయిరీ కార్యకలాపాలు తనిఖీ చేయకుండానే టిటిడి అధికారులు కాగితాలపైనే ఎలా అనుమతులిచ్చారనేది కీలకం కానుంది. టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు అప్పన్న నుండి సేకరించిన సమాచారం కూడా సిట్ అధికారులు పరిశీలిస్తున్నారు. 2022 సంవత్సరంలోనే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన డెయిరీలు మళ్ళీ నెయ్యి సరఫరాచేయడానికి ఎలా,ఎవరు అంగీకరించారనేది తేలాల్సి ఉంది.కల్తీనెయ్యి బాగోతంలో సిబిఐ సిట్ అధికారులు గత పదినెలలుగా కీలకంగా లోతుగా చేపట్టిన దర్యాప్తులో ఇప్పుడు బాధ్యులైన పెద్దలకు నోటీసులు జారీచేయడానికి సిద్ధమయ్యారు. 2023-24 ఆరునెలలకాలంలో 10లక్షల కిలోల నెయ్యిసరషరాకు ఏఆర్ డైరీకి గత ఏడాది మే 15న ఆర్డర్ ఇచ్చామని, జూన్ 12,20, 25తేదీలతోబాటు జులై 6వతేదీ 4ట్యాంకర్ల కల్తీ నెయ్యి సరఫరా చేసిందనేది ఫిర్యాదులో కీలక అంశం. అయితే ఆలస్యంగా జులై 22,23,27తేదీల్లో ఆ డెయిరీకి షోకాజ్ నోటీసులు జారీచేశామనేది అప్పట్లోనే జిఎం కొనుగోళ్ళు తెలిపిన సమాచారం. ముందుగానే ఒప్పందం చేసుకున్నారనేది కూడా ఆధారాలు రాబట్టారు. **వాట్సాప్ ఛాటింగే నకిలీనెయ్యిబాగోతం బయటకు:** నకిలీ నెయ్యి సరఫరాకు పక్కా ఆధారాలు లభించాయన్నారు. బోలేబాబాడెయిరీ, కోల్‌కత్తా జ్యోతిష్ మధ్య వాట్సాప్ చాటింగ్ వివరాలు సేకరించామన్నారు. అయితే ఈ విచారణను ఈనెల 17కు న్యాయస్థానం వాయిదా వేయడంతో ఆ లోపు అసలు సూత్రధారులను పట్టుకుని అరెస్టుచేసినా ఆశ్చర్యపోవలసిన విషయం లేదనేది టిటిడి వర్గాల్లో సంచలనంగా మారింది. టిటిడి నుండి ప్రభుత్వానికి చేరిన రిపోర్టులో కల్తీ నెయ్యి తప్పిదాలకు ఎవరు బాధ్యత వహిస్తారనేది వెల్లడికావలసిన విషయం.

## 'నీట్' పిజి పరీక్ష

>> గా నీట్ పరీక్షను నిర్వహించడానికి రెండు నెలల కంటే ఎక్కువ సమయం కోరడాన్ని మొదట ప్రశ్నించిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం.. ఆతర్వాత కారణాలు నిజాయ తీగా ఉన్నాయని పేర్కొంది. అయితే పరీక్షను నిర్వహించడానికి ఎన్ఐబికి ఇక సమయం ఇవ్వబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మే 30న సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదే శాల ప్రకారం, పరీక్షను ఒకేషిఫ్ట్‌లో నిర్వహిం చాల్సి ఉందని ఎన్ఐబి కోర్టుకు తెలిపింది. అందువల్ల దాదాపు 1,000 పరీక్షా కేంద్రాలు అవసరమని ఎన్ఐబితరపు న్యాయవాది కోర్టుకి చెప్పారు. దీంతో జూన్ 15న జరగాల్సిన పరీక్షను వాయిదా వేసిన నేపథ్యంలో ఆగస్టు 3న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్య నిర్వహిస్తామని ఎన్ఐబి కోర్టుకి తెలిపింది. విచారణ సందర్భంగా ఆగస్టు 3వతేదీన నీట్ పిజి-2025 పరీక్ష జరపడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. నీట్ పిజి-2025 పరీక్షద్వారా ఎంఎస్ కోర్సుల్లో 12, 690, ఎండీ కోర్సుల్లో 24,360.. పిజి డిప్లొమా కోర్సుల్లో 922 సీట్లను భర్తీ చేయనున్నారు.

# మరో ముంబయిలా విశాఖ

>> గ్రిడ్, పోర్టుల అభివృద్ధి, పెట్రోకెమికల్స్ మెడికల్ టెక్, షిప్ బిల్డింగ్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, క్లీన్ టెక్, లేబర్ ఇంటెన్సివ్ మాన్యుఫాక్చరింగ్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయం. వచ్చే 7 ఏళ్లలో ఐటీ రంగంలో కనీసం 4 నుంచి 5 లక్షల ఉద్యోగాల కల్పన జరిగేలా లక్ష్యం. డేటా సెంటర్లు, స్టార్టప్‌లుఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడం. ప్రస్తుతం కొనసాగుతున్న 4 రైల్వే ప్రాజెక్టులతో పాటు అదనంగా 2032 కల్లా మరో 7 కొత్త రైల్వే ప్రాజెక్టులు పూర్తిచేయడం.మాన్యుఫాక్చరింగ్ నోడ్స్, పోర్టులకు అనుకూలించేలా కొత్తగా 9 రోడ్డు ప్రాజెక్టులు చేపట్టడం. 202830 కల్లా 77 కి.మీ. మేర నిర్మించే వైజాగ్ మెట్రో ప్రాజెక్టుపై చర్చించారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ ప్రణాళికలు అమలు చేయగలిగితే వచ్చే 7 ఏళ్లలో 7.5 లక్షల గృహాలు, 10,000 హోటల్ రూములు, 20 వరకు ఇన్నోవేషన్ సెంటర్లు, 10 కాలేజీలు, 7,000 ఆస్పత్రి బెడ్స్, 20,000 హెక్టార్ల పరిధిలో పరిశ్రమలు, 80 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ సముదాయం, 60 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో గోదాములు అదనంగా సమకూరతాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

**సముద్ర తీరం - సంపద నిలయం**: మూలపేటవిశాఖపట్నం, విశాఖపట్నంకాకినాడ మధ్య బీచ్ రహదారులు నిర్మిస్తాం. వీటిని జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తాం. సముద్ర తీరం సంపద నిలయం దానిని మరింత వినియోగించుకునేలా చూడాలి. పర్యాటకాన్ని పరిశ్రమగా గుర్తించాం, నూతన పాలసీ పెట్టుబడిదారులకు ఎంతో అనుకూలం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా యువతకు నిరంతరాయంగా నైపుణ్య శిక్షణ అందిస్తాం. వర్క్ ఫ్రమ్ హోమ్ నాలెడ్జ్ ఎకానమి అవుట్ సోర్సింగ్ విధానాలు అవలంభిస్తున్నాం. వర్క్ ఫ్రమ్ హోమ్ కింద 20 లక్షల మందికి అవకాశం కల్పించాలని ప్రయత్నిస్తున్నాం, అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీ విద్యుత్ సంస్కరణలు దేశానికే ఆదర్శం:** 1998లో విద్యుత్ సంస్కరణలు దేశంలోనే తొలిసారిగా తీసుకువచ్చాం. 2014లో రెన్యువబుల్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇచ్చాం. ఇప్పుడు అదే అత్యంత చవకైన విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించింది. టెక్నాలజీ పరిధి పెరిగింది. దీనిని విద్యుత్ రంగంలో వినియోగించే అద్భుతాలు సాధించాం. ఇప్పుడు ప్రజలే ఉత్పత్తిదారులువినియోగదారులుగా చేసేలా నూతన విధానాలు అమలు చేస్తున్నాం. ఎవరి విద్యుత్ వాళ్లే ఉత్పత్తి చేసుకుంటే విద్యుత్ సరఫరా నష్టాలు అనేవి ఉండవు. ఈవీ వాహనాలకు అందరూ మళ్లితే రవాణా ఖర్చులు కూడా పూర్తిగా తగ్గిపోతాయి. సోలార్, విండ్ పవర్‌తో పాటు పంప్డ్ ఎనర్జీ, బ్యాటరీ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తున్నాం. ఐదుకోట్లమందికి ... ఉన్నాం. ఆంధ్రప్రదేశ్ ఆకాంక్ష నెరవేరేందుకు నీతి ఆయోగ్ సహకారం కూడా కోరుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచేలా ప్రణాళికలు:** ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ ట్రాన్సిషన్ రోడ్ మ్యాప్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీతి ఆయోగ్, ఎనర్జీ ఫౌండేషన్ మధ్య ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహనా ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 27.3 గిగావాట్లుగా ఉంది. రాష్ట్రంలో 2019లో 55.6 బిలియన్ యూనిట్లుగా ఉన్న విద్యుత్ డిమాండ్ 2025 నాటికి 69.7 బి.యూ.కు చేరింది. ఇందులో పరిశ్రమలో రంగంలో 4.8 శాతం, గృహ వినియోగానికి 5.1 శాతం మేర డిమాండ్ పెరిగింది. వచ్చే ఏడాదికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 88.6 బి.యూ నుంచి 2035 నాటికి 163.9 బి.యూ. కు చేరుకోనుంది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద 2029 నాటికి 78.50 గిగావాట్ల సోలార్ విద్యుత్, 35 గిగావాట్ల విండ్, పంప్డ్ స్టోరేజ్ 22 గిగావాట్లు, గ్రీన్ హైడ్రోజన్ 1.50ఎంఎంటీపీఏ, బ్యాటరీ స్టోరేజ్ 25 గిగావాట్లు, ఎథనాల్ 1,500 కెఎల్‌పీడీ, 5,000 ఈవీ చార్జింగ్ స్టేషన్లు, 10,000 టీపీడీ బయో సీఎన్జీ లక్ష్యం. క్లీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి ఇప్పటిదాకా రూ.5.78 లక్షల కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. దీంతో 57.7 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. ఈసమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, సీఎస్ విజయానంద్, ఎనర్జీ ఫౌండేషన్ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కీర్తిచక్ర అవార్డు గ్రహీత మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడుకు జ్ఞాపికను అందిస్తున్న మంత్రి నారా లోకేష్

## మంత్రి లోకేష్‌ను కలిసిన మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడు

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే ప్రతిష్టాత్మక కీర్తిచక్ర అవార్డు పొందిన ఆర్మీ మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడు కుటుంబ సభ్యులతో సహా ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నగిరిపెంటకు చెందిన మల్లా రాంగోపాల్ నాయుడు మరాఠా లైట్ ఇన్ ఫాంట్రీ, 56వ బెటాలియన్, రాష్ట్రీయ రైఫిల్స్ మేజర్‌గా పనిచేస్తుండగా జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వద్ద దేశం కోసం ప్రాణాలకు తెగించి నలుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో పాటు తోటి సైనికులను రక్షించారు. దీంతో మేజర్ రాంగోపాల్ నాయుడును ఈ ఏడాది మే 22వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శౌర్య పురస్కారమైన కీర్తి చక్రతో సత్కరించారు. ఈ అవార్డుకు ఎంపికైన మొట్టమొదటి తెలుగు వ్యక్తిగా రాంగోపాల్ నాయుడు నిలిచారు. దేశం కోసం అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి కీర్తి చక్ర అవార్డు పొందిన రాంగోపాల్ నాయుడును ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు. దేశంతో పాటు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణంగా ఉందని ప్రశంసించారు. భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు

>> మిగతా రెండు రకాలకు పరిస్థితులను బట్టి ధర నిర్ణయిస్తాం. ఈ పొగాకు కొనుగోళ్ళతో ప్రభుత్వంపై రూ.300-350 కోట్ల భారం పడనుంది.+ఈ ఏడాది చిత్తూరు,తిరుపతి,అన్నమయ్య జిల్లాల్లో 5.5 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తి వచ్చింది. ఇదంతా ప్రాసెసింగ్ రకం.ఇప్పటికే ప్రాసెసింగ్ సంస్థల వద్ద 43 వేల టన్నుల మామిడి గుజ్జు నిల్వలున్నాయి. పార్లే ఆగ్రో,కోకోకోలా,పెప్సికో సంస్థల నుండి ఆర్డర్లు రాకపోవడమే సమస్యకు కారణం.రైతులు,ట్రేడింగ్ కంపెనీలు,ప్రొఫెసర్లను రిజిష్టర్ చేయాలి. రికార్డులు నిర్వహించాలి. కంపెనీలు కిలోకు రూ.8 ఇస్తే,ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నేరుగా కిలోకు రూ.4 చొప్పున జమ చేస్తుంది. ఇందులకు రూ.100-150 కోట్ల వరకు భరించనుంది.రైతుల నుంచి ఇప్పటికే 465 టన్నుల కోకో కొనుగోలు చేశారు. ఇంకా 745 టనున్నల నిల్వలు రైతుల వద్దే ఉన్నాయి. కనీసం కిలోకు రూ.500 దక్కేఆ చేసేందుకు ప్రభుత్వం కిలోకు రూ.50 చొప్పున చెల్లించనుంది. మొత్తం రూ.10.50 కోట్లు ఖర్చవుతుంది.రాష్ట్రంలో కోకో పాలసీ తీసుకురావాలి.నాణ్యత కల్గిన ఉత్పత్తులు వచ్చేలా రైతుల్ని చైతన్యపర్చాలి.ౖరతుబజార్లను 116 నుండి 200కు పెంచాలి.మొబైల్ మార్కెట్లు తీసుకురావాలి.పీఎం కిసాన్ డేటాకు అనుగుణంగా అన్నదాతా సుఖీభవ లబ్ధిదారుల జాబితా రూపొందించాలి.పామోలిన్‌పై దిగుమతి సుంకం తగ్గించడం వల్ల రైతులు ఎలా నష్టపోతున్నారో కేంద్రం దృష్టికి తీసుకెళ్ళాలి. నిర్ణయం వెనక్కి తీసుకునేలా కేంద్రాన్ని ఒప్పించే భాధ్యతను కేంద్ర మంత్రులు ఎంపీలు తీసుకోవాలి.ధరలు లేనప్పుడు ప్రత్నామ్యాయ పంటల వైపు రైతుల్ని మళ్ళించే భాధ్యత వ్యవసాయ

# పోలీసు విచారణలో మాజీ మంత్రి కాకాణి

**నెల్లూరు, జూన్ 6, ప్రభాతవార్త :** అక్రమ మైనింగ్ కేసులో అరెస్ట్ అయిన మాజీ మంత్రి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి వెంకటగిరి కోర్టు 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చింది. 14 రోజుల అనంతరం నెల్లూరు జిల్లా జైలు నుండి నెల్లూరు జిల్లా ఐదవ అదనపు కోర్టులో గురువారం విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తరపు న్యాయవాదులు విచారణ నిమిత్తం మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పోలీస్ కస్టడీకి అప్పగించాలని తెలిపారు. కోర్టు ఉత్తర్వులు మేరకు ఈరోజు ఉదయం నెల్లూరు సెంట్రల్ జైలు నుండి ముత్తుకూరు కృష్ణపట్నం పోర్టు పోలీస్ స్టేషన్‌కు మధ్యాహ్నం 2 గంటలకు భారీ బందోబస్తు నడుమ కాకాణి గోవర్ధన్ రెడ్డిని తీసుకువెళ్లారు. అక్రమ క్వర్ట్జ్ తవ్వకాల్లో ఏ 4గా నిందితుడిగా మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని మూడు రోజుల పోలీస్ కస్టడీకి ఇవ్వడంతో నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పోర్టు పోలీస్ స్టేషన్లో మొదటి రోజు విచారణ కొనసాగిస్తున్నారు. అత్యంత గోప్యంగా పోలీస్ బందోబస్తుతో నడుమ న్యాయవాదుల సమక్షంలో విచారణ కొనసాగుతుంది. సుమారు 7 గంటలకు కొనసాగిన విచారణలో అనేక ప్రశ్నలతో సంధించినట్లు సమాచారం. ఈ విచారణలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఏమి వివరాలు తెలిపారు అన్నది తెలియాల్సి ఉంది.

## కర్ణాటక సిఎం కార్యదర్శి,ఇంటెలిజెన్స్ చీఫ్ ఔట్

### తొక్కిసలాట కేసు: ఆర్సీబీ మార్కెటింగ్ హెడ్ అరెస్టు

**బెంగళూరు,జూన్6:** నగరంలో జరిగిన తొక్కిస లాట నేపథ్యంలో బెంగళూరు పోలీస్ కమిషనర్ మరియు మరికొందరు కీలక పోలీసు అధికారులను సస్పెండ్ చేసిన మరుసటిరోజే కర్ణాటక ముఖ్య మంత్రి సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శి కె. గోవిందరాజ్‌ను తొలగించి, నిఘా విభాగం అధిపతి హేమంత్ నింబాల్కర్‌ను బదలీ చేసింది. బుధ వారం ఉదయం ముఖ్యమంత్రి ఇంట్లో జరిగిన కీలక సమావేశంలో తొక్కిసలాటకు కొన్ని గంటల ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయో త్సవ వేడుకలకు అనుమతి ఇవ్వాలని పోలీస్ కమిషనర్ నిరాకరించినప్పటికీ, విజయోత్సవ కవాతుకు అనుమతి ఇవ్వలేమని చెప్పినం దున గోవిందరాజ్ తన ఉద్యోగాన్ని కోల్పోయారని వర్గాలు తెలిపాయి.రాష్ట్ర శాసనసభ సముదాయం, విధాన సౌధ మరియు చిన్నస్వామి స్టేడియం వద్ద రెండు కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలని గోవిందరాజ్ ఒప్పించారు. బుధవారం మధ్యాహ్నం జరిగిన తొక్కిసలాటలో 14 ఏళ్ల బాలికతో సహా 11 మంది మరణించగా, 47 మంది గాయపడిన సంగతి తెలిసిందే.



శుక్రవారం రాజభవన్ ఆవరణలో మొక్కను నాటుతున్న గవర్నర్ జస్టిస్ సయ్యద్అబ్దుల్ నజీర్

# మాతృమూర్తి పేరుతో ఒక మొక్క నాటాలి

### గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్

**విజయవాడ ,జూన్ 6 ప్రభాతవార్త ప్రతినిధి:** మాతృమూర్తి పేరు మీద ఒక మొక్క నాటాలని గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. ఇదే లక్ష్యంతో ప్రధాని మోదీ ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. వనమహోత్సవాల్లో భాగంగా ఆయన రాజ్‌భవన్ ఆవరణలో సపోట మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం ప్రకృతి పట్ల మనకున్న గౌరవం అంకితభావాన్ని చూపించే ప్రయత్నం. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని గవర్నర్ పేర్కొన్నారు. మొక్క నాటడం వలన ప్రకృతి మన సహవాసం బలపడుతుందన్నారు.ప్రతి పౌరుడు వనాలను పరిరక్షించడాన్ని కనీస బాధ్యతగా స్వీకరించాలన్నారు.గవర్నర్ సంయుక్త కార్యదర్శి పి.సూర్యప్రకాష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ వద్దంటే నగదు పంపిణి!

>> ఇచ్చే విషయంపై కసరత్తు ప్రారంభించి ఏపీ ప్రభుత్వం. ఇతర రాష్ట్రాల్లో ఉన్న పద్దతులకు సంబంధించి అధ్యయనం చేస్తోందట. గతంలో పాండిచ్చేరి ప్రభుత్వం అమలు చేసిన వివరాలు సేకరిస్తున్నారు అధికారులు .ఒక వేళ రేషన్ బదులుగా నగదు ఇస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి అందే సహకారంపై కూడా దృష్టి సారించింది ఏపీ ప్రభుత్వం. అయితే అక్రమ బియ్యం అరికట్టడానికి రేషన్ బదులు నగదు అమలు కూడా మంచిదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. దీనిపై త్వరలో స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

# భాస్కర్ ఎన్‌కౌంటర్‌లో హతం

>> సభ్యుడు మైలారపు ఆడెల్లు ఆలియాస్ బాస్కర్ మృతిచెందాడు.అతని వద్ద నుండి ఏకే 47 తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.ఇతని స్వస్థలం అదిలాబాద్ జిల్లా బోధ్ మండలం పొచెర గ్రామం. సుమారు మూడు దశాబ్దాల క్రితం మావోయిస్టు ఉద్యమాల పట్ల ఆకర్షితుడై అనేక పోరాటాల్లో పాల్గొని రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎదిగారు కాగా నేషనల్ పార్క్ ఏరియాలో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారనే సమాచారం సెర్చ్ ఆపరేషన్ చేపట్టినట్లు బస్తర్ ఐజీసుందర్ రాజ్.పి గురువారం మీడియాకు తెలిపారు. ఈసెర్చ్ఆపరేషన్‌ని ఏడిజివివేకానంద సిన్హా,బస్తర్CRPF ఐజి రాకేష్‌అగర్వాల్

# మాజీ ఎంపీ అంకినీడు ప్రసాద్ కన్నుమూత

>> అంకినీడు ప్రసాద్ మృతి పట్ల పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పందిస్తూ, "జమిందారు వ్యవస్థలోనూ, ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ ప్రజలకు సేవ చేసిన ఘన చరిత్ర చల్లపల్లి జమిందారు వంశీయుల సొంతం" అని అన్నారు. "చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అనువంశిక ధర్మకర్తలుగా ఈ ప్రాంతంలోని మోపిదేవి, శ్రీకాకుళం, పెదకళ్లేపల్లి, యార్లగడ్డ, శివగంగలోని ప్రముఖ ప్రాచీన దేవాలయాల అభివృద్ధి, నిర్వహణలో శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామప్రసాద్ బహద్దూర్ అడుగుజాడల్లో అంకినీడు ప్రసాద్, వారి సోదరులు విశేష కృషి చేశారు" అని తెలిపారు. అంతేకాకుండా, "ఎస్ఆర్‌వైఎస్‌పీ ఉన్నత పాఠశాల, కళాశాల ద్వారా వేలాది మంది పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారు. అంకినీడు ప్రసాద్ మృతి చల్లపల్లి ప్రాంతానికి తీరనిలోటు" అని బుద్ధప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ కూడా అంకినీడు ప్రసాద్ మృతికి సంతాపం తెలియజేశారు. "మాజీ ఎంపీ అంకినీడు ప్రసాద్ మాకు అత్యంత సన్నిహితులు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా ఎవరు వెళ్లినా సమస్యలు విని సహాయం చేసే గొప్ప మనిషి. వివాదరహితుడిగా అన్ని వర్గాల ప్రజల ప్రేమాభిమానాలు పొందిన మానవతావాది, అరుదైన రాజకీయ నేత" అని ఆయన కొనియాడారు. "ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి" అని కొనకళ్ల నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రులు కొల్లి రవీంద్ర, కొలుసు పార్థసారధి,అవనిగడ్డ శాసనస భ్యులు మండలిబుద్ధప్రసాద్,ఎంపీవల్లభనేని శౌరి, మాజీ మంత్రి పేర్నివెంకట్రామయ్య(నాని) తదిత రులు అంకినీడు మృతికి విచారం వ్యక్తం చేసారు.

## పోలవరం-బనకచర్ల టెండర్లు త్వరలో

>> బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు నిర్మాణం చేపడుతుండగా, దీనికోసం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఇప్పటికే ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఆర్థిక వనరుల సమీకరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం ప్రతిపాదనలు పంపించింది. మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే రూ.81,900 కోట్ల వ్యయంలో 50 శాతం అంటే రూ.40,950 ఈఏపీ రుణంగా పొందాలని నిర్ణయించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌గా 20 శాతం నిధులు రూ.16,380 కోట్లు సమకూర్చుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీగా 10 శాతం నిధులు రూ.8,190 కోట్లు, హ్యామ్ విధానంలో మరో 20 శాతం నిధులు రూ.16,380 కోట్లు ఖర్చు చేయనున్నారు. **ఈ ఏడాది చివరికల్లా పోలవరం డయాఫ్రమ్ వాల్ :** మరోవైపు పోలవరం ప్రాజెక్టు సివిల్ నిర్మాణం పనులు ఇప్పటివరకు 81.70 శాతం పూర్తయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో కేవలం 3.84 శాతం పనులు మాత్రమే చేయగా, 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల కాలంలో 5.93 శాతం పనులు జరగడం విశేషం. డయాఫ్రమ్ వాల్ 64 శాతం, బట్రెస్ డ్యామ్ 91 శాతం, ఇసుక గట్టి పరిచే వైబ్రో కంప్రాక్షన్ పనులు 54 శాతం పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికల్లా డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి కానుంది. మరోవైపు, పోలవరం ప్రాజెక్టు పనులు అనుకున్న సమయానికి పూర్తయ్యేలా కాంట్రాక్టర్లతో చర్చించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పంచాయితీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, సీఎం కార్యదర్శి రాజామౌళి, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, సీసీ ఎల్ ఏ జయలక్ష్మి హాజరయ్యారు.

## వారం - వర్జ్యం

తేది : 07-06-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
ద్వాదశి పూర్తి
చిత్త ఉ.9.39
వర్జ్యం మ.3.57-5.45
దు.శ.5.35-7.15
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** పనులు సకాలంలో సాగుతాయి. మిత్రుల నుండి విమర్శలు ఎదుర్కొంటారు. సోదరుల కలయిక.

**వృషభం :** ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగవు. గృహ నిర్మాణ ఆలోచనలు స్థిరంగా వుండవు.

**మిథునం:** భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా వుంటుంది.

**కర్కాటకం :** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**సింహం:** అందరిలోనూ ప్రత్యేక గుర్తింపు పొందుతారు ఆరోగ్య సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**కన్య :** ఉద్యోగాలకు ఊహించని బాధ్యతలు పెరుగుతాయి, వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**తుల :** ఇంటర్వ్యూలకు హాజరవుతారు. ఉద్యోగాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**వృశ్చికం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. మీ నైపుణ్యానికి గుర్తింపు పొందుతారు.

**ధనుస్సు:** రాజకీయ, కళారంగాలలోని వారు సన్మానాలు, సత్కారాలు పొందుతారు. వాహన సౌఖ్యం.

**మకరం:** ఆర్థికపరమైన లావాదేవీలు సంతృప్తికరంగా వుంటాయి. రుణాలు తీరి ఊరటచెందుతారు.

**కుంభం:** ప్రతి విషయంలోనూ ఆలోచించి ముందుకు సాగడం శ్రేయస్కరం. ధనలాభం.

**మీనం :** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. పనులు సజావుగా సాగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## సంప్రదాయ కళలకు ప్రోత్సాహాన్నందిస్తున్న ఐసిసిఆర్

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్త ప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంప్రదాయ కళలను ప్రోత్సహించి అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించే అవకాశాలు కల్పించేందుకు ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్)ముందుకొచ్చింది. ఈ విషయంలో అవసరమైన సహకారం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి,ఐసీసీఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మనీషా స్వామి,ఏపీ సాంస్కృతికశాఖ డైరెక్టర్ మల్లిఖార్జునరావు ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీసీఆర్ డైరెక్టర్ జనరల్ నందిని సింగ్లా,ఏపీ భవన్ ప్రత్యేక రెసిడెంట్ కమీషనర్ అర్జా శ్రీకాంత్ పాల్గొన్నారు.



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై పోస్టరును ఆవిష్కరిస్తున్న దృశ్యం

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కలిసికట్టుగా కృషిచేద్దాం: కలెక్టర్ డా. జి.లక్ష్మీశా

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. స్థానిక కలెక్టరేట్ చాంబర్లో శుక్రవారం కార్మిక, మహిళా శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (సిఆర్ఏఎఫ్) ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై రూపొందించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యతిరేక మాసం సందర్భంగా ఈనెల 30వ తేదీ వరకు కార్మిక, పోలీస్, స్వచ్ఛంద సంస్థలు ,రెవెన్యూ, శాఖల అధికారులు స్పెషల్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించాలన్నారు. బాల, కౌమార కార్మిక నిషేధం, నియంత్రణ చట్టం మేరకు 14 సంవత్సరాల లోపు బాలలను, 14 నుంచి 18 ఏళ్ల లోపు వయస్సు వారిని ప్రమాదకర పనుల్లో పెట్టడం నేరమన్నారు. బాలల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. బాలలను, కౌమార బాలలను, బాల కార్మికులుగా పనిచేస్తున్నట్లు గుర్తిస్తే ఫోన్:100,1098, 1800 102 7222 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ఉప కార్మిక కమిషనర్ సి. హెచ్.ఆశారాణి, ఐసిడియస్ పిడి డి. శ్రీలక్ష్మి డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ యం.రాజేశ్వరరావు, వాసవ్య మహిళామండలి డా. వి.కీర్తి, సి ఆర్ ఏ ఎఫ్ ప్రతినిధి ప్రభాకర్, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ సభ్యులు ఎ.రమేష్, సహాయ కార్మిక అధికారులు పాల్గొన్నారు.



ఎపి ఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

## ఎపి ఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం

**సచివాలయం,జూన్ 6,ప్రభాతవార్త :** ప్రపంచ యోగా దినోత్సవం (జూన్21) ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన యోగ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా,ఏపి స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపిఎస్పీఎఫ్) ఈరోజు ఎన్‌టిటిపిఎస్,ఇబ్రహీంపట్నంలో ఘనంగా సామూహిక యోగ కార్యక్రమాన్ని నిర్వహించింది.కార్యక్రమంలో ఏపి ఎస్పీఎఫ్‌కి చెందిన సుమారు 300మంది అధికారులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.శాంతివన్ యోగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు లంకె జనార్ధన్ మార్గనిర్దేశనలో ఏపిఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ,ఐపిఎస్ పర్యవేక్షణలో ఈ యోగా కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ యోగ యొక్క శారీరక,మానసిక లాభాలు,మరియు దాని అవసరాన్ని గురించి సిబ్బందికి ప్రేరణాత్మకంగా ప్రసంగించారు.కార్యక్రమంలో ఐజి బి.వెంకటరామిరెడ్డి, కమాండెంట్ ఎం.శంకరరావు, డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ రామాంజనేయులు, ఇతర ఉన్నతాధికారులు, అసిస్టెంట్ కమాండెంట్ లు, ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ యోగ కార్యక్రమం ద్వారా ఎస్పీఎఫ్ సిబ్బందిలో ఆరోగ్యపరమైన చైతన్యం,ఒత్తిడి నివారణ,మరియు మానసిక స్థైర్యం పెంపొందించే దిశగా అద్భుతమైన అడుగు వేయడం జరిగింది.

## ఐదేళ్ల నిధుల వ్యయంపై సమగ్ర విచారణ

### - టిటిడిలో ముఖ్యతనిఖీ అధికారిగా సాయిప్రసాద్

**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమలతిరుపతిదేవస్థానంలో బడ్జెట్ రూపకల్పన ఆదాయం,వ్యయాలకు సంబంధించి ,అభివృద్ధి పనులు నిధులు వ్యయం తదితర అంశాలపై తనిఖీచేయడానికి ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి జి.సాయిప్రసాద్‌ను నియమించింది. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని వైసిపి పాలకమండలి కూడా నిధులు దుబారా,వ్యయంపై ఈయన విచారణ చేసే అవకాశం ఉందనేది తెలుస్తోంది. టిటిడి పాలనా వ్యవహారాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. టిటిడిలో తొలిసారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి, సిఎం కార్యాలయంలో ప్రత్యేక సిఎస్ హోదాలో ఉన్న సాయిప్రసాద్‌ను నియమించడం ఆసక్తికర చర్చనీయాంశంగా మారింది .2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆయనను టిటిడిలో ముఖ్య ఇన్‌స్పెక్టింగ్ (తనిఖీ)అధికారిగా నియమితులయ్యారు. 2010 తరువాత వెలువడిన చీఫ్ ఇన్స్‌పెక్టింగ్ అధికారి నియామకంతో ఆయన తిరుమల,తిరుపతికి చేరుకుని టిటిడికి చెందిన అన్ని వభాగాల అధికారులతో సమావేశం కానున్నారు. టిటిడిలో పాలన, ఆదాయం, నిధులు వ్యయంపై ఆరా తీయనున్నారు. గతంలో సాయిప్రసాద్ ఉమ్మడి చిత్తూరుజిల్లా కలెక్టర్‌గా కూడా పనిచేసిన అనుభవం ఉంది. ఇప్పుడు టిటిడిలో అప్పగించిన బాధ్యతలు అంశంలో ఎలా ముందుకు కదులుతారనేది చూడాల్సిందే.

## విశాఖ రైల్వే జోన్ జిఎంగా సందీప్ మాథుర్



**గుంతకల్లు రైల్వే,జూన్ 6,ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ మొట్టమొదటి జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథూర్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రైల్వే బోర్డు సంయుక్త కార్యదర్శి విక్రమసింగ్ దహియా ఆదేశాలు జారీ చేశారు. 1988వ బ్యాచ్‌కు చెందిన సందీప్ మాథూర్ భారతీయ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ క్యాడర్‌కు చెందిన అధికారి. ప్రస్తుతం రైల్వే బోర్డులో సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునీకీకరణ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

## తుడా నిధులతో శ్రీకాళహస్తి అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి,జూన్ 6 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి తుడా పరిధిలో ఉంది కాబట్టి ఇక్కడ తుడా నిధులతో ఏం ఏం పనులుచేయవచ్చునో పరిశీలించి తుడా చైర్మెన్‌తో కలసి నిధులు సాధనకు కృషి జరుగుతుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పంచాయతీరాజ్ అ తిధి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన శ్రీకాళహస్తి అభివృద్ధికి సంబంధించి వివరించారు. ముఖ్యంగా తుడా నిధుల సాధనకు కృషి చేస్తున్నామన్నారు.శ్రీకాళహస్తి మున్సిపాలిటి అభివృద్ధికి సంబంధించి చక్కటి ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పన్నుల విధానం అస్తవ్యస్తంగా ఉందన్నారు.ఎవరైతే పన్నుల చెల్లింపులకు సంబంధించిన ప్రక్షాళను చేయాల్సి ఉందన్నారు. శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రిని తుడా నిధులతో అభివృద్ధి చేయుటకు పరిశీలిస్తున్నట్లు వివరించారు. ప్రాథమిక అంచనాల మేరకు రూ.15కోట్లతో ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఇక గత ప్రభుత్వం శివం టు శివం రోడ్డు నిర్మాణానికి రూ.44కోట్లుతో సొమ్ములు స్వాహ చేయటానికి సిద్ధం చేసారని అయితే కానీ తాము అధికారంలోకి వచ్చిన తరువాత దానిని రూ.29కోట్లకు టెండర్లు పిలిచామన్నారు.అయితే పట్టణంలోని మురుగునీరు తరలించుటకు మరో రెండు మూడు కోట్లతో కొత్తగాడ్రైనేజ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయని ఆదేశించినట్లు సుధీర్‌రెడ్డి వివరించారు. తాను ఎన్నికల ప్రచారానికి వెళ్ళి నపుడు 4,6,7 వార్డుల్లో మంచినీటి సమస్యను వివరించారన్నారు. అయితే కొండమిట్ట ఎన్‌టి ఆర్ నగర్ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా పైపులైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని నడిరోడ్డులో విద్యుత్ స్థంభాలున్నాయని వాటిని సరిదిద్దుటకు మున్సిపల్ అధికారులకు ఆదేశించామన్నారు. ముఖ్యంగా కొండమిట్ట ప్రాంతంలో మంచినీటి సరపరాకు ఒకే పైప్ లైన్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.పాత మంచినీటిసరఫరా లైన్లుఅస్తవ్యస్తంగా ఉన్నాయని వాటిని తొలగించనున్నట్లు వివరించారు.

# ప్రతిభావంతులైన టెన్త్, ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు

### - ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు మండలాల వారీగా ప్రదానం

### - ప్రతి జిల్లాకు 36 మంది ఎంపిక

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2024- 25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇటీవల విడుదలైన ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు మండలాల వారీగా ఎంపిక చేసి షైనింగ్ స్టార్స్ అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కోన శశిధర్ మార్గదర్శకాలను విడుదల చేశారు. విద్యా వ్యవస్థలో నాణ్యత, ప్రమాణాలు పెంచేందుకు అవార్డులు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలిపింది. ఈ నెల 9న అన్ని జిల్లా కేంద్రాల్లో అవార్డులు ప్రదానం చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పదో తరగతిలో 500 మార్కులు లేదా 83.33 శాతం, ఆపైన అత్యధిక మార్కులు సాధించిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు మండలాల వారీగా ఎంపిక చేసి అవార్డులు ఇస్తారు. ప్రతి మండలంలో అత్యధిక మార్కులు సాధించిన మొత్తం ఆరుగురు పదో తరగతి విద్యార్థులకు అవార్డులు ఇస్తారు. ప్రతి మండలంలో ఇద్దరు ఓసీ , ఇద్దరు బీసీ, 1 ఎస్సీ, 1 ఎస్టీ విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఇంటర్‌లో 830 మార్కుల పైన అధిక మార్కులు సాధించిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు జిల్లాల వారీగా ఎంపిక చేసి అవార్డులు ఇవ్వనున్నారు ఇంటర్ విద్యార్థులకు ప్రతి జిల్లాకు 36 మంది ఉత్తమ విద్యార్థుల చొప్పున షైనింగ్ స్టార్ అవార్డులు ఇస్తారు. అవార్డుకు ఎంపికైన పది, ఇంటర్ విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్ తో పాటు 20 వేల నగదు ప్రోత్సహకం అందించి సన్మానించనున్నారు. రాష్ట్రంలో 10వ తరగతి ఫలితాల్లో మొత్తం 81.14 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 93.90 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా నిలవగా 47.64 శాతం ఉత్తీర్ణతతో ఆలూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది. 84.09 శాతం ఉత్తీర్ణతతో బాలికలు పైచేయి సాధించగా 78.31 శాతం ఉత్తీర్ణతతో బాలురు నిలిచారు. 10వ తరగతి పరీక్షలకు 6,14,459 మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో 4,98,585 మంది ఉత్తీర్ణత సాధించారు. 1,680 పాఠశాలల్లో వందశాతం ఫలితాలు వచ్చాయి. కాకినాడ భాష్యం పాఠశలకు చెందిన నేహాంజని అనే విద్యార్థిని 600కు 600 మార్కులు సాధించి అరుదైన రికార్డు సృష్టించింది.

ఫలితాలను జిల్లాలవారీగా పరిశీలిస్తే 93.90 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా మొదటి స్థానం, 91.43 శాతంతో బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా 2వ స్థానం, 89.14 శాతం ఉత్తీర్ణతతో విశాఖ జిల్లా మూడవ స్థానాల్లో నిలిచాయి. గుంటూరు, అనకాపల్లి, తూర్పుగోదావరి, విజయనగరం, ఎన్టీఆర్, ప్రకాశం, కృష్ణా జిల్లాలు ఆ తర్వాతి 10 స్థానాల్లో నిలిచాయి. పల్నాడు, బాపట్ల, నెల్లూరు, శ్రీకాకుళం, కాకినాడ జిల్లాలు ఆ తర్వాతి 15 స్థానాల్లో నిలిచాయి. 16వ స్థానంలో పశ్చిమ గోదావరి, 17వ స్థానంలో నంద్యాల, 18వ స్థానంలో కడప, 19వ స్థానంలో తిరుపతి, 20వ స్థానంలో అన్నమయ్య జిల్లాలు నిలవగా ఏలూరు, సత్యసాయి, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

## జోరుగా సాగుతున్న మసుల బీచ్ ఉత్సవాలు

**విజయవాడ.జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ లో జరుగుతున్న మసులా బీచ్ ఫెస్టివల్2025 శుక్రవారం రెండవ రోజుకు చేరుకున్నాయి.?ఈ క్రమంలో ఆటల పోటీలు,సాంస్కృతిక కార్యక్రమంలో హుషారెత్తిస్తున్నాయి. ఈక్రమంలో ?హోరా హోరీగా జరుగుతున్న బీచ్ కబడ్డీ పోటీలు ప్రజల ఆదరణతో చెలరేగి ఆడుతున్న క్రీడాకారులు వాటర్ స్పోర్ట్స్ కు కేంద్రంగా మచిలీపట్నం బీచ్.. శ్రీ కొల్లు రవీంద్ర, రాష్ట్ర గనులు, భూ గర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ ల మంత్రి వాటర్ స్పోర్ట్స్ కు కేంద్రంగా మచిలీపట్నం బీచ్ మారుతుందని రాష్ట్ర ఘనులు, భూ గర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ ల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.. మచిలీపట్నం బీచ్ లో శుక్రవారం మంత్రి మాట్లాడుతూ బీచ్ క్రీడలకు మచిలీపట్నం ఎంతో అనువైందని భవిష్యత్తులో బీచ్ క్రీడలకు హబ్ గా మచిలీపట్నం మారుతుందన్నారు.. ప్రజలు కూడా ఉత్సాహంగా బీచ్ ఫెస్టివల్ లో పాల్గొంటున్నారన్నారు.. మచిలీపట్నంలో ముసులా బీచ్ ఫెస్టివల్ లో భాగంగా రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నిర్వహిస్తున్న 12 వ జాతీయ బీచ్ కబడ్డీ సీనియర్ పురుషులు మరియు మహిళల పోటీలు అంగరంగ వైభవంగా గురువారం రాత్రి 7 గంటలకు మొదలై అర్థ రాత్రి వరకు జరిగాయి.. ఈ పోటీలకు దేశం నలుమూల నుండి వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు 22 టీమ్ లు, పురుషులు 23 టీములు పాల్గొన్నారు. ఈ పోటీల్లో భాగంగా మొదటి రోజు జరిగిన లీగ్ మ్యాచ్ లలో పాల్గొన్న టీమ్ లు అందులో గెలుపొందిన జట్ల వివరాలు.. సీనియర్స్ మహిళల జట్ల పోటీల వివరాలు... బీహార్ పై ఉత్తరప్రదేశ్ జట్టు 50/5 పాయింట్ల తేడాతో విజయం సాధించింది... గోవా పై హర్యానా జట్టు 49/6 పాయింట్ల తేడాతో విజయం సాధించింది... ఢిల్లీ పై ఆంధ్రప్రదేశ్ జట్టు 53/17 పాయింట్ల తేడాతో విజయం సాధించింది... విదర్భ పై హిమాచల్ ప్రదేశ్ జట్టు 60/16 పాయింట్ల తేడాతో విజయం సాధించింది... తెలంగాణ పై వెస్ట్ బెంగాల్ జట్టు 47/46 పాయింట్ల తేడాతో విజయం సాధించింది... పాండిచ్చేరి పై పంజాబ్ జట్టు 52/19 పాయింట్ల తేడాతో విజయం సాధించింది... ఉత్తరాంచల్ పై తమిళనాడు జట్టు 59/55 పాయింట్ల తేడాతో విజయం సాధించింది... కర్ణాటక పై రాజస్థాన్ జట్టు 55/12 పాయింట్ల తేడాతో విజయం సాధించింది... పురుషుల విభాగం జట్ల పోటీల వివరాలు... ఒడిస్సా పై కేరళ జట్టు 51/41 పాయింట్ ల తేడాతో విజయం సాధించింది.. విదర్భ పై ఢిల్లీ జట్టు 45/10 పాయింట్ల తేడాతో విజయం సాధించింది.. చత్తీస్గడ్ పై మహారాష్ట్ర జట్టు 54/18 పాయింట్ల తేడాతో విజయం సాధించింది.. జార్ఖండ్ పై హర్యానా జట్టు 55/14 పా యింట్ల తేడాతో విజ యం సాధిం చింది..



మహిళా కబడ్డీ ప్లేయర్స్‌ను పరిచయం చేసుకుంటున్న మంత్రి కొల్లురవీంద్ర

తెలం గాణ పై ఆంధ్ర ప్రదేశ్ జట్టు 49/22 పాయింట్లు తేడాతో విజయం సాధించింది కర్ణాటక పై ఉత్తరా ఖండ్ జట్టు 47/26 పాయింట్ల తేడాతో విజయం సాధిం చింది.. పాండిచ్చేరి పై ఉత్తర ప్రదేశ్ జట్టు 58/32 పాయింట్ల తేడాతో విజయం సాధించింది.. మధ్యప్రదేశ్ పై తమిళనాడు జట్టు 48/33 పాయింట్లు తేడాతో విజయం సాధించింది.. మసులా బీచ్ ఫెస్టివల్లో హెలీ రైడ్స్ ప్రారంభం హెలీ రైడ్స్ ప్రారంభయ్యాయి.

హెలీరైడ్ తో బీచ్ పరిసరాలను పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర, మంత్రి రాష్ట్ర ఘనులు, భూ గర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి మసుల బీచ్ ఫెస్టివల్లో ప్రత్యేక ఆకర్షణగా ఫుడ్ కోర్ట్,వివిధ ప్రాంతాలలో ప్రసిద్ధి చెందిన వంటకాల రుచులుమసుల బీచ్ ఫెస్టివల్ లో వివిధ ప్రాంతాలలో ప్రసిద్ధి చెందిన వివిధ రకాలైన ఫుడ్ స్టాల్, ఫుడ్ కోర్టులు, ఫాస్ట్ ఫుడ్స్, బిర్యానీ స్టాల్స్ ఏర్పాటు చేశారు.

## అన్నదానం సేవా మార్గానికి అత్యుత్తమం

### వ్యవసాయ కమిషనర్ ఢిల్లీ రావు

**విజయవాడ,జూన్,6,ప్రభాతవార్తప్రతినిధి:** మానవ జీవితంలో భగవంతుని అనుగ్రహం పొందేందుకు ఎన్నో మార్గాలు ఉన్నప్పటికీ వాటిలో అన్నదానం,ధార్మిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా భగవంతుని అనుగ్రహం పొందడం అత్యుత్తమ మార్గమని వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. తాడేపల్లి లోని విజయవాడ క్లబ్ రోడ్ లో గల ఆర్. ఎల్. గౌతమి రివర్ బ్రీజ్ అపార్ట్మెంట్ నివాసితుల ఎన్.ఎస్.వి. ప్రసాద్ నన్నపనేని, రేవతి నన్నపనేని దంపతులు, అక్షయితి, శ్రీహిత, నన్నపనేని కుటుంబ సభ్యుల సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం నిత్య అన్నదాన నిర్వహణ కోసం పంపుతున్న 10 టన్నుల కూరగాయల వాహనానికి ఆయన జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ హిందువులు భక్తిప్రపత్తులతో దర్శించుకునే ఆరాధ్య దైవం, కలియుగ వైకుంఠం ఏడుకొండలపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సాయం చేసే అవకాశం సామాన్యులకు కూడా కల్పించడం ఎంతో ముదావహమన్నారు. సమాజంలో ఎంతో మంది తమ తమ ఆకాంక్షల మేరకు సమాజ సేవకు వారి పరిధి మేరకు అందిస్తున్న సేవల్లో అన్నదానానిదే అత్యున్నత స్థానమన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అందిస్తున్న సేవలలో భాగస్వామ్యం కావడం లభించే అవకాశం అందరికీఉండదన్నారు. మనం చేసే మంచి కర్మలే తిరిగి మనకు మంచి ఫలితాలు ఇస్తాయన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా స్ఫూర్తి పొంది మరింత ముందు దాతలు ధార్మిక కార్యక్రమాలకు ముందుకు రావాలని కోరారు. తనకు ఉన్నదానిలో ఒకరికి ఇవ్వడం అనే సంకల్పం మనలో ఒక గొప్ప చైతన్యాన్ని నింపుతుందన్నారు. కూరగాయలను విరాళంగా అందించిన నన్నపనేని ప్రసాద్, రేవతి దంపతులు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆలోచనల మేరకు తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా స్వామి వారికి సేవ చేసుకునే అదృష్టం మాకు కలిగిందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు మరడ నాగేంద్ర మాట్లాడుతూ ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని కీర్తిశేషులు మండవ కుటుంబరావు 2006లో ప్రారంభించారని గుర్తుచేశారు. రాష్ట్రంతోపాటు వేసి విదేశాలలోని స్వామివారి భక్తులు గత 18 సంవత్సరాలుగా తిరుమల తిరుపతి దేవస్థానానికి కూరగాయలను వితరణగా అందిస్తున్నారన్నారు. దేవదేవుడుని దర్శించుకునే ప్రతి భక్తునికి దాతలు వితరణ చేస్తున్న కూరగాయలతోనే అన్నదానం నిర్వహిస్తోందన్నారు. లక్షలాది మందికి ప్రతిరోజు ఆహారాన్ని అందించడం ఎంతో కష్టమైన సేవ అని పేర్కొన్నారు. జీవితంలో స్థిరపడిన ప్రతి ఒక్కరి విజయం వెనుక భగవంతుని కృప ఉంటుందన్నారు. మనం చేసే ప్రతి సత్కార్యము మనం నమ్మిన దైవశక్తి పిలుపు మేరకే నిర్వహించ గలుగుతున్నా మన్నారు. భగవంతుని అన ుగ్రహంతో, దాతల సహకారంతో రా నున్న రోజుల్లో మరిన్ని ధార్మిక కార్యక్రమాలు నిర్వ హించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు.



నిత్య అన్నదాన నిర్వహణకు కూరగాయల వాహనానికి జెండా ఊపుతున్న వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్. ఢిల్లీరావు



విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న ఎంపి చిన్ని

## సంకల్పబలం కలిగిన నాయకుడు విద్యాసాగర్

### విజయవాడ ఎంపి కేశినేని చిన్ని

**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** గత మూడు దశాబ్దాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ సుపరిచితులు, ఎన్టీఆర్ జిల్లా వాసి అలపర్తి విద్యాసాగర్ ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నిక కావడం అభినందనీయమని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేసినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడలోని పార్లమెంటు సభ్యుని కార్యాలయంలో ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత అలపర్తి విద్యాసాగర్ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్నిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌ను చిన్ని ఘనంగా సత్కరించారు.అనంతరం చిన్ని మాట్లాడుతూ సామరస్య పూర్వక ధోరణితో సమస్యలను చాకచక్యంగా పరిష్కరించగలగే ఏకైక నేతగా విద్యాసాగర్ ను అభివృద్ధిచారు. విద్యాసాగర్ ఎన్నికతో రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతాయని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఉద్యోగుల మనోభావాలకనుగుణంగా, వారితో స్నేహపూర్వక సంబంధాలు కలిగిన విద్యాసాగర్ లాంటి వారు రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నిక కావడం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చక్కని పునాది అన్నారు. ప్రధానంగా ఒక ఉద్యోగ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలు అన్ని విద్యాసాగర్ లో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. పోరాట పటిమ కలిగిన నాయకులు కనుమరుగు అవుతున్న ప్రస్తుత కాలంలో విద్యాసాగర్ లాంటి వారు అరుదుగా ఉంటానన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహపూర్వక సంబంధాలు అవలంబిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పట్ల తనకు కొంతమేర అవగాహన ఉందన్నారు. తిరువూరు లోని ఎన్జిజీవో నాయకులు ఇటీవల ఐటిఐ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారని తెలిపారు. వారి కోరికను కార్యరూపంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నానన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి చిత్తశుద్ధితో సహకరిస్తారని తాను నమ్ముతున్నానన్నారు.

## లక్ష్యాన్ని మించి దూసుకుపోతున్న యోగాంధ్ర

### - వైద్యఆరోగ్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు

**సచివాలయం,జూన్ 6,ప్రభాతవార్త :** ప్రజల్లో యోగాను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నెల రోజుల యోగాంధ్ర వివిధ అంశాలకు సంబంధించి లక్ష్యాలను అధిగమిస్తూ దూసుకుపోతుంది.మే 21న ప్రారంభించిన ఈ నమోదు కార్యక్రమం ద్వారా యోగా కార్యక్రమాల్లో పాల్గొనడానికి పౌరుల నమోదు 2కోట్ల లక్ష్యానికిగాను గురువారం నాటికి 1,86,46,143మంది యోగా ఔత్సాహికులు ఇప్పటికే నమోదుచేసుకున్నారని యోగాంధ్ర పురోగతిని పర్యవేక్షిస్తున వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యోగాంధ్ర రాష్ట్ర సమన్వయకర్త ఎం.టి.కృష్ణబాబు గురువారం రాత్రి మంత్రుల బృందానికి నివేదించారు.నిర్ధేశించుకున్న లక్ష్యంలో ఇది 93శాతం అని ఆయన వివరించారు.యోగాంధ్ర కార్యక్రమ కార్యకలాపాలకు ఇంకా 2వారాలు మిగిలి ఉన్నందున తుది నమోదు 2కోట్ల లక్ష్యాన్ని మించిపోయే అవకాశం ఉందని ఆయన తెలిపారు. శిక్షకుల నమోదు మరియు శిక్షకులకు శిక్షణకు సంబంధించి నిర్ధేశించుకున్న నెలవారీ లక్ష్యాన్ని ఇప్పటికే అధిగమించామని ఆయన చెప్పారు.2,600మంది మాస్టర్ ట్రైనర్ల నమోదు లక్ష్యానికి గాను 5,451మంది (209శాతం) ఇప్పటికే నమోదు చేసుకున్నారన్నారు.మండల స్థాయిలో 1,25,000మంది లక్ష్యాలనికి గాను 118శాతం మంది అంటే 1,47,817మంది శిక్షకులు ఇప్పటికే నమోదు చేసుకున్నారని ఆయన వివరించారు.శిక్షకులకు శిక్షణకు సంబంధించి 5,451మంది మాస్టర్ ట్రైనర్లు (లక్ష్యంలో 206శాతం) మరియు 1,43,881 (115శాతం) మంది మండల్ ట్రైనర్లకు ఇప్పటివరకు శిక్షణ ఇచ్చామన్నారు.ఈనెల 21న విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 1,34,991ప్రదేశాల్ని నమోద చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటివరకు 78,730ప్రదేశాల్ని నమోదు చేశారని ఎం.టి.కృష్ణబాబు తెలిపారు.


VIJAYAWADA MUNICIPAL CORPORATION

'E' Procurement Notice No.10/VMC/CDB/2025-26, Dt.06-06-2025

Roads, Pipe lines, Toilets, Drain, Culvert, Water supply, repairs (Total 122 works)-Est. Amount Rs.2540.30 Lakhs.

All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of

Further details and any corrigendum can be seen@www.tender.apeprocurement.gov.in.

Sd/-
For COMMISSIONER

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

PROCUREMENT SHORT TENDER NOTICE

| Sl. No. | NIT No. | Name of Work |
| --- | --- | --- |
| 1 | 26/PROC/MAU61-FA0REV(null)/4/2025-ACC/2nd Call Dt.06.06.2025. | RFP for Engaging Programme Auditor for World Bank & ADB funding programme in APCRDA for F.Y.2025-26 |
| 2 | 36/PROC/MAU61-USI0HB(OTH)/135/2025-HB Dt.06.06.2025 | Providing Architectural finishes, Electro-mechanical, Plumbing works to three (3) nos. of PEB structures to accommodate all the balance departments under Municipal Administration & Urban Development wing of GoAP near APCRDA Project Office at Amaravati, Andhra Pradesh. Est. Cost - Rs.48.60 Crores |

The bid can be downloaded on AP e-procurement portal from 09.06.2025 to 17.06.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 17.06.2025 up to 15.00 Hrs. Technical bid opening 17.06.2025 @ 16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.

E-PROCUREMENT TENDER NOTICE

| S.No. | NIT No. | Name of Work |
| --- | --- | --- |
| 1 | NIT No. 44/ MAU 61-PLG0AUD/1/ 2025-PLG, Dt. 06.06.2025 | APCRDA - "RFP for engagement of Landscape Architect for providing Comprehensive Designs for Landscape, Waterways, Bridges etc., in Amaravati Government Complex". |

The bid can be downloaded on AP e-procurement portal from 09.06.2025 to 24.06.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 24.06.2025 up to 15.00 Hrs. Technical bid opening 24.06.2025 @ 16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.

Sd/- Commissioner, APCRDA, Vijayawada

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివి తేటలు ఉండి అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యం అవసరం.

-సి.డబ్ల్యు వెండైట్

# సంక్షోభంలో యువజనం!

యువతే జాతి పురోగతికి మూలాధారం. నేటి బాలలు, యువతీయువకులే రేపటి దేశభవిత నిర్ణేతలు. యువజనశక్తి యుక్తులే దేశాభివృద్ధికి బాటలు అంటూ ఉపన్యాసాలిస్తూ కోట్లాది రూపాయలు వారిసంక్షేమం,అభ్యుదయం కోసం వెచ్చిస్తున్నట్లు ప్రకటిస్తున్నా ఆశించిన ఫలితాలు కన్పించడం లేదు. యువజనుల్లో రోజురోజుకు నిరుత్సాహం పెరిగిపోతున్నది. నిరక్షరాస్యులైన యువతీ యువకులే కాదు ఉన్నత చదువులు అభ్యసించిన వారు కూడా నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. పట్టణాల్లో, నగరాల్లో ఉన్న యువతీ యువకుల పరిస్థితి ఇందుకు మినహాయింపు కాకపోయినా దేశ ప్రగతికి పట్టుగొమ్మలైన గ్రామీణప్రాంతాల్లో ఉంటున్న యువత పరిస్థితి రాను రాను అత్యంత దయనీయంగా తయారవుతున్నది. చదివిన చదువులకు తగ్గట్టుగా ఉపాధి దొరక్కపోయినా జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకొని దుర్భరపరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసి గ్రామాల్లో రోజు వారీ వ్యవసాయ కూలీకి వెళ్లలేక ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో వెళ్లినా అలవాటులేని కష్టం చేయలేక దేశంలో కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. నగరాలకు చేరుకొని అర్థాకలితో జీవనం గడుపుతూ పోటీ పరీక్షలకు తయారవుతున్న యువజనం పరిస్థితి వర్ణనాతీతం. పనిచేసే శక్తి ఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేధాశక్తి ఉంది. కష్టపడి పని చేయాలనే ఉత్సాహం ఉంది. తమకు సంఘంలో ఒక స్థానం కల్పించుకోవాలనే తపన ఉంది. అయినా ఏ ఆధారం లేక నిరుత్సాహంతో, అర్థాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు. ఏ చిన్న ఆధారం దొరికినా కష్టపడి పనిచేయడానికి వెనుకాడడం లేదు. ఇకపోతే మెడికల్, ఇంజినీరింగ్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులు చేసేందుకు మెరికల్లాంటి యువతీయువకులు విదేశీబాట పడుతున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో చదువుకున్నామని వారికి కూడా తెలుసు. ఇక్కడ ప్రజల డబ్బుతో చదివి ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందించాల్సిన యువతరం ఏదోరకంగా విదేశాలకు వెళ్లి అక్కడ నానా ఇబ్బందులు పడుతూ తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకొని అక్కడి ప్రజలకు సేవలు అందించడానికి ఆరాటపడుతున్నారు. ఇలా విదేశాలకు వెళ్లుతున్న వారిలో ప్రపంచంలో భారత్ అగ్రస్థానంలో ఉంటే అందులో తెలుగు రాష్ట్రాలు మొదటివరుసలో ఉన్నాయని చెప్పొచ్చు. ఇలా వీరంతా ఎందుకు వెళ్లుతున్నారనేది ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదు. ఒకవేళ వీరంతా ఇక్కడే సేవలు అందించాలనుకున్నా వారికి తగిన వసతులు, వేతనాలు చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడు తాజాగా అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు స్వీకరించిన ప్పటి నుంచి ఆ దేశం నుంచి విదేశీయులను పంపేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వేలాది మంది విద్యార్థులకు వీసాలు రద్దు చేసి వారివారి ప్రదేశాలకు పంపే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు.అలా పంపడంలో చేతులకు బేడీలు వేసి తరలించే కార్యక్రమం చేపట్టేందుకు కూడా వెనుకాడడం లేదు. రానురాను అమెరికాకు వెళ్లేందుకు దారులు మూసుకుపోతున్నాయి. ఇతర దేశాల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానేఉంది. ఇక స్వదేశంలో నిరుద్యోగుల కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక స్వయం ఉపాధి పథకాలు చేపట్టి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. అధునాతన ప్రపంచంలో కాలాన్ని మించిన వేగంతో శస్త్రసాంకేతిక రంగాలు పురోగమిస్తున్నాయి. ఆధునిక మానవుడు అపూర్వమైన మేధాశక్తిని సంతరించుకొని శక్తియుక్తులు,ప్రతిభా సామర్థ్యాలతో విశ్వాంతరాలపై సాధిస్తున్న విజయాల వెనుక యువశక్తి పాత్ర అత్యంత కీలమైందనే విషయం అందరికితెలిసిందే. నవభారత నిర్మాణానికి ఉద్యమించి దేశకీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేయాల్సిన పవిత్ర బాధ్యత యువజనుల భుజస్కంధాలపై ఉందనేది కూడా నిర్వివాదాంశం. పల్లె పల్లెల్లో, ప్రతి బస్తీల్లోనూ పరిస్థితులను చక్కదిద్ది ఆర్థికంగా, సామాజికంగా సంస్కృతికంగా యువజనులంతా కలిసి కృషిచేస్తేనే జాతి ఉజ్వల భవిష్యత్ సుసాధ్యమవుతుందని ఏనాటి నుంచో పాలకులు వక్కాణిస్తూనే ఉన్నారు. ఇలాంటి ఉపన్యాసాలు వింటూనే ఉన్నాం. వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా యువజనుల అభ్యున్నతికే పనిచేస్తున్నామని పాలకులు ఎంతగా చెప్పుకుంటున్నా నిరాశానిస్పృహలు యువజనుల్లో ఎందుకు కలుగుతున్నాయనే అనుమానం రాకతప్పదు. అటు గ్రామాల్లోని యువత, ఇటు నగరాల్లోని యువజనం కుల,మత వర్గ బేధాలు అనిలేకుండా అందరిలోనూ ఇవి వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి లక్షలాది దరఖాస్తులు వచ్చాయి. ఆ పథకంపై ఎందరో ఆశలుపెట్టుకున్నారు.ఇలా ప్రతి రాష్ట్రంలోనూ యువత సంక్షేమం కోసం పథకాలు చేపడుతూనే ఉన్నారు. అయితే కాగితాల్లోనేకాక వాస్తవాల్లోకి వెళ్లిచూస్తే గతంలో యువజన సంక్షేమం కోసం పెట్టిన పథకాలు ఏమాత్రం నిజమైన అర్హులకు అందాయో తెలుస్తుంది. అందులో రాజకీయ జోక్యం, అవినీతి, ఆశ్రితపక్షపాతాన్ని ఎందుకు నిరోధించలేకపోతున్నారు. ఫలితంగా ఎన్నో పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందడం లేదు.అటు ఉద్యోగాలు రాక,ఇటు స్వయంఉపాధి పథకాలు అనర్హుల పాలవుతుంటే నిరాశానిస్పృహలకు లోనవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారు కూడా లేకపోలేదు. యువజనుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి. అందుకు ముఖ్యంగా ప్రభుత్వ వైఖరిలో మార్పురావాలి. యువజన సంక్షేమ కార్యక్రమాలు త్రికరణశుద్ధిగా అమల చేయాలి.

కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మగౌరవాన్ని కోల్పోడు.



జార్జి బెర్నార్డ్ షా

సమర్థులైనవారే ఎప్పుడూ నాయకత్వం వహిస్తారు. అందరికీ మార్గదర్శకులవుతారు. తక్కినవారు వారిని అనుసరిస్తూ ఉంటారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్

## ప్రజావాక్కు



### జీవితం విలువ తెలుపాలి

ఈ మధ్యకాలంలో పిల్లలు చిన్నచిన్న విషయాలను కూడా తీవ్రమైనవిగా భావించి, ఉలికిపాటుకు గురవుతున్నారు. పరీక్షల్లో తక్కువమార్కులు రావడం,తల్లిదండ్రులు, తోటి పిల్లల మాటలు కూడా వారిలో తీవ్రఒత్తిడిని కలిగిస్తున్నాయి. ఈ ఒత్తిడివల్ల వారు జీవితంపై ఆసక్తి కోల్పోయి, ఆత్మహత్య వంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. చిన్న సమస్యలను పెద్దవిగా భావించడం, ఆలోచనల్లో స్థిరత లేకపోవడం, భావోద్వేగాలను వ్యక్తపరచలేకపోవడం,ఇందుకు ప్రధానకారణాలు. చిన్నసమస్యలు కూడా పరిష్కారమయ్యే మార్గాలున్నాయని, జీవితం విలువైనదని వారికి తెలియజేయాల్సిన బాధ్యత మన అందరిది.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### అభిమానం ఎక్కువైతే ఇలాగే..

బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియమ్‌లో జూన్ 5 వ తేదీన అట్టహాసంగా ప్రారంభించిన రాయల్ చాలెంజర్సు బెంగుళూరు ఐపిఎల్ విజయోత్సవ వేడుకలో తొక్కిసలాట సంభవించి పదకొండు మంది చనిపోగా నలభైకి పైగా అభిమానులు క్షతగాత్రులయ్యారనివార్త.తొక్కిసలాట మరణాలు కొత్తవి కావు. ఈ మధ్య ముగిసిన కుంభమేళా స్నానాల ఘట్టంలోనూ, హైద్రాబాద్‌లో సంధ్య సినిమాహాలు వద్ద పుష్పా2 రిలీజ్ సందర్భంలోను జరిగిన అనుభవాలు ప్రజలకు కనువిప్పు కలిగించకపోవడం విచారకరం. స్టేడియం వద్ద చనిపోయిన వారందరు యువకులే.హాజరైన అభిమానులే ముఖ్యమైన కారణం. కాని ప్రభుత్వాన్ని, పోలీసులను ఆడిపోసు కోవడం మామూలు అయిపోయింది.

-డా. ఎన్. ఎస్. ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### అశ్లీల వెబ్ సైట్లను నిషేధించాలి

మన దేశంలో ఇంటర్నెట్ వినియోగం పెరిగే కొద్దీ, యూత్ పయనిస్తున్న దిశలు కూడా మారిపోతున్నాయి. ముఖ్యంగా,అశ్లీల వెబ్‌సైట్లను తిలకించేసంఖ్య రోజు రోజుకు భయంకరంగా పెరుగుతోంది అన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ అశ్లీలవెబ్‌సైట్ల వల్ల యువత మానసికంగా దిగజారిపోతున్నారు. విద్యాప్రతిభ తగ్గిపోతోంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని దేశాలలో లాగా, అశ్లీల వెబ్‌సైట్లను పూర్తిగా నిషేధించాలనే చర్య తీసుకోవాలి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### ఆర్సీబీ విజయోత్సవంలో విషాదం

పద్దెనిమిది సంవత్సరాల తర్వాత ఐపీ.ఎల్. లో తొలిసారిగా కప్పు గెలుచుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగుళూరు (ఆర్సీ బీ) విజయోత్సవాల్లో విషాదం నెలకొంది. చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 47 మంది గాయపడటం చాలా విచారకరం. స్టేడియం సామర్థం కేవలం 40 వేలు మందికి మాత్రమే కాగా సుమారు రెండు లక్షల పైచిలుకు అభిమానులు తరలి వచ్చినట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే భారీ తొక్కిసలాటకు దారితీసిందని భావిస్తున్నారు. అభిమానం సినిమా దీయేటర్ల వరకూ, టీవీల ముందు ఉండాలే తప్ప వీధుల్లోకి వచ్చిప్రాణాలు తీసుకొని తల్లితండ్రు లకు మానసిక క్షోభ ఇవ్వడం కాదు. ఈ సంబరాల వల్ల మృతి చెందిన ఆ కుటుంబాలకు దిక్కెవరు?. ఇలాంటి సంబరాలను ముందు ముందు ఏ రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థించడం కరెక్ట్ కాదేమో అనిపిస్తుంది.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### ప్లాస్టిక్‌ను నిషేధించాలి

జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని వార్షిక కార్యక్రమంలా జరుపుకున్నాం. వ్యర్థ పదార్థాల ద్వారా సంభవించే అనారోగ్య సమస్యల నుండి రక్షణ కలిగేలా అందరూ కలిసి కట్టుగా చర్యలుతీసుకోవాలని వ్యాసాలు, ఉపన్యాసాలు చాలానే వచ్చాయి. అయితే ఇందుకు నడుంకట్టుకునేదవరనేదెవరు? దీనికి సమాధానం ప్రధమంగా ప్రభుత్వానిదే. ప్లాస్టిక్ సంచులను వాడద్దని చెబుతారేగాని ఈ ప్రొడక్ట్ ఉత్పత్తిని నిషేధించరెందుకు? పొద్దున కొనే పాల ప్యాకెట్ల నుండి సంతలో కొనే కూర గాయలను మూటగట్టే వన్నీ ప్లాస్టిక్ సంచులే. కొంత కాలక్రితం ఈసంచులను వాడద్దని షాపులవారిని హెచ్చరించారు. ఈ ప్రమాదకరమైన ఉత్పత్తిని నిషేధించాలి.

-ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### పారదర్శకతతో సీటు ఇవ్వాలి

దేశంలో కొన్ని వందల విశ్వవిద్యాలయాలు ఉంటాయి. వాటి పరిధిలో వేల విద్యార్థుల వృత్తి విద్యా కోర్సులు లక్షలు ఖర్చు చేసి, శ్రమతో భవిష్యత్తు కోసం రిస్క్ తీసుకుంటారు. అది ఏ కోర్సు అయినా అభ్యర్థి ర్యాంకు, కేటగిరి ఒకటే. సదరు ప్రవేశ పరీక్షకు అన్నికోణాల్లో స్పష్టమైన నిబంధాలుంటాయి. కళాశాల ప్రవేశం సమానప్రతిభ ఉన్నప్పుడు, ఏఅంశం మీద ప్రాధాన్యత ఉందో తెలియపరుస్తూ అభ్యర్థికి అనుమానం నివృత్తి చేయాలి.

-బొల్లోజు మేఘానధ్, విశాఖపట్నం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పేదలకు దూరమవుతున్న 'ప్రజారోగ్యం'!

**బ్యాంకుల నుంచి అప్పోసొప్పో చేసి నక్షత్ర హోటళ్ల స్థాయికి మించి ఆస్పత్రులను నిర్మించడం, ఆ తర్వాత పెట్టుబడిని వడ్డీతోసహా రాబట్టడం కోసం చేయకూడని, చేయరాని పనులు కూడా చేయడానికి వెనుకాడడం లేదు. ఈసంపాదన ఆరాటపు పోటీలో కొందరు నైతిక విలువలు పాటించడం లేదు. అందరూ అలాగే చేస్తున్నారని చెప్పడం లేదు కానీ అధిక శాతం ఆ మార్గంలోనే పయనిస్తున్నారు. వినడానికి కఠినంగా అనిపించినా ఇది వాస్తవం. పాలకులు కూడా ఈ విషయంలో ప్రేక్షకపాత్ర వహించడం దురదృష్టకరం. ప్రజారోగ్య రంగంలో ఇటువంటి వారిపై నిబంధనలు రూపొందించకపోవడం విచారకరం. సమీక్షలు, అధ్యయనాలు, కమిటీలతో కాలం గడుపుతున్నారే తప్ప సమగ్ర చట్టానికి రూపకల్పన జరగడం లేదు. ప్రజారోగ్య పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ఆరోగ్యవంతమైన సమాజం వైపు మనం పయనిస్తున్నామని చెప్పుకోవడం ఎంత ఆత్మవంచనో ఒకసారి మనసుపెట్టి ఆలోచించాలి.**

దామెర్ల సాయిబాబ

'అప్పిచ్చువాడు వైద్యుడు. ఎప్పుడు ఎడతెగకపారుయేరు..'లాంటి వసతులున్న ఊరినే నివాసానికిఎంపిక చేసుకోవాలని ఏనాడో సుమతీశతకకారుడు చెప్పారు. మన పెద్దలు వైద్యానికి ఎంత ప్రాముఖ్యత ఇచ్చారో ఇంతకు మించి ఉదాహరణ చెప్పక్కర్లేదు. జనారోగ్యమే జాతి మహాభాగ్యమని దేశ ప్రజలందరిని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయాల్సిన బాధ్యతపాలకులపై ఉంటుందని మనరాజ్యాంగ నిర్మాతలు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగానే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశారు, చేస్తూనే ఉన్నారు. కేంద్రప్రభుత్వం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాయి. అయినా ఆ కోణంలో ఆశించిన మేరకు ఫలితాలు చేకూరడం లేదు.అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త కొత్త మందులు, చికిత్సా విధానాలను కనిపెడుతూనే ఉన్నారు. అయితే అంతకు రెట్టింపు స్థాయిలో వైద్యనిపుణులకు అంచనాలకు అందని రీతిలో రకరకాల రోగాలు కూడా విజృంభిస్తున్నాయి. మొన్నటివరకు మానవజాతినే గడగడలాడించిన కరోనా వ్యాధి మళ్లీ చాపకింద నీరులా విస్తరిస్తుందనేవార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.శుక్రవారం నాటికి ఐదువేలమూడు వందల మందికిపైగా ఈ వ్యాధిసోకింది. మొత్తంయాభైఐదు మందికిపైగా మరణించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. దీనికితోడు మరికొన్ని విషజ్వరాలు విజృంభిస్తూనే ఉన్నాయి. కరోనా వ్యాధి మొదటిసారి సోకినప్పుడు దాన్ని అంతగా పట్టించుకో లేదు. కానీ రానురాను దాని ఉధృతికి ప్రపంచంలోని ఈ దేశం ఆ దేశం అనికాదు అన్ని దేశాలు భయాందోళనకుగుర య్యాయి. అగ్రరాజ్యమని విర్రవీగే అమెరికా లాంటి దేశం కూడా చిగురుటాకుల్లా వణికింది. భారతదేశం పరిస్థితి కూడా ఆందోళనకరంగా తయారైంది. ఈ రంగం, ఆరంగం అనికాదు విద్యారంగాన్ని మొదలు పెట్టుకొని ఆర్థికరంగం ఒకటేమిటి అన్ని విభాగాలపై దీని ప్రభావం తీవ్రంగా పడింది. లక్షలాది మంది వలస కార్మికులు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ వ్యాధికి ఖచ్చితమైన చికిత్సలేదనేది వాస్తవమే కావొచ్చు. కానీ శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుకుంటే కొంతమేరకైనా వ్యాధిని నిరోధించవచ్చునని వైద్యనిపుణులు సూచించారు. ప్రస్తుతం కరోనా మళ్లీ విస్త రిస్తుందనే వార్తలు రావడంతో అప్రమత్తంగా ఉండాలని, రోగనిరోధక శక్తిని పెంచుకునే దిశలో చర్యలు తీసుకోవాలని డాక్టర్లు చెబుతున్నారు. వాస్తవంగా మనదేశంలో వైద్యఆరోగ్య రంగం డొల్లతనం కరోనా సమయంలో బయటపడింది. బెడ్లు, ప్రాణవాయువు (ఆక్సిజన్) అందక వేలాది మంది మరణించారంటే ఏమనుకోవాలి. మొదటిసారి కాదు, రెండోసారి విజృంభించినప్పుడు కూడా పరిస్థితిని అదుపు చేయ లేకపోయారు. ప్రాణాలను కాపాడలేక చేతులెత్తేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే కోవిడ్‌పై యుద్ధానికి అవసరమైన సాధన సంపత్తిని సమకూర్చుకోవడంలో విఫలమయ్యారని చెప్పొచ్చు. ప్రస్తుత పరిస్థితులు కూడా అందుకు విరుద్ధంగా లేవు. దేశ ఆరోగ్యవ్యవస్థ ఎంత బలహీనంగా ఉందో విజృంభిస్తున్న రోగాలు బయటపెడుతున్నాయి. వైద్య బృందాలు మాత్రం శక్తిమేరకు ఈ రోగాలవ్యాప్తిని అరికట్టి చికిత్స అందించేందుకు కృషిచేస్తూనే ఉన్నాయి. ఆనాటి కరోనా సమయంలో ఎందరో వైద్యులు నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా పోరులో దాదాపు ఎనిమిది వేలమందికిపైగా సిబ్బంది బలైపోయినట్లు

## ఒక్క మాట

అప్పట్లోనే అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి. అన్నింటి కంటే ఘోరంగా వైద్య సిబ్బంది ఈ కరోనాను నియంత్రించేందుకు సిద్ధంగా ఉన్నా అవసరమైన వెంటిలేటర్లు, బెడ్లు లేకపోవడం నిస్సహాయంగా ఉండిపోవాల్సి వచ్చింది. ఏది ఏమైనా కరోనాయే కాదు విషజ్వరాల నుండి ప్రధానంగా నిరుపేదలను కాపాడడంలో విఫలమవుతున్నారనిచెప్పొచ్చు. ఇంతటి భారీ నష్టాలు చూసిన తర్వాత కూడా గుణపాఠం నేర్చుకోకపోవడం దురదృష్టం. పాలకులకు ఎన్నో ప్రాధాన్యతలు ఉంటాయి. ఓట్ల కోసం, సీట్ల కోసం, అధికారం కోసం వరాలు గుప్పించడం, అవి తీర్చేందుకు వందల కోట్లే కాదు లక్షల కోట్ల రూపాయలు వెచ్చించడం సహజమే, అవసరం కూడా. కానీ అదే సమయంలో ప్రజారోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు నిధుల కేటాయింపులు అంశాలకు అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదనేది కేంద్ర, రాష్ట్రాలు వైద్యరంగానికి కేటాయిస్తున్న నిధులను బట్టి తెలుస్తుంది. రోడ్లు అవసరమే. సంక్షేమ పథకాలను కాదనలేం. దారిద్ర్యరేఖకు దిగువనున్న నిరుపేద, నిర్భాగ్యులకు చేయూతనందించాల్సిందే. అందులో మరో వాదనకు తావులేదు. అదే సమయంలో వైద్యరంగాన్ని విస్మరించడం ఎంతటి ప్రమాదానికి దారితీస్తున్నదో తరచుగా బయటపడుతున్నది. కళ్లముందు ప్రాణాలు పోతున్నా కనీస ప్రయత్నం కూడా చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నామంటే ఏమనుకోవాలి. ఎన్నో విదేశాలతో పోల్చినా భారతదేశంలో వైద్యరంగానికి కేటాయిస్తున్న నిధులు అంతంత మాత్రంగానే చెప్పొచ్చు. ఉన్న నిధులను సక్రమంగా వెచ్చించడంలోకూడా పర్యవేక్షణాలోపం స్పష్టంగా కనపడుతున్నది. అవినీతికూడా వైద్యరంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మొన్న హైదరాబాద్ నడిబొడ్డులో ఉన్న ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో రోగులకు సరఫరా చేసిన ఆహారంలో కల్తీ ఉండడంతో ఒకరు మరణించడంతోపాటు తొంభైమూడు మంది అస్వస్థతకు గురయ్యారు. వారంతా విధివంచితులు. మానసిక వ్యాధిగ్రస్తులు. కళ్లముందు ఏం జరుగుతున్నా ప్రశ్నించలేరు. అలాంటి వారికి కల్తీ ఆహారం సరఫరా కావడం ఎంతటి దుస్థితిలో ఉన్నామో అర్థంచేసుకోవచ్చు. నకిలీ,నాసిరకం మందులు ఎందరి ప్రాణాలో తీస్తున్నాయి. నగరాల్లో ప్రైవేట్ వైద్యం అందుబాటులో ఉండడంతో కొంతవరకు ఖరీదైనా వైద్యం లభిస్తున్నది. కానీ గ్రామాల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రభుత్వరంగ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలు మౌలిక వసతుల సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామీణ ఆరోగ్య అవసరాల కోసం పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రపంచ ఆరోగ్యవ్యవస్థ ప్రమాణాలకు ఏ మాత్రం పోల్చడానికి వీలులేకుండా తయారవుతున్నాయనేది అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మొన్న ఆమధ్య వెల్లడించిన లెక్కల ప్రకారం భారత్‌లో దాదాపు ఏడు లక్షలకు పైగా గ్రామాల్లో తొంభై కోట్ల మందికిపైగా ప్రజలు నివసిస్తున్నారు. ముప్పైవేల ప్రాథమిక కేంద్రాలు సేవలు అందిస్తున్నాయి. అందులో అధికశాతం ఆరోగ్య కేంద్రాలు ఒకే వైద్యుడి ద్వారా సేవలు అందిస్తుండగా ఐదు శాతం అసలు వైద్యుడే లేకుండా నడుస్తున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. దేశ ప్రజలు యేటా చేస్తున్న ఆరోగ్య వ్యయంలో రోగనిరోధక శక్తి కోసం 9.6 శాతం వెచ్చిస్తుండగా మూడు లక్షల అరవైవేల కోట్ల రూపాయలు రోగచికిత్సకోసం ఖర్చు చేస్తున్నారు. ఇక ప్రైవేట్ వైద్యం బీదాబిక్కిలకే కాదు సామాన్యులకు కూడా అందుబాటులో లేకుండాపోయింది. వైద్యం ఒక వ్యాపారం అయింది. రోగిని, రోగాన్ని పరిశీలించి, పరీక్షించి వైద్యం అందించే రోజులుపోయి రోగి జేబును చూసి వైద్యం చేసే రోజులు దాపురించాయి. బ్యాంకులనుంచి అప్పోసొప్పో చేసి నక్షత్ర హోటళ్లస్థాయికి మించి ఆస్పత్రులను నిర్మించడం, ఆ తర్వాత పెట్టుబడిని వడ్డీతో సహా రాబట్టడం కోసం చేయకూడని, చేయరాని పనులు కూడా చేయడానికి వెనుకాడడంలేదు. ఈసంపాదన ఆరాటపు పోటీలో కొందరు నైతిక విలువలు పాటించడంలేదు. అందరూ అలాగే చేస్తు న్నారని చెప్పడంలేదు కానీ అధికశాతం ఆ మార్గంలోనే పయనిస్తున్నారు. వినడానికి కఠినంగా అనిపించినా ఇది వాస్తవం. పాలకులు కూడా ఈ విషయంలో ప్రేక్షకపాత్ర వహించడం దురదృష్టకరం.ప్రజారోగ్యరంగంలో ఇటువంటి వారిపై నిబంధనలు రూపొందించకపోవడం విచారకరం.సమీక్షలు,అధ్యయనాలు, కమిటీలతో కాలం గడుపుతున్నారే తప్ప సమగ్ర చట్టానికి రూపకల్పన జరగడంలేదు.ప్రజారోగ్య పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ఆరోగ్యవంతమైన సమాజం వైపు మనం పయనిస్తు న్నామని చెప్పుకోవడం ఎంత ఆత్మవంచనో ఒకసారి మనసుపెట్టి ఆలోచించాలి.ఆరోగ్యం విషయంలో బాధ్యతంతా ప్రభుత్వాలపై వేయకుండాప్రజలు కూడా స్వీయనియంత్రణ పాటించాల్సిన అవసరం ఉంది. ●

# మానసిక రోగులకు వైకల్యమే శాపమా?

ఆళవందార్ వేణు మాధవ్

భారత పార్లమెంట్ ద్వారా ప్రజల హక్కులను కాపాడటానికి చట్టాలు రూపొందించబడినవి. వీటిలో కార్మికులు స్త్రీలు, బాలలు, వృద్ధులకు ప్రత్యేక హక్కులు కల్పించబడినవి. వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం సమాన హక్కులు, సమాన అవకాశాలు, గౌరవం, వివక్షత నిరోధించడానికి 'వికలాంగుల హక్కుల చట్టం2016ను పార్లమెంట్ ఆమోదించబడి 19 ఏప్రిల్ 2017 అమలు కాబడుతుంది. ఈ చట్టం ప్రకారం అంధత్వం, దృష్టిలోపం, కుష్టు, వినికిడి లోపం, చలనం లేని వైకల్యం,మానసిక వైకల్యం, మానసిక అనారోగ్యం లాంటి లోపాలు గుర్తించబడినవి. ఇలాంటి లోపాలున్న వ్యక్తులకు ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు కల్పించే బాధ్యత కలదు. 2014 సంవత్సరం ఒక నివేదిక ప్రకారం తెలంగాణ మొత్తం రాష్ట్ర జనాభాలో 12.2శాతం వికలాంగుల సంఖ్య ఉందని ఒక అంచనా. వికలాంగులు మానసికంగా కృంగిపోకుండా వారి మనోవికాసం కొరకు, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పునరావాసం కొరకు పింఛన్, ఇతరులపై ఆధార పడకుండా ఉన్నత విద్యలో రిజర్వేషన్లు, రైలు, బస్సులలో ప్రత్యేక రాయితీలు, బ్యాంక్, పోస్ట్ ఆఫీసులలో ప్రత్యేక క్యూలైన్ వసతి కల్పించింది. వికలాంగులు అనగానే ప్రజల మనస్సులో తళుక్కున మెరిసేవారు అంధులు, బధిరులు మాత్రమే, పుట్టుకతో కొంతమంది మానసికంగా శారీరక ఎదుగుదల లేని చాలా మంది సమాజం, కుటుంబంలో ఆదరణ లేక ఇతరులకు చెప్పుకోలేని స్థితి జీవిస్తున్నారు.



ఇలాంటి వారిని ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు గుర్తించి వారికి అవకాశాలు కల్పిస్తున్నాయి. మానసిక వికలాంగులలో మానసిక వైకల్యం, మానసిక అనారోగ్యం అనే రెండు రకాలు. వీటిలో మానసిక వైఫల్యం పుట్టుకతో వచ్చేది. రెండవది వారు జీవించే స్థితిలో ఉంది. నేడు ఎక్కువగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. చదువుల కొరకు తల్లితండ్రులు, విద్యాసంస్థల ఒత్తిడి, ప్రేమ వైఫల్యం, నిరు ద్యోగం, పేదరికం, ఐ.టి రంగాల్లో పని భారం, మాదక ద్రవ్యాల సేవనం, రోడ్డు, రైలు ప్రమాదాల వలన కూడా మానసిక అనారోగ్యం పాలై ఎటువంటి గుర్తింపు, ఆదరణ లేక జీవచ్ఛవాలుగా జీవిస్తున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎటువంటి సౌకర్యాలు లభించుటలేదు. రైల్వేలలో అన్ని రకాల వికలాంగులతో పాటు వారి అనుచరులకుకూడా రాయితీలు కల్పిస్తున్నారు. తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, విద్యార్థులకు వికలాంగులకు,విలేఖరులకు, బస్ పాసులు ఇస్తూ రాయితీలు ఇస్తుంది. నగరాల్లో ఉన్న మానసికవ్యాధి నిపుణుల వద్దకు మానసిక రోగులు చికిత్స కొరకు రావడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. వీరి ప్రయాణ నిమిత్తం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో పాసులు, రాయితీలు లేవు. పార్లమెంట్ ఆమోదించిన వికలాంగుల చట్టం2016 ప్రకారం మానసిక అనారోగ్యంతో బాధపడే వారికి రాయితీ లు ఇవ్వాలి. దేశంలో అత్యున్నత పార్లమెంట్‌లో ఆమోదిం చిన చట్టాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఖచ్చితంగాఅమలు పరచాలి. కావున తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నడిపే బస్సులలో మానసిక వైకల్యం, మానసిక అనారోగ్యంతో బాధపడే వారికికూడా ప్రత్యేక పాసులు,రాయుతీలు ఇవ్వాలి. ●

# పోషకాహార లోపమే వ్యాధులకు మూలం!



రామ కిష్టయ్య సంగన భట్ల


ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని మొట్టమొదటి సారిగా 2019లో ఘనంగా జరుపుకున్నారు. 'ది ఫుచర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టి' అనే నినాదంతో జెనీవాలోని అడిస్‌అబాబా కాన్ఫరెన్స్‌లో ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలంటూ పిలుపునిచ్చారు. ప్రజల్లో ఆహారభద్రతపై మరింత అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ ఏడాది కూడా ఈ దినోత్సవాన్ని సరికొత్త థీమ్‌తో ఘనంగా నిర్వహించనున్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ సహకారంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తుంది.ఆహార భద్రత అనేది ప్రభుత్వాలు, ఉత్పత్తిదారులు, వినియోగదారుల మధ్య భాగస్వామ్య బాధ్యత. అంతేకాదు మనం తీసుకునే ఆహారం సురక్షితమైనదేనా అని నిర్ధారించడంలో రైతు నుంచి కూలివరకు ప్రతి ఒక్కరి పాత్రఉంది. ఆహార భద్రత కోసం తగు చర్యలు తీసుకునేలా ప్రపంచ దేశాలను ప్రోత్సహించడం, ఆహార కొరత సమస్య ఉత్పన్నం కాకుండా చూడడం, ప్రజలు రకరకాల వ్యాధులను ఎదుర్కొనేలా వారికి పౌష్టికరమైన ఆహారం అందుబాటులో ఉండేలా చేయడం వంటివి తమ ప్రధాన ఎజెండాగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ పేర్కొంది. ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని విలువ తెలుస్తుంది. ఆహారం పారేయడానికి ఒక్క నిమిషం చాలు,కాని ఆ ఆహారాన్ని పండించడానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృధా చేస్తారు. దీనికి సంబంధించే అంటే ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈరోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం జరుపుకుంటారు. ఒకరు రోజంతా కష్టపడికూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా అది కడుపు నింపుకోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకంటే ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగుతామనో, లావైపోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్థలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురుకుంటున్న వారు చాలా మంది ఉన్నారు. అలాగే వ్యాధుల బారినపడకుండా ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ఆహారం కలుషితమయ్యేందుకు, తద్వారా అనారోగ్యం కలి




గేందుకు బ్యాక్టీరియా, వైరస్, పరాన్న జీవులు కారణం. అధిక మోతాదులో వాడే రసాయనిక ఎరువులు, నిల్వ చేసేందుకు, రుచి కల్పించేందుకు ఉపయోగించే రసాయనాలు కూడా చేటు చేసేవే. ఎలాంటి జబ్బులబారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి.పండ్లు,కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్‌నట్స్ వంటివి ప్రతి రోజూ తీసుకోవాలి. భారతీయులు రోజూ కనీసం 400గ్రాముల కూరగాయలు,పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి,గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర,ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీటిలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి.బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు.ఫాస్ట్‌ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలివ్వాలి. పుట్టగానే డబ్బాపాలను అలవాటు చేస్తే అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతోపాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటులోకి లేనంతగా పెరగడం మరో సమస్య.ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు.అభివృద్ధి చెందుతున్నదేశాలలో 70శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరవు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60శాతం జనాభా పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి,లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో విలసిల్లింది. వ్యవసాయ రంగానికి ఒక సమగ్ర విధానమంటూ లేకపోవటంతో వ్యవసాయాన్ని సమాధి చేసి, ఉన్న వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ప్రపంచ వేదికల్లో గొప్పలకు పోయే మన పాలకుల ఏలికలు వాస్తవ పునాదులపై నిలబడి, మాటల్లో కాకుండా ఆచరణతో కూడిన ఆహార భద్రత పరిష్కారానికి పూనుకోవాలి. అదే జాతీయ ప్రయోజనాలకు, జాతి ప్రయోజనాలకు శ్రేయస్కారం. ●

# 50వేల మంది బోగస్ ప్రభుత్వ ఉద్యోగులు

## రూ.230 కోట్ల నిధులు స్వాహా





**భోపాల్, జూన్ 6:** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని కుదిపేసేలాంటి భారీ కుంభకోణం ఒకటి వెలుగు చూసింది. ఏకంగా 50వేలమందికి పైగా బోగస్ ప్రభుత్వ ఉద్యోగుల పేరిట సుమారు రూ.230 కోట్ల ప్రజాధనాన్ని కొందరు అక్రమార్కులు కొల్లగొట్టిన వైనం వెలుగులోకి వచ్చింది. వేలాదిమంది నిజమైన ప్రభుత్వ ఉద్యోగులకు ఆరు నెలలకు పైగా జీతాలు అందకపోవడంతో ఈ భారీ మోసం బయటపడింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టారు. దీంతో ప్రభుత్వ జీతాల చెల్లింపు వ్యవస్థపై అనుమానాలు తలెత్తాయి. అధికారులు లోతుగా పరిశీలించగా, అనేక అనుమానాస్పద ఉద్యోగుల కోడ్‌లు, జీతాల పంపిణీలో తీవ్రమైన అవకతవకలు ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ పేరోల్‌లో నకిలీ ఉద్యోగుల పేర్లను చేర్చి, ప్రజా సేవకుల కోసం కేటాయించిన భారీ మొత్తంలో నిధులను కొన్ని వ్యవస్థీకృత ముఠాలు కాజేసినట్లు ప్రాథమికంగా తేలింది. ఇటువంటి దొంగ ఉద్యోగుల కుంభకోణాలు కేవలం పరిపాలనాపరమైన పొరపాట్ల వల్ల జరిగేవి కావని, ఇవి ఉద్దేశపూర్వకంగా చేసే అవినీతి చర్యలని నిపుణులు చెబుతున్నారు. పలువురు అధికారుల కుమ్మక్కు లేకుండా ఇలాంటి మోసాలు జరగడం అసాధ్యమని తెలుస్తోంది. పేరోల్ వ్యవస్థలలో కల్పిత ఉద్యోగుల వివరాలను చొప్పించడం ద్వారా, మోసగాళ్లు ఆ జీతాలను తాము నియంత్రించే బ్యాంకు ఖాతాలకు మళ్లిస్తారు. చాలా సందర్భాల్లో ఈ కల్పిత జీతాల ద్వారా నిజమైన వ్యక్తులే లబ్ధి పొందుతారు. పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఒక ప్రణాళికాబద్ధమైన విధానం ద్వారా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుంది. సంప్రదాయ ధృవీకరణ, పేరోల్ వ్యవస్థల్లోని బలహీనతలు ఇటువంటి కుంభకోణాలను గుర్తించడం కష్టతరం చేస్తాయి. నష్టం జరిగిన తర్వాతే విషయం బయటపడుతుంది. ప్రభావం, నివారణ చర్యలు ఇలాంటి ఘటనలు కేవలం మధ్యప్రదేశ్‌కు మాత్రమే పరిమితం కాలేదు. గతంలో ఇతర ప్రాంతాలు, రంగాల్లో కూడా ఇటువంటి కుంభకోణాలు నమోదయ్యాయి. ఉద్యోగుల ధృవీకరణ ప్రక్రియల్లోని వ్యవస్థాగత లోపాలను అంతర్గత ఆడిట్‌లు బహిర్గతం చేశాయి. ఇలాంటి మోసాలను అరికట్టడానికి ప్రభుత్వ ఉద్యోగులందరినీ క్షుణ్ణంగా మానవ వనరుల ఆడిట్ చేయడం, బయో మెట్రిక్ ధృవీకరణ చేపట్టడం వంటివి చాలా కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వరంగ పేరోల్ల నుంచి దొంగఉద్యోగులను ఏరివేయడానికి పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేషన్‌విభాగం, జాతీయ కోశాగారం వంటి ఆర్థిక,పరిపాలనా పర్యవేక్షణ సంస్థల మధ్య సహకారం అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ కుంభకోణం తీవ్రతను పూర్తిగా వెలికితీయడానికి, బాధ్యులైన వారిని గుర్తించడానికి సమగ్ర దర్యాప్తును ప్రారంభించింది. ఈ స్కామ్ వల్ల నష్టపోయిన నిజమైన ఉద్యోగులకు జీతాల చెల్లింపులను పునరుద్ధరించడానికి కూడా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఘటనతో ప్రభుత్వ యంత్రాంగంలోని లొసుగులు మరోసారి బహిర్గతమయ్యాయి.




## తొక్కిసలాటకు, మాకు ఎలాంటి సంబంధంలేదు

### కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్

**బెంగళూరు, జూన్ 6:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ విజయోత్సవ వేడుకల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది అభిమానులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి తమ అధికారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించింది. కర్ణాటక ప్రభుత్వం నమోదు చేసిన కేసుల నేపథ్యంలో తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను సవాలు చేస్తూ కేఎస్సీఏ ఈరోజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఊహించని విధంగా జరిగిన ఈ విషాదకర సంఘటనకు తమ అసోసియేషన్‌ను గానీ, తమ సభ్యులను గానీ క్రిమినల్‌గా బాధ్యులను చేయరాదని కేఎస్సీఏ తన పిటిషన్‌లో వాదించింది. తాము నిర్దోషులమని, చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరింది.కెఎస్సీఏ దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించిన కర్ణాటక హైకోర్టు, అడ్వకేట్ జనరల్ సమర్పించిన స్థితిగతుల నివేదికను పరిశీలించినఅనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. కేసు తదుపరి విచారణను ఈనెల 10వ తేదీకి వాయిదా వేసింది.



## హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశం నిలిపివేత

### కోర్టులో ట్రంప్‌కు చుక్కెదురు

**వాషింగ్టన్, జూన్ 6:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, హార్వర్డ్ విశ్వవిద్యాలయం మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో హార్వర్డ్‌లో చదవాలనుకొనే విదేశీ విద్యార్థుల వీసాలపై ఆంక్షలు విధిస్తూ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులకు బ్రేక్ పడింది. ఆయన ఉత్తర్వులను ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ట్రంప్ ఆంక్షల ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ న్యాయస్థానంలో సవాల్ చేసింది. దీనిపై విచారణ జరగ్గా ట్రంప్ ప్రకటనను తాత్కాలికంగా నిషేధిస్తున్నట్లు కోర్టు తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా అధ్యక్షుడి ఉత్తర్వులు అమల్లోకి వస్తే హార్వర్డ్‌కు కోలుకోలేని దెబ్బ తగుతుందని జడ్జి అల్లిసన్ బరోస్ వ్యాఖ్యానించారు. దీనిపై తదుపరి విచారణ ఈ నెల 16కు వాయిదా వేశారు. కాగా హార్వర్డ్ విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని ఇప్పటికే ఫెడరల్ కోర్టు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే యూనివర్సిటీలో చదవాలనుకొనే విదేశీ విద్యార్థుల వీసాలపై ఆంక్షలు విధిస్తూ ఓ కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. మసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జిలో ఉన్న క్యాంపస్‌లో విదేశీ విద్యార్థులను హార్వర్డ్‌లో చేర్చుకోవడం వల్లజాతీయ భద్రతను ప్రమాదంలోకి నెట్టే ముప్పుందని ఆయన తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## 'సిందూర్'తో ప్రపంచానికి తెలిసిన భారత్ శక్తి

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



**నాగ్‌పూర్, జూన్ 6:** దేశ భద్రత విషయంలో పూర్తిస్థాయిలో స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి, అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందుకుగాను నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని, పరిశోధనలు ముమ్మరం చేయాలని ఆయన సూచించారు. నాగ్‌పూర్‌లో జరిగిన కార్యకర్త వికాస్ వర్గ్ ముగింపు కార్యక్రమంలో మోహన్ భగవత్ ప్రసంగించారు. పహల్గామ్ దాడిలో ఉగ్రవాదులు మన దేశంలోకి ప్రవేశించి అమాయక పౌరులను అత్యంత కిరాతకంగా చంపారు. ఈ ఘటన పట్ల తీవ్రమైన ఆవేదన, ఆగ్రహం వ్యక్తం కావడం సహజం. దోషులను కఠినంగా శిక్షించాలన్న బలమైన ఆకాంక్ష వ్యక్తమైంది. ప్రతిగా కొన్ని చర్యలు తీసుకున్నారు. మన సైన్యం ధైర్యసాహసాలు, సామర్థ్యాలు మరోసారి ప్రపంచానికి తెలిసాయి. ప్రభుత్వ యంత్రాంగం పట్టుదల కూడా కనిపించింది. రాజకీయ వర్గాల్లోనూ పరస్పర అవగాహన వ్యక్తమైంది. సమాజం కూడా తన ఐక్యత సందేశాన్ని ఇచ్చింది. ఇది శాశ్వతంగా కొనసాగాలని భగవత్ అన్నారు. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేసే దేశాలు ఉన్నంతకాలం మనం అప్రమత్తంగా ఉండాలని భగవత్ వాదించారు. మనకు శత్రువులు లేరు, మనం సత్యం, అహింసలను అనుసరించేవారమని ఆయన అన్నారు. గతంలో పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం మోహన్ భగవత్ మాట్లాడుతూ భారత్ శక్తిమంతమైనదని నిరూపించాల్సిన సమయం వచ్చిం దన్నారు. సరిహద్దుల్లో మతపరమైన ప్రదేశాలు, పౌర ప్రాంతాలపై పాకిస్థాన్ సైన్యం చేస్తున్న దాడులను ఆయన ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మన అన్ని సరిహద్దుల్లో దుష్ట శక్తుల దుర్మార్గాన్ని చూస్తున్నందున, మనం శక్తిమంతంగా ఉండటం తప్ప మరో మార్గంలేదని అంతర్గత బలం ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

## సింధు జలాల ఒప్పందం కాలం చెల్లిన డాక్యుమెంట్: పాక్

**కరాచి, జూన్ 6:** భారత్‌తో 1972లో కుదిరిన చారిత్రక సిమ్లా ఒప్పందంపై పాకిస్థాన్‌లో భిన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఆ దేశ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఈ ఒప్పందం కాలం చెల్లిన డెడ్ డాక్యుమెంట్ అని సంచలన వ్యాఖ్యలు చేయగా, పాకిస్థాన్ విదేశాంగ శాఖ మాత్రం దీనిని తోసిపుచ్చింది. భారత్‌తో సిమ్లా ఒప్పందంతో సహా ఏ ద్వైపాక్షిక ఒప్పందాన్ని అధికారికంగా రద్దు చేసుకునే నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ, సిమ్లా ఒప్పందానికి ఇక విలువ లేదు. అది ఒక డెడ్ డాక్యుమెంట్. సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేశారో లేదో తెలియదుగానీ సిమ్లా అగ్రిమెంట్ పని అయిపోయిందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో తాము 1948 నాటి స్థితికి చేరుకున్నామని, ప్రస్తుతం ఉన్న నియంత్రణ రేఖ ఎల్ఓసీ కేవలం కాల్పుల విరమణ రేఖగా పరిగణించాల్సి వస్తుందని ఆయన పరోక్షంగా సూచించారు. 1948 భారత్ పాక్ యుద్ధం అనంతరం ఈ కాల్పుల విరమణ రేఖను ఏర్పాటు చేశారు. అయితే, రక్షణ మంత్రి వ్యాఖ్యలపై పాకిస్థాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి భిన్నంగా స్పందించారు. భారత్‌తో ఏ ద్వైపాక్షిక ఒప్పందాన్ని రద్దు చేసుకోవడానికి అధికారికంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం ఆ దేశంతో ఉన్న సిమ్లా ఒప్పందంతో సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలు అమల్లో ఉంటాయని ఆ ప్రతినిధి వెల్లడించారు. 1971 భారత్‌పాక్ యుద్ధం అనంతరం 1972లో సిమ్లా ఒప్పందం కుదిరింది. దీనిపై అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ, పాకిస్థాన్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో సంతకాలు చేశారు. ఈ ఒప్పందంప్రకారం, ఇరుదేశాల మధ్య శాంతియుతద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకోవాలని, కశ్మీర్‌తో సహా పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను మూడో దేశం జోక్యం లేకుండా ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. జమ్ముకశ్మీర్‌లో అప్పటి కాల్పుల విరమణ రేఖను నియంత్రణ రేఖగా పునర్నిర్వచించడం, దానిని ఏకపక్షంగా మార్చకూడదన్న నిబంధనకు ఇరు దేశాలు కట్టుబడి ఉండటం, బంగ్లాదేశ్ సార్వభౌమత్వాన్ని పాకిస్థాన్ గుర్తించి ఆ దేశంతో సంబంధాలను సాధారణ స్థితికి తేవడం వంటివి ఈ ఒప్పందంలోని ముఖ్యమైన అంశాలు.

## గాజాలో చుక్కలంటుతున్న నిత్యావసరాలు

# పార్లే బిస్కెట్ ప్యాకెట్‌ధర రూ.2400!




**గాజాసిటీ, జూన్ 6:** ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య యుద్ధం సుమారు ఏడాదిన్నర నుంచి కొనసాగుతూనే ఉంది. యుద్ధం ఆపేందుకు పలుమార్లు చర్చలు, సంప్రదింపులు జరుగుతున్నా కూడా రెండు దేశాల మధ్య రాజీ మాత్రం కుదరడం లేదు. గత 24 గంటల్లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో దాదాపు 100 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుండగా, మరో వైపు గాజాలో నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పది రూపాయలు విలువ చేసే వస్తువులకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. భారత్‌లో రూ.5లు విలువ చేసే పార్లే జీ బిస్కెట్ ప్యాకెట్.. గాజాలో ఏకంగా రూ.2,400కి విక్రయిస్తున్నారు. ఇదే కాకుండా అనేక రకాల వస్తువుల ధరలు వందలు, వేలల్లోనే ఉన్నాయి. గాజాకు చెందిన ఓ వ్యక్తి చేసిన పోస్టు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. చాలాసేపు వేచి ఉన్న తర్వాత నేను చివరకు ఈరోజు మా రవీఫ్‌కి ఇష్టమైన బిస్కెట్లు కొన్నాను. వాటి ధర 1.5 యూరోల అంటే రూ.147 నుంచి 24 యూరోలకు రూ. 2,342 పెరిగినా పిల్లలకు ఇష్టం కాబట్టి తీసుకున్నా అని చెబుతూ అతడు ఓ పోస్టు పెట్టాడు. దీంతో అక్కడి నిత్యావసర వస్తువుల ధరల అంశం సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. గాజాలోకి నిత్యావసరాల సరఫరాలు ఇజ్రాయెల్ అడ్డుకోవడంతో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. నెలల తరబడి కొనసాగుతున్న ఇజ్రాయెల్ దాడులతో గాజాలోని చాలా మంది నిర్వాసితులయ్యారు.

మరోవైపు గాజా ప్రజలందరూ ట్రక్కుల ద్వారా వచ్చే ఆహారం, ఇతర సాయంపైనే ఆధారపడ్డారు. అయితే ఇజ్రాయెల్ వాటిని ఆపేస్తుండడంతో పరిస్థితి దారుణంగా మారింది. మూడు నెలలకు పైగా సరిహద్దులు మూసేయడంతో గాజాలోని 20 లక్షల మంది ప్రజలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కొన్ని నిత్యావసర సరుకులు మానవతా సహాయంగా ఉచితంగా గాజాకు సరఫరా చేస్తున్నారు. అయితే అవి కొద్ది మందికి మాత్రమే అందుతున్నాయి. మిగతా సరుకులను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పార్లే జీ బిస్కెట్‌తో పాటు అనేక రకాల సరుకుల ధరలు ఆకాశన్నంటుతు న్నాయి. పార్లే జీ బిస్కట్ ప్యాకెట్ రూ.2,342, 1 కిలో చక్కెర: రూ.4,914, 1 లీటర్ వంట నూనె రూ.4,177, 1 కిలో బంగాళాదుంపలు రూ.1,965, 1 కిలో ఉల్లిపాయలు రూ.4,423, 1 కాఫీ కప్పు రూ. 1,800లుగా అమ్ముడవుతున్నాయి. అంతర్జాతీయ రెస్క్యూ కమిషన్ పంపిన 6.7 టన్నుల మందులు, వైద్య సరఫరాలకు సంబంధించిన వాహనాలను గాజా వెలుపలే నిలిపేశారు. వీటిని గాజాలోకి ఎప్పుడు అనుతిస్తారో తెలీని పరిస్థితి. మరోవైపు నిత్యావసర ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఓ వైపు కాల్పుల విరమణ ఒప్పందం కుదరక పోవడం, మరోవైపు అందాల్సిన సహాయం నిలిచిపోవడంతో మళ్ళీ దాడులు మొదలవుతాయేమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

# అమెరికా అధ్యక్షుడికి మోడీ 11 సార్లు లొంగిపోయారు

## బీహార్ సభలో రాహుల్ ఎద్దేవా




**పాట్నా, జూన్ 6:** ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి లొంగిపోతున్నారని ఎఐసిసి నాయకుడు, లోక్‌సభా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. బీహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన సంవిధాన్ సురక్షా సమ్మేళన్‌లోమాట్లాడిన ఆయన మోడీపై తన విమర్శలను మరింతగాపెంచారు. ట్రంప్ తాను స్వయంగా మాట్లాడుతూ నరేంద్రమోడీని లొంగిపోవాలని 11 సార్లు చెప్పానని చెప్పారని, అయినా ఇప్పటివరకూ మోడీ ఆ వ్యాఖ్యలపై స్పందించలేదని ఇప్పటికీ మౌనమే వహించారని విమర్శించారు. ట్రంప్ అబద్ధాలు చెపుతున్నారని ప్రధానిమోడీ ఎందుకు చెప్పలేకపోతున్నారని ఎందుకంటే ట్రంప్‌చేసిన వ్యాఖ్యలు నిజమేనని రాహుల్ అన్నారు. అంతకుముందు భోపాల్ సభలోకూడా రాహుల్ ఇవే వ్యాఖ్యలు చేసారు.ఆపరేషన్ సిందూర్‌పరంగా ట్రంప్ మోడీకి ఫోన్‌చేసి నరేంద్ర సరెండర్ అన్నారని వెనువెంటనే మోడీ లొంగిపోయారని ఎద్దేవా చేసారు. ట్రంప్ అక్కడినుంచే సంకేతాలిచ్చారని, ఆయన ఫోన్ తీసుకుని మోడీజీ మీరేం చేస్తున్నారు. వెంటనే ఆగిపోండి నేను చెప్పిన మాటలకు లొంగిపోండి అని చెప్పారని, ట్రంప్ ఆదేశాలను మోడీ పాటించారని ఎద్దేవాచేసారు. అలాగే రాహుల్ ఆరెస్సెస్‌పైనా తీవ్ర వ్యాఖ్యలు చేసారు. ఆర్ఎస్ఎస్‌పై తాను నిరంతరం పోరాటం చేస్తున్నానని, వారు మోడీకంటే సులువుగా లొంగిపోతారని అన్నారు. క్షమాబిక్ష పిటిషన్‌లు రాయడానికి వారికి సుదీర్ఘసమయం పట్టదని, ఆధునిక టెక్నాలజీ వచ్చినతర్వాత పెన్నుపేపర్ స్థానంలో వాట్సాప్ వచ్చేసిందని రాహుల్ చమత్కరించారు. వియానయక్ దామోదర్ సావర్కర్ అప్పటి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త బ్రిటిష్ పాలనలో అనేకసార్లు క్షమాబిక్ష పిటిషన్లు పెట్టుకున్నారని, అండమాన్ జైలులో ఆయనకు మరణశిక్ష అమలు చేసేంత వరకూ ఆయన క్షమాబిక్ష పిటిషన్లు పెట్టుకుం టూనే వచ్చారన్నారు.

అయితే రాహుల్ వ్యాఖ్యలను బిజెపి అధ్యక్షుడు జెపినడ్డా, అధికార ప్రతినిధి సుధాంశు త్రివేదిలు తీవ్రంగా వ్యతిరే కించారు. రాహుల్ వ్యాఖ్యలు రాజద్రోహ వ్యాఖ్యలన్నారు. ఉగ్రవా దులు హాఫీజ్ సయీద్ వంటివారు చేసిన వ్యాఖ్యల కంటే రాహుల్ వ్యాఖ్యలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు.




## భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు అనుమతి

### డాట్ నుంచి లైసెన్స్ పొందిన మూడో కంపెనీ

**న్యూఢిల్లీ, జూన్ 6:** దేశంలో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్(డాట్) లైసెన్స్ జారీ చేసింది.కంపెనీ దరఖాస్తు చేసుకున్న 15 నుంచి 20 రోజుల్లోగా ట్రయల్ స్పెక్ట్రమ్‌ను మంజూరు చేస్తామని డాట్ వర్గాలు తెలిపాయి. డాట్ నుంచి లైసెన్స్ పొందిన మూడో కంపెనీగా స్టార్‌లింక్ నిలిచింది. గతంలో వన్‌వెబ్, రిలయన్స్ జియోలకు డాట్ లైసెన్స్‌లు జారీ చేసింది. అయితే ఇప్పటివరకు ఆ సంస్థలు కార్యకలాపాలను ప్రారంభించలేదు.ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ అనుబంధ సంస్థ అయిన స్టార్‌లింక్ 100కుపైగా దేశాల్లో ఇంటర్నెట్ సర్వీసులనందిస్తోంది. సుదూర భూస్థిర ఉపగ్రహాలపై ఆధారపడే సంప్రదాయ ఉపగ్రహ సేవల మాదిరిగా కాకుండా లియో (లో ఎర్త్ ఆర్బిట్) ఉపగ్రహాల ద్వారా స్టార్ లింక్ ఈ ఇంటర్నెట్ సేవలను అందిస్తోంది. భూమికి 550 కిలోమీటర్ల ఎత్తులో ఉండే కక్ష్యలో స్టార్‌లింక్‌కు చెందిన 6,000 శాటిలైట్లు తిరుగుతుంటాయి. స్పేస్‌ఎక్స్ తన శాటిలైట్ ఇంటర్నెట్ ప్రాజెక్టును జనవరి 2015లో ప్రకటించగా, ఇప్పటికే 100కు పైగా దేశాల్లో ఈ సేవలు లభిస్తున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం లైసెన్స్ జారీ చేయడంతో త్వరలో భారత్ కూడా ఈ జాబితాలో చేరనుంది. భూమినుంచి ఈ ఉపగ్రహాలు తక్కువ దూరంలో ఉండడం వల్ల తక్కువ లేటెన్సీతో ఇంటర్నెట్ సేవలను పొందవచ్చు. స్టార్‌లింక్‌తో భాగస్వామ్యంద్వారా జియో, ఎయిర్‌టెల్ భారతదేశంలోని సాధారణ నెట్‌వర్క్‌లు చేరుకోలేని ప్రాంతాలకు టెలికాం సేవలు అందుతాయి.ముఖ్యంగా మారుమూల ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలందించేందుకు స్టార్‌లింక్ ఉపయోగపడుతుంది. ఇది సామాన్య ప్రజలకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా వ్యాపారాలపై కూడా భారీ ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో దేశ ఆర్థికాభివృద్ధికి, డిజిటలైజేషన్‌కు ఈ ప్రయత్నం ముఖ్యమైన అడుగుగా మారనున్నట్లు చెబుతున్నారు.

## ఢిల్లీ సిఎంకు అధికారిక నివాసం ఎంపిక



**న్యూఢిల్లీ, జూన్ 6:** ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు ఎట్టకేలకు అధికారిక నివాసం ఖరారైంది. ఆమె పదవీ బాధ్యతలు చేపట్టిన సుమారు 100 రోజుల తర్వాత సివిల్ లైన్స్‌లోని రాజ్ నివాస్ మార్గ్‌లో ఒక బంగ్లాను కేటాయించారు. ఈ ఏడాది జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన తర్వాత, కొత్త ముఖ్యమంత్రి ఎక్కడ నివాసం ఉంటారనే దానిపై కొంతకాలంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రజా పనుల విభాగం పీడబ్ల్యూడీ సీఎం నివాసం కోసం మూడు బంగ్లాలను పరిశీలించింది. వీటిలో రెండు మధ్య ఢిల్లీలోని డీడీయూ మార్గ్‌లో బీజేపీ కార్యాలయం, జాతీయ ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఉన్నాయి. మూడవది సివిల్ లైన్స్‌లోని రాజ్‌పూర్ రోడ్డులో ఉంది. చివరికి రాజ్ నివాస్ మార్గ్‌లోని బంగ్లాను ఖరారు చేశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రేఖా గుప్తా తన సొంత నియోజకవర్గమైన షాలిమార్ బాగ్‌లోని తన ప్రైవేట్ నివాసంలోనే ఉంటున్నారు. గత ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసం చుట్టూ బీజేపీ ప్రచారం చేసిన నేపథ్యంలో, కొత్త సీఎంకు అధికారిక నివాసం కేటాయింపులో జాప్యం జరిగింది. ఎన్నికల ప్రచారం సమయంలో బీజేపీ నేతలు మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అధికారిక నివాసమైన 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్ బంగ్లాను సీష్ మహల్‌గా అభివర్ణిస్తూ, అక్కడ అవినీతి జరిగిందని ఆరోపించారు. కొత్త సీఎం ఈ వివాదాస్పద భవనంలో నివసించరని ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవా వంటి నేతలు గతంలోనే ప్రకటించారు.

## స్వర్ణదేవాలయం వద్ద ఉద్రిక్తత

### ఆపరేషన్ బ్లూస్టార్ వార్షికోత్సవంలో ఖలిస్థాన్ నినాదాలు



**అమృత్‌సర్, జూన్ 6:** పంజాబ్‌లోని అమృత్‌సర్ స్వర్ణ దేవాలయం వద్ద శుక్రవారం మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆపరేషన్ బ్లూ స్టార్ 41వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, ఖలిస్థాన్ అనుకూల నినాదాలు మిన్నంటాయి. శిరోమణి అకాలీదళ్ మాన్ వర్గం నేత సిమ్రన్‌జిత్ సింగ్ మాన్ స్వర్ణ దేవాలయానికి చేరుకున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆపరేషన్ బ్లూ స్టార్ 41వ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం స్వర్ణ దేవాలయంలో జరిగాయి. ఇదే రోజున 1984లో నాటి సైనిక చర్యలో మరణించిన జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలే వర్ధంతి కూడా కావడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో శిరోమణి అకాలీదళ్ మాన్ వర్గం నాయకుడు సిమ్రన్‌జిత్ సింగ్ మాన్ స్వర్ణ దేవాలయ ప్రాంగణానికి చేరుకోగానే, ఆయన మద్దతుదారులు ఖలిస్థాన్ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ముందురోజు దల్ ఖల్సా అనే సంస్థ ఆధ్వర్యంలో అమృత్‌సర్‌లో భారీ ప్రదర్శన నిర్వహించారు. బుర్జ్ అకాలీ ఫూలా సింగ్ ప్రాంతం నుంచి స్వర్ణ దేవాలయం వరకు సాగిన ఈ ప్రదర్శనలో యువకులు, వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆ సమయంలో కూడా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు మార్మోగాయి. ఈ ప్రదర్శనలో సిమ్రన్‌జిత్ సింగ్ మాన్‌తో పాటు పంథ్ సేవక్ నాయకుడు దల్జీత్ సింగ్ కూడా పాల్గొన్నారు. ఆపరేషన్ బ్లూ స్టార్‌కు నిరసనగా శుక్రవారం అమృత్‌సర్‌లో బంద్‌కు కూడా దల్ ఖల్సా పిలుపునిచ్చింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా స్వర్ణ దేవాలయం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రత్యేక బలగాలను మోహరించారు.

## కస్టమర్ల సొమ్మును వాడుతున్న బ్యాంక్ అధికారిణి: అరెస్టు చేసిన పోలీసులు

**జైపూర్, జూన్6:** బ్యాంకులో డబ్బు దాచుకుంటే భద్రం. అయితే బ్యాంకులోని అధికారులే ఆ డబ్బునుకాజేస్తే కస్టమర్ల పరిస్థితి ఏంటి? రాజస్థాన్‌లోని ఐసిఐసిఐ బ్యాంక్‌లో ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. కస్టమర్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన డబ్బును ఓ అధికారిణి స్టాక్ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టేందుకు వాడుకుంది. భారీ నష్టాలు రావడంతో వాటిని తిరిగి జమ చేయలేకపోయింది. విషయం కాస్త బయట పడడంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సాక్షి గుప్తా ఐసిఐసిఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో బ్యాంక్‌లో పలువురి ఫిక్స్‌డ్ డిపాజిట్ల డబ్బును దుర్వినియోగం చేసింది. 40 మందికిపైగా కస్టమర్లకు చెందిన రూ.4.58 కోట్లను అక్రమంగా వాడుకుంది. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆ సొమ్మును ఉపయోగించింది. అయితే అందులో ఆమెకు భారీగా నష్టాలు రావడంతో ఆ డబ్బును తిరిగి జమ చేయలేకపోయింది. ఓ వ్యక్తి తన ఎఫ్‌డి గురించి తెలుసుకునేందుకు బ్యాంక్‌కు రాగా ఈ స్కామ్ విషయం బట్టబయలైంది. దీంతో బ్యాంకు అధికారులు ఆమెపై కేసు నమోదు చేశారు. సాక్షి తన సోదరి వివాహ వేడుకలో ఉండగా పోలీసులు వెళ్లి ఆమెను అరెస్టు చేశారు.

## రాజ్యసభ ఎన్నికలకు కమల్‌హాసన్ నామినేషన్



**చెన్నై, జూన్ 6:** ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ రాజ్యసభకు శుక్రవారం నామినేషన్ వేశారు. తమిళనాడు సెక్రటేరియట్‌లో ఆయన తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ కార్యక్రమానికి తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ హాజరయ్యారు. భాగస్వామ్య పార్టీల నేతలు వీసీకే చీఫ్ తిరుమావలన్, ఎండీఎంకే చీఫ్ వైకో, తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుంతగై సైతం పాల్గొన్నారు. డీఎంకే ఒక రాజ్యసభ సీటును ఎంఎన్ఎంకు కేటాయిస్తూ కమల్‌హాసన్ పేరును ఇటీవల ప్రకటించింది. తమిళనాడు అసెంబ్లీలో 234 మంది సభ్యులుండగా, రాజ్యసభ అభ్యర్థుల గెలుపునకు ఒక్కొక్కరికి 34 ఓట్లు అవసరమవుతాయి. 158 ఎమ్మెల్యేల బలం డీఎంకేకు ఉంది. డీఎంకేకు సొంతంగా 133 ఎమ్మెల్యేల బలం ఉండగా, భాగస్వామ్య పార్టీలైన కాంగ్రెస్‌కు 17, వీసీకేకు 4, సీపీఐ, సీపీఎంలకు చెరో నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. సంఖ్యా బలం ప్రకారం 4 రాజ్యసభ సీట్లను డీఎంకే సునాయాసంగా గెలుచుకుంటుంది. కమల్ కాకుండా మరో ముగ్గురు అభ్యర్థులను డీఎంకే నిలబెట్టింది. కవి, తమిళ అధికార భాషాకమిషన్ మాజీ చైర్‌పర్సన్ సల్మా, సీనియర్ అడ్వకేట్ పి.విల్సన్, మాజీ మంత్రి ఎస్.ఆర్.శివలింగంను తమ అభ్యర్థులుగా డీఎంకే ప్రకటించింది. జూన్ 19 రాజ్యసభకు ఎన్నికలు జరగనున్నాయి. 2018లో పార్టీ కమల్‌హాసన్ 2018లో మదురై జరిగిన ఒక కార్యక్రమంలో మక్కల్ నీది మయ్యం పార్టీని ప్రారంభించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేయనప్పటికీ డీఎంకే సారథ్యంలోని ఇండియా కూటమికి ప్రచారం చేసింది. 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి 2.62 శాతం ఓట్లు పడ్డాయి.

## రైలు ప్రమాదం అంటూ సైరన్‌తో సిబ్బందిని అప్రమత్తం చేసిన అధికారులు

**బిట్రగుంట (నెల్లూరు), జూన్ 6, ప్రభాతవార్త :** విజయవాడ రైల్వేడివిజన్ పరిధిలోని తలమంచి రైల్వే స్టేషన్ మూడో లైన్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం సుమారు ఒకటిన్నర ప్రాంతంలో రైల్వే గూడ్స్ పట్టాల తప్పిందని బిట్రగుంటలో సైరన్ మోగించారు. సాధారణంగా డివిజన్ పరిధిలో ప్రమాదాల సంభవించినప్పుడు రైల్వే సిబ్బందిని అప్రమత్తం చేసే విధులకు అత్యవసరంగా హాజరయ్యేందుకు సైరన్ మోగిస్తారు. అదేవిధంగా తలమంచి రైల్వే స్టేషన్ లో ప్రమాదం సంబంధించిందని మోగడంతో హడావుడిగా రైల్వే అధికారులు ప్రత్యేక లూకాస్ తో మెడికల్, ఇంజనీరింగ్ సిబ్బంది సంఘటన స్థలంకు చేరుకోగా ఇది కేవలం మాక్ డ్రిల్ అని తెలియడం తో ఊపిరి పీల్చుకొన్నారు. ఈ కార్యక్రమం లో డివిజనల్ సేఫ్టీ అధికారులు కూడా పాల్గొన్నారు. ప్రమాదం జరిగినదని పేర్కొంటున్న ప్రదేశానికి వెళ్లేంతవరకు ఈ విషయాన్ని చాలా గోప్యంగా ఉంచడం గమనార్హం.

## సోమిశెట్టి కుటుంబానికి 50 లక్షల రూపాయలు అందచేసిన డి.సి.ఎం.పవన్‌కళ్యాణ్

### చెక్కులను అందచేసిన పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్



**కావలి (నెల్లూరు), జూన్ 6, ప్రభాతవార్త:** పహల్గామ్ ఉగ్రదాడిలో మృతిచెందిన జనసేన క్రియాశీలక సభ్యులు స్వర్గీయ సోమిశెట్టి మధుసూధనరావు కుటుంబానికి జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ 50 లక్షల రూపాయల చెక్కుల పర్యాటకశాఖామంత్రి కందుల దుర్గేష్ ద్వారా అందచేశారు. శుక్రవారం మంత్రి దుర్గేష్, ఏపిటిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌లు కావలిలోని మధుసూధనరావు నివాసానికి వెళ్లి చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మధుసూధనరావు కుటుంబానికి జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పరామర్శించి ఆయన స్వీయ నిధులనుంచి పిల్లల చదువులకోసం 50 లక్షల రూపాయలు ప్రకటించడం జరిగిందన్నారు. ఆ చెక్కులను శుక్రవారం సోమిశెట్టి కుటుంబసభ్యులకు అందచేయడం జరిగిందన్నారు. జనసేన కుటుంబసభ్యులకు ఈ విధంగా జరగడం దురదృష్టకరమన్నారు. 22 లక్షలు, 23 లక్షల చెక్కులను మధుసూదన్‌రావు పిల్లలిద్దరికి అందచేయడం జరిగిందన్నారు. 5 లక్షల చెక్కును ఆయన తల్లిదండ్రులకు అందచేశారన్నారు. మధుసూధన్‌రెడ్డిలేని లోటు తీర్చలేనిదన్నారు. బిడ్డల చదువులకై పవన్‌కళ్యాణ్ పంపిన ఆర్థిక సహాయం ఉపయోగించి వారిని వృద్ధిలోకి తీసుకురావాలని ఈ కుటుంబానికి జనసేన ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఏ సహాయం కావాలన్నా ఫోన్ ద్వారా తెలియచేయవచ్చునన్నారు. ఈ సందర్భంగా సోమిశెట్టి మధుసూధన్‌రావు సతీమణి మాట్లాడుతూ ఎంతో మంది నాయకులను చూశాము. పవన్‌కళ్యాణ్‌లాంటి నాయకుడిని చూడలేదు. చెప్పింది చెప్పినట్లుగా చేశారన్నారు. ఈ చెక్కుల విభజనలో ఆయన ఆలోచించిన విధానం మా మనసులకు ఎంతగానో హత్తుకుందని తెలిపారు. నా బిడ్డల చదువులకు ఏ విధంగా ఆర్థిక సహాయం పవన్‌కళ్యాణ్ చేశారో అదేవిధంగా తన బిడ్డల భవిష్యత్తులో వృద్ధిలోకి వచ్చిన తర్వాత వారి చేతకూడా సమాజానికి, జనసేనపార్టీ తరపున బిడ్డలు ఉపయోగపడేటట్లు చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి గునుకుల కిషోర్, కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్, జిల్లా కార్యదర్శి సమ్మెట వెంకటసుబ్బయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందరరామిరెడ్డి, సీనియర్ నాయకులు నెల్లూరు కార్పొరేషన్ సభ్యుడు నూనె మల్లికార్జునయాదవ్, లీగల్‌సెల్ నాయకుడు శ్రీరాం, బెల్లపు సుధామాధవ్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, హేమచంద్రయాదవ్, మహేష్‌శర్మ, టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## భగవన్నామస్మరణతోనే మోక్షం

### - శ్రీవారిసేవలో కంచిమఠం పీఠాధిపతులు



**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగంలో భగవన్నామస్మరణతోనే మోక్షం కలుగుతుందని, మంచి మార్గాన్ని ఎంచుకుని ప్రజలు సత్‌ప్రవర్తన కలిగిఉండాలని కంచిమఠం పీఠాధిపతులు విజయేంద్రసరస్వతి, సత్యచంద్రశేఖరసరస్వతి స్వాములు అనుగ్రహభాషణం చేశారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో లోకం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కంచిమఠం నూతన పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టిన తరువాత సత్యచంద్రశేఖరసరస్వతిస్వామితో తొలిసారిగా తిరుమలకు వచ్చారు. శుక్రవారం వేకువజామున శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అలిపిరిలోనే శ్రీవారిమెట్టు దివ్యదర్శనం టోకెన్లు జారీ

**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి కాలినడకన తిరుమలకు శ్రీవారిమెట్టుమార్గంలో వచ్చే భక్తులకు సౌలభ్యంగా దివ్యదర్శనం టోకెన్లు జారీ అలిపిరి భూదేవికాంప్లెక్స్ లో ప్రారంభమైంది. రోజువారీగా 15వేలమంది నుండి 25వేలమంది వరకు భక్తులు అలిపిరి,శ్రీవారిమెట్టు కాలినడక మార్గాల్లో భక్తులు వస్తున్నారు. ప్రస్తుతం శ్రీవారి మెట్టుమార్గంలోనే భక్తులకు టోకెన్లు జారీ అవుతున్నాయి. ఈ టోకెన్లు శ్రీవారిమెట్టుమార్గం కౌంటర్లో దళారులు, ఆటోడ్రైవర్లు కు ఆసరాగా మారాయనే ఆరోపణలతో అక్కడ జారీచేస్తున్న దర్శన టోకెన్లనుశుక్రవారం సాయంత్రం నుండి అలిపిరి భూదేవికాంప్లెక్స్‌లోని కౌంటర్లలోనే జారీచేసేలా ప్రారంభించారు. ఇక్కడ పదికౌంటర్లు ఏర్పాటుచేశారు. భక్తులు సాఫీగా ఈ టోకెన్లు అందుకునేలా శ్రీవారిమెట్టు,శ్రీనివాసమంగాపురం, అలిపిరి, తిరుపతి శ్రీనివాసం, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో విస్తృతంగా భక్తులకు ప్రసారం చేస్తున్నారు. అలిపిరిలో టోకెన్లుతీసుకుని శ్రీవారిమెట్టుకు చేరుకునేందుకు ఉచిత బస్సులు ఉన్నాయి. దివ్యదర్శనం భక్తులు తదుపరి శ్రీవారిమెట్టునుండి తిరుమలకు చేరుకునేలా శనివారం స్వామివారిని దర్శించుకునేలా సౌకర్యాలు కల్పించారు. తొలిరోజు శుక్రవారం సాయంత్రం 5గంటలకు టోకెన్లు జారీ మొదలైంది. శ్రీవారిమెట్టు 1200మెట్ల వద్ద టోకెన్లు స్కానింగ్ చేసుకుని భక్తులు శ్రీవారి దర్శనానికి చేరుకోవాలి.

## తెలుగురాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలి

### - మాజీ సిఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి



**తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న సామాన్యభక్తులకు సౌకర్యాలు మెరుగుపరచి, క్యూలైన్ల నిర్వహణ అద్భుతంగా ఉందని మాజీ సిఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ మంచి జరగాలని, రెండు తెలుగురాష్ట్రాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఉదయం విఐపి బ్రేక్‌లో అనుచరులతో కలసి వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో విజేతలైన నారాయణ విద్యార్థులకు ఎపి సిఎం చంద్రబాబునాయుడు అభినందన

**హైదరాబాద్ జూన్ 6, ప్రభాతవార్త :** జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 10 వ ర్యాంకు సాధించి ఆంధ్రప్రదేశ్ నుండి విజయకేతనం ఎగురవేసిన విజయవాడ నారాయణ కళాశాలకు చెందిన విద్యార్థి వడ్లమూడి లోకేష్‌ని, 51వ ర్యాంకు సాధించిన భానుచరణ్ రెడ్డిని, 82 వ ర్యాంకు సాధించిన తోరాటి భరధ్వాజ్‌ని,98వ ర్యాంకు సాధించిన జస్వంత్ వెంకట రఘువీర్‌ని, వారి తల్లిదండ్రులను ఉండవల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఐఐటిలో ర్యాంకు సాధించిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఐఐటి లాంటి ప్రతిష్టాత్మక సంస్థలో ప్రవేశం సాధించటం సామాన్యమైన విషయం కాదు,మీలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులు మరిన్ని నూతన శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.జన్మభూమితో పాటు తెలుగు రాష్ట్రాల ఉన్నతికి పాటుపడాలని కోరారు. టాప్ ర్యాంకుల సాధనకు విజయసారథ్యం వహించిన నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లను ప్రత్యేకంగా ప్రశంసించారు.మరెందరోవిజేతలను ఆవిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డా పి.సింధూర నారాయణ, శరణి నారాయణ, ప్రేమ్ పొంగూరు పాల్గొన్నారు.

## విశాఖ రైల్వే జోన్ జిఎం నియామకంతో చిగురించిన ఆశలు

### ఏ క్షణంలోనైనా గెజిట్ నోటిఫికేషన్



విశాఖ రైల్వే జోన్ జిఎం కార్యాలయం

**గుంతకల్లు రైల్వే,జూన్ 6,ప్రభాతవార్త** విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథూర్ నియామకంతో విశాఖ రైల్వే జోన్‌పై ప్రజలలో ఆశలు చిగురించాయి. భారతీయ రైల్వేలో 17వ జోన్‌గా కొత్తగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో అధికారిక కార్యకలాపాలు ఏక్షణంలో నుంచి అయిన ప్రారంభం అయ్యే అవకాశాలున్నాయి. విశాఖ రైల్వే జోనల్ కేంద్రంలో పని చేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని రైల్వే బోర్డు అధికార ప్రతినిధి వెల్లడించారు. రాష్ట్ర పునర్విభజన చట్టం-2014 ప్రకారం కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను పది సంవత్సరాల ఆలస్యంతో ఎట్టకేలకు ప్రారంభించేందుకు నిర్ణయించడం, ఇందులో భాగంగా రూ.149కోట్లు అంచనా వ్యయంతో జనరల్ మేనేజర్ కార్యాలయం ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ ఏడాది జనవరి 8న శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. విశాఖపట్నం,విజయవాడ,గుంటూరు, గుంతకల్లు రైల్వే డివిజన్‌లను కలుపుకొని దక్షిణ కోస్తా రైల్వే జోన్ త్వరలో ప్రజలకు సేవలందించనుంది. రాబోయే రెండేళ్లలో శాశ్వత భవన నిర్మాణం పూర్తి అయ్యేవరకు విశాఖలో తాత్కాలికంగా భవనాలను అద్దెకు తీసుకుని కార్యకలాపాలను వెంటనే చేపట్టాలని రైల్వే బోర్డు సూచనాప్రాయంగా నిర్ణయించినట్లు అధికార వర్గాల సమాచారం. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం జనరల్ మేనేజర్‌ను నియమించింది. ఇక ఏ క్షణంలోనైనా కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనుంది. గెజిట్ నోటిఫికేషన్ జారీ అయిన అనంతరం అధికారిక కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. విశాఖ రైల్వే జోన్ పరిధి 3,496కి.మీల వరకు విస్తరించి ఉండగా, వీటితో పాటు రన్నింగ్ రైలు మార్గం పొడవు 5,437కి.మీలు అవసరమయ్యే సిబ్బంది 65,800లమంది. విశాఖపట్నం, గంగావరం,క్రిష్ణపట్నం, కాకినాడ ప్రధాన రైల్వే స్టేషన్లు- విశాఖపట్నం,విజయవాడ,తిరుపతి. విద్యుత్ లోకోషెడ్లు : విజయవాడ,విశాఖపట్నం,గుంతకల్లులలో విద్యుత్‌లోకో షెడ్డులు, డీజిల్ లోకోషెడ్లు : విశాఖ,గుత్తి,గుంతకల్లు, విజయవాడలో నాలుగు డీజిల్ షెడ్లు. రైల్వే వర్క్‌షాపులు : తిరుపతిలో కోచింగ్ వర్క్‌షాప్,రాయనపాడు,విశాఖలలోని వడ్లపూడిలో రెండు వాగన్ వర్క్‌షాప్ వెరసి మొత్తం మూడు వర్క్‌షాపులు, ప్రధాన సరుకు పరీక్ష రవాణా యార్డులు : విశాఖపట్నం,కాకినాడ, విజయవాడ,ఉత్తి, ప్రధాన కోచింగ్ డిపోలు : విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ,కాకినాడ, నర్సాపూర్,మచిలీపట్నం,గుంటూరు, ట్రాక్ మిషన్‌వర్క్ షాపులు : రాయనపాడులోని సెంట్రల్ పిరాయడికల్ ఓవర్హాలింగ్ వర్క్‌షాప్, మెమో కార్‌షెడ్ : రాజమండ్రి జోన్‌లో విధుల నిర్వహణకై అవసరమైన గెజిటెడ్ అధికారులు : జనరల్ మేనేజర్-1,అదనపు జీఎం/హైయ్యర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ (ప్రిన్సిపల్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్స్)-13మంది అధికారులు, ఎస్ఏ గ్రేడ్-30మంది అధికారులు,జేఏ గ్రేడ్/ఎస్‌జీ గ్రేడ్ అధికారులు-45మంది,సీనియర్ స్కేల్,జూనియర్ స్కేల్ హోదా కలిగిన అధికారులు మరో 81మంది వెరసి జనరల్ అడ్మినిస్ట్రేషన్,అకౌంట్స్,కమర్షియల్, ఇంజనీరింగ్,ఎలక్ట్రికల్, ఆపరేటింగ్,మెకానికల్, మెడికల్,పర్సనల్,ఎస్అండ్‌టి, స్టోర్స్,సెక్యూరిటీ విభాగాలకు సంబంధించి మొత్తం 170మంది అధికారులు విధుల నిర్వహణకై కావలసి ఉంటుంది. అలాగే ఈ విభాగాలలో నాన్-గెజిటెడ్ క్యాడర్‌లో మొత్తం 1200మంది సిబ్బంది అవసరం ఉంది. వీరిలో నాన్ మినిస్టీరియల్(సూపర్‌వైజర్స్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్స్,జూనియర్ ఇంజినీర్స్,ఎస్ఎస్ ఓట్లు, ఎస్ఓలు,అకౌంట్స్ అసిస్టెంట్‌లు, ఐఎస్ఏలు,ఆర్‌పిఎఫ్ సిబ్బంది 700మంది కాగా,మినిస్టీరియల్ స్టాఫ్-380మంది,లెవెల్-1,సిబ్బంది-120మంది అవసరమవుతారు. ఇక డివిజనల్ కేంద్రాలు, అక్కడ అవసరమయ్యే ఉద్దేశ్యంతో రైల్వే శాఖ ఉన్నట్లు తెలుస్తోంది.

## ప్రధాని మోడీ నేతృత్వంలో జమ్మూకాశ్మీర్‌లో కొత్త పురోగతి యుగం ప్రారంభమైంది : సిఎం చంద్రబాబు



**విజయవాడ,జూన్6,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో జమ్మూకశ్మీర్‌లో కొత్త పురోగతి యుగం ప్రారంభమైందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు."ఎక్స్" వేదికగ ఆయన వ్యాఖ్యానం చేస్తూ సవాళ్ళతో కూడిన భూభాగంలో రెండు కీలక ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసి దేశానికి అంకితం చేసిన మోడీని అభినందిస్తున్నట్లు చెప్పారు.చినాబ్ బ్రిడ్జ్ ప్రపంచంలోనే ఎత్తయిన రైలు ఆర్చ్ వంతెన.దేశంలోనే మొట్టమొదటిసారిగా తీగలతో అనుసంధానించిన అంజీ రైల్వే వంతెనను నిర్మించినట్లు వెల్లడించారు.ఉదంపూర్- శ్రీనగర్-బారాముల్ల రైలు లింక్ ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మెరుగుపరుస్తుందని.జీవనోపాది అవకాశాలను సృష్టిస్తుందని అభిప్రాయపడ్డారు.వందేభారత్ రైళ్ళ ద్వారా అన్ని వాతావరణ పరిస్థితుల్లో మాతా వైష్ణోదేవి కొలువైన కట్‌ఢా నుంచి శ్రీనగర్ వరకు రైలు కనెక్టివిటీ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## ఎమ్మెల్యే గోపినాథ్ పరిస్థితి అత్యంత విషమం

### వెంటిలేటర్‌పై కొనసాగుతున్న చికిత్స

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), జూన్ 6, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ (62)ఆరోగ్యం అత్యంత విషమంగా ఉంది. ఆయనకు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. గురువారం సాయంత్రం ఇంట్లో ఆయనకు గుండెపోటు వచ్చినట్లు సమాచారం. కుటుంబసభ్యులు నిన్న 4:35 నిముషాలకు ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. కార్డియాక్ అరెస్ట్‌కు గురైనట్లు వైద్యులు తెలిపారు. సీపీఆర్ చేయటంతో తిరిగి గుండె కొట్టుకోవడం,నాడి, బీపీ సాధారణ స్థితికి రావడంతో .. ఐసీయులో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆయన ఆరోగ్యంపై ఆసుపత్రి వైద్యులు బులెటెన్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. కొన్నాళ్లుగా గోపీనాథ్ కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. మూడు నెలల క్రితం కూడా ఆయన ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు.

అప్పట్లో ఆయన డయాలసిస్ చేయించుకున్నట్లు సమాచారం. మాగంటిని పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు గుండెపోటులో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. మధ్యాహ్నం ఆసుపత్రికి చేరుకున్న మంత్రి శ్రీధర్‌బాబు మాగంటి గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యులను అడిగితెలుసుకున్నారు.

కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారంగా గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి నిన్నటి కంటే మెరుగ్గా ఉందని, గోపీనాథ్ తనకు సన్నిహితుడని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

### కెటిఆర్ ఆరా.. విదేశ పర్యటన కుదింపు

విదేశీ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాగంటి ఆరోగ్యంపై ఆరా తీశారు. గోపీనాథ్ కుటుంబసభ్యులతోనూ, ఏఐజీ ఆసుపత్రి వైద్య బృందంతోనూ ఫోన్‌లో మాట్లాడారు. అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని, ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడే అవకాశం ఉందని వైద్యులు కేటీఆర్‌కు వివరించారు. ఈ ఘటన నేపథ్యంలో అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్ తన విదేశీ పర్యటనను కుదించుకుని హైదరాబాద్ బయలుదేరుతున్నట్లు తెలిసింది. గుండెపోటుతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న మాగంటి గోపీనాథ్‌ను నగరమేయర్ విజయలక్ష్మితో పాటు కొందరు బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పరామర్శించారు.

## విదేశాల్లో సింగరేణి బ్లాకులు కొనాలి

### కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** విదేశాల్లో క్రిటికల్ మినరల్ బ్లాకులను కూడా తెలంగాణలోని సింగరేణి కాలరీస్ సొంతం చేసుకోవాలని కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి సూచించారు. తద్వారా దేశ ఖనిజ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఢిల్లీలో శుక్రవారం నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్ ఔట్రీచ్ ఫోరమ్‌ను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సెమినార్లో మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. క్లీన్ ఎనర్జీ, సెమీకండక్టర్స్, రక్షణ, డిజిటల్ టెక్నాలజీ రంగాలకు లిథియం, కోబాల్ట్, నికెల్ వంటివి క్రిటికల్ మినరల్స్ ఎంతో ముఖ్యమన్నారు. వీటి సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి ఈ క్రిటికల్ మినర్స్ మిషన్ ఔట్రీచ్ ఫోరమ్ ఒక వేదికగా పనిచేస్తుందని తెలిపారు.

అలాగే ఈ ఫోరమ్ ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యా సంస్థలు, పరిశోధన సంస్థల మధ్య సమన్వయ సహకారాన్ని ప్రోత్సహిస్తుందని వెల్లడించారు. గనుల రంగంలో తమ ప్రభుత్వం గత పదేళ్లలో అనేక సంస్కరణలు తెచ్చిందని చెప్పారు. పారదర్శకంగా మినరల్ బ్లాకుల వేలం ప్రక్రియను అమలు చేస్తోందని వివరించారు. ఆస్ట్రేలియా, అర్జెంటీనా, చిలీలతో క్రిటికల్ మినరల్స్ సరఫరా, అన్వేషణ, ప్రాసెసింగ్‌కు సంబంధించి భారత్ ఒప్పందాలు కుదుర్చు కుందని వెల్లడించారు. ఈ ఒప్పందాలు భారతదేశ ఇంధన భద్రత, సాంకేతిక అభివృద్ధికి దోహద పడతాయని ఆశా భావం వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ ఇప్పటికే బొగ్గు ఉత్పత్తిలో దేశంలో అగ్రగామిగా ఉందని, ఇప్పుడు విదేశీ ఖనిజ బ్లాకులలో పెట్టుబడులు పెట్టడం ద్వారా మరింత వృద్ధి సాధించాలని పేర్కొన్నారు. ఔజీచీ2తితాాళ;ౌంప్ట కాగా దేశ వ్యాప్తంగా ఇప్పటివరకు 34 క్రిటికల్ మినరల్ బ్లాకుల వేలం పూర్తయిందని, ఇందులో లిథియం, గ్రాఫైట్ వంటి ముఖ్యమైన ఖనిజాల బ్లాకులు ఉన్నాయని పేర్కొన్నారు. ఔజీచీ2తితాాళ;ౌంప్టజియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గత మూడేళ్లలో 445 ప్రాజెక్టులను చేపట్టిందని, 185 ప్రాజెక్టులకు నిధులు కేటాయించామన్నారు. ఈ ప్రాజెక్టులు ఖనిజ సంపదను గుర్తించడం, అన్వేషణను వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

## రాష్ట్రంలో మెగా డిఎస్సీ పరీక్షలు ప్రారంభం

**విజయవాడ,జూన్ 6,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో మెగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం విడతలో 9 గంటల వరకు అభ్యర్థులను అనుమతించారు. 9.30 నుండి 12 గంటల వరకు ఎగ్జామ్ ఉండనుంది. ఈ నెల 30 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఏపీలో 137,తెలంగాణ,కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాల్లో 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.మెగా డీఎస్సీలో 16,347 ఉపాధ్యాయ పోస్టులకు 3,36,305 మంది అభ్యర్థులు 5,77,675 ధరఖాస్తులు సమర్పించారు. మధ్యాహ్నం విడతలో 2 గంటలకు అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించనున్నారు.

2.30 నుండి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మరో వైపు డిఎస్సీ అభ్యర్థులందరికీ సిఎం చంద్రబాబు మంత్రి నారా లోకేష్ శుబాకాంక్షలు తెలిపారు.

### నిజామాబాద్ జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్.. కానిస్టేబుల్ సస్పెన్షన్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లాలో మద్యం సేవించి వాహనం నడుపుతూ మరో వాహనాన్ని ఢీకొన్న కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని నిజాంసాగర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాకేష్ గౌడ్ గురువారం నాడు చెప్పాపెట్టకుండా విధులకు డుమ్మా కొట్టడంతో పాటు మద్యం సేవించి వాహనం నడుపుతూ మరో వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటన జిల్లాలోని తాడ్వాయి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. కాగా ప్రమాదం జరిగిన ప్రాంతంలో స్థానికంగా కొంత రగడ జరిగింది. కాగా కానిస్టేబుల్‌కు పరీక్ష చేయగా మద్యం సేవించి వున్నట్లు తేలింది.

## ఈటల ఇచ్చిన వివరణ చూస్తే కెసిఆర్‌తో కుమ్మక్కైనట్లు స్పష్టం

### ఆయన వ్యాఖ్యలు వ్యక్తిగతమా? బిజెపి విధానమా?

### పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 6:** కాళేశ్వరం కమిషన్ విచారణ అనంతరం బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి సంబంధించి విచారణ అనంతరం ఈటల వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్ తప్పేమీ లేదన్నట్లుగా, అంతా కేబినెట్ నిర్ణయం మేరకే జరిగిందని బుకాయిస్తున్నారని మండిపడ్డారు. ఆర్థిక మంత్రిగా ఉన్న వ్యక్తి ప్రాజెక్టు నిధులతో తనకు సంబంధమే లేదని అనడం హాస్యాస్పదమని వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ దేశమంతా కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని కోడై కూసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని... వేల కోట్ల అవినీతి జరిగిందంటూ గతంలో అనేక సార్లు ప్రధాని సహా పలువురు ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. కానీ ఈటల అందుకు భిన్నంగా ఈరోజు కమిషన్ ఎదుట ఇచ్చిన వివరణను చూస్తే కేసీఆర్‌తో కుమ్మక్కైనట్లు స్పష్టమైందన్నారు. కాళేశ్వరంలో ఈటెలకు కూడా వాటాలు ముట్టినందునే కేసీఆర్‌కు అనుకూలంగా మాట్లాడారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం అవినీతిపై పల్లెత్తు మాట కూడా విచారణ కమిషన్ ఎదుట ఎందుకు చెప్పలేదని ఈటెలను ప్రశ్నించారు. ప్రజలు, రైతుల నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలను పెంచినట్లు ఈటల చెప్పడం చూస్తుంటే ఆశ్చర్యమేస్తోందన్నారు. ఈటల ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లుందని అన్నారు. కేసీఆర్‌ను కాపాడేందుకు పూర్తిగా వకాల్తా పుచ్చుకుని వివరణ ఇచ్చినట్లు ఎంపీ మాటల ద్వారా కన్పిస్తోందన్నారు. పక్కా ప్రీ ప్లాన్ ప్రకారం కేసీఆర్, హరీష్ రావు, ఈటల కూడబలుక్కుని ఒక్కటే సమాధానాలు చెప్పాలని, అవినీతి జరగలేదని బుకాయించేందుకు సిద్ధమై వచ్చి పచ్చి అబద్ధాలువల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈటల వ్యాఖ్యలు చూస్తుంటే హరీష్ రావుతో ఆయన రహస్యంగా భేటీ అయ్యారని తాను చెప్పిన మాటలు నిజమని తేలిందన్నారు. టెక్నికల్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే ప్రాజెక్టు కట్టారని చెబుతున్నారన్నారు. కాళేశ్వరంలో వేల కోట్ల అవినీతి జరిగిందని మొత్తుకున్న బీజేపీ నాయకులు ఇప్పుడ ఏ ముఖం పెట్టుకుని మాట్లాడతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌తో బీజేపీకి ఉన్న లోపాయికారి ఒప్పందం మేరకే కేసీఆర్‌ను కాపాడేందుకు ఈటలతో వివరణ ఇప్పించారా అని నిలదీశారు. దీనిపై బీజేపీ నాయకత్వం సమాధానం చెప్పాలన్నారు. లేదంటే ప్రధాని సహా బీజేపీ పెద్దలకు కూడా వాటాలు ముట్టినట్లే అని.. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రజలంతా భావించాల్సి వస్తుందన్నారు. కాళేశ్వరం విషయంలో బీజేపీ తన పంథా మార్చుకుందా? ఈటల ఇచ్చిన వివరణ ఆయన సొంతమా? లేక బీజేపీ విధానమా? కాళేశ్వరంలో అవినీతి జరిగిందని బీజేపీ చెబుతుంటే... అసలు అవినీతే జరగలేదని మాట్లాడుతున్న ఈటలపై చర్యలు తీసుకునే దమ్ముందా? కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించేందుకు సిద్ధమా? అంటూ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు.

## రైతులకు పాడి గేదెల స్కీమ్

### కుటుంబానికి రెండు జీవాలు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతులకు మరో శుభవార్త వినిపించేందుకు తెలంగాణ సర్కార్ సిద్ధమవుతోంది. భూమి లేని రైతులకు కూడా ఫ్రీగా గేదెలు ఇవ్వాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే రైతులకు రుణమాఫీ, రైతు భరోసాను ఇచ్చింది. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు బోనస్ అందిస్తోంది. తాజాగా రైతులను ఆకర్షించేందుకు ప్రభుత్వం మరో కొత్త పథకం తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. రైతు కుటుంబాలను ఆకర్షించేందుకు పాడి గేదెల పంపిణీ స్కీమును తీసుకురాబోతున్నట్లు సమాచారం. వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు ఈ పాడి గేదెలను ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన లబ్దిదారుల జాబితాలను గ్రామాల్లో ప్రకటించి కుటుంబానికి 2 గేదెలను ఇవ్వాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పుడు చర్చలు జోరుగా సాగుతున్నాయి. కౌలు రైతులకు కూడా ఈ స్కీము వర్తింపచేయ్యాలా వద్దా అనే దానిపై చర్చలు జరుగుతున్నాయి.



## 'విశ్వశాంతి మహాశక్తి గణపతి'గా ఖైరతాబాద్ గణేశుడు

### ఈసారి 69 అడుగుల ఎత్తులో భక్తులకు దర్శనం

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. నిర్జల ఏకాదశి రో జున జరిగే ఈ సంప్రదాయ కార్యక్రమంతో ఖైరతాబాద్ మహాగణపతి నిర్మా ణానికి శ్రీకారం చుట్టారు. ఈమేరకు శుక్రవారం గణేశుడి మండపం వద్ద కర్ర పూజ ఘనంగా నిర్వహించి గణపతి రూపాన్ని అధికారికంగా విడుదల చేశా రు. దీంతో ఈ యేడాది గణనాథుడు 'విశ్వశాంతి మహాశక్తి గణపతి'గా 69 అడుగుల ఎత్తులో భక్తులకు దర్శనమివ్వనున్నాడు. మహాగణపతికి కుడివైపు జగన్నాథస్వామి, లక్ష్మీ సమేత హయగ్రీవస్వామి దర్శనమిస్తే, ఎడమవైపు లలిత త్రిపురసుందరి-శ్రీగజ్జలమ్మదేవి కూడా కొలువై ఉంటారని ఉత్సవ సమి తి సభ్యులు తెలిపారు. శ్రీగణేశ ఉత్సవ కమిటీ-ఖైరతాబాద్ గణేశ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కర్ర పూజకు ఎమ్మెల్యే దానం నాగేందర్, రాజ్యసభ ఎంపి అనిల్‌కుమార్‌యాదవ్, నగర మేయర్ గద్వాల

## కొత్త జూ. లెక్చరర్లకు శిక్షణ తరగతులు

### ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో 9 నుంచి 11 వరకు శిక్షణ

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ జూని యర్ కాలేజీల్లో ఈ యేడాది ఏప్రిల్‌లో సుమారు 1092 మంది జూనియర్ లెక్చరర్లు కొత్తగా నియమితులయ్యారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ద్వారా నియామకాలను చేపట్టారు. రాష్ట్రంలో ఉన్న 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో దాదాపు 12 సంవత్సరాల తరువాత జేఎల్ పోస్టులను భర్తీ చేశారు. ఏప్రిల్‌లో జేఎల్స్‌గా నియమితులైన వారిలో గణితం లెక్చరర్లకు మూడు రోజులపాటు శిక్షణా తరగతులను నిర్వహించాలని ఇంటర్ విద్యా శాఖ నిర్ణయించింది. 100 మంది గణిత లెక్చరర్లకు ఈ నెల 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి)లో జేఎల్స్‌కి శిక్షణా తరగతులను ఇవ్వాలని ఇంటర్ విద్య శాఖ నిర్ణయించింది. 100 మందిని రెండు బ్యాచ్‌లుగా విభజించి వారికి కెపాసిటీ బిల్డింగ్‌తోపాటు ప్రేరణా త్మకమైన శిక్షణను అందించాలని ఇంటర్ విద్యా శాఖ నిర్ణయించింది. శిక్షణ అనంతరం ఈ నెల 12 నుంచి లెక్చరర్లు తమ కాలేజీల్లో క్లాసులను బోధించనున్నారు.

## ఉద్యోగులకు బాసటగా ప్రభుత్వం

### తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఉద్యోగులకు బాసటగా నిలుస్తుందని తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేయూతగా నిలుస్తుందన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తుందన్నారు. రాష్ట్ర కేబినేట్ ఉద్యోగుల విషయంలో గురువారం తీసుకున్న నిర్ణయాలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రెండు డిఎల చెల్లింపు, ఆరోగ్య పథకం అమలుకు ట్రస్ట్ ఏర్పాటు, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రతి నెల రూ.700 కోట్ల విడుదల, ఎన్నికల సమయంలో జరిగిన బదలీ అయిన ఉద్యోగులు సొంత జిల్లాలకు తిరిగి పంపడం తదితర అంశాలపై తీసుకున్న నిర్ణయాల పట్ల సిఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలను తెలిపారు. నాంపల్లి సిసిఎల్‌ఎ కార్యాలయం ప్రాంగణంలోని డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ కార్యాలయం శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ రాష్ట్రంలో ఫ్రెండ్లీ ప్రభుత్వం నడుస్తుందన్నారు. సాధారణ బదిలీలు, సాధారణ ఎన్నికల సమయంలో బదలీ అయిన అధికారులను పూర్వ జిల్లాలకు బదలీ చేయాలని కోరామన్నారు. దీనిపై కూడా కేబినేట్ సానుకూలంగా స్పందించడంతో చాలా మంది ఉద్యోగులకు లాభం జరుగుతుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు.



ఇర్కోడు మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీమంత్రి హరీశ్‌రావు

## పద్మశాలి సంఘం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తా

### చదువుతోనే పేదరికం దూరం: మాజీమంత్రి హరీశ్‌రావు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** పద్మశాలి సంఘం అభివృద్ధికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన పద్మశాలి సమాజం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్స వంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పద్మశాలీలు వృత్తిమీద ఆధారపడి జీవించే పరిస్థితి లేదని, పని చేసుకుందామంటే అవకాశాలు తక్కువగా ఉన్నాయని పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడం కష్టంగా మారిం దన్నారు. పిల్లలను బాగా చదివించాలని చదువుతోనే పేదరికం దూర మవు తుందన్నారు. దేవాలయ, సమాజ అభివృద్ధికి తన వంతు సహా య సహ కారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి నూతన కార్య వర్గం, పద్మశాలి సమాజం ప్రతినిధులు కాముని రాజేశం, గుండు భూపేష్, గూడూరి శ్రీనివాస్, డాక్టర సతీష్, బూ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.
సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామంలో మహంకాళి అమ్మవారి దేవా లయ ప్రతిష్ఠాపన ఉత్స వాల్లో జరిగిన పూర్ణహుతి కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహంకాళి అమ్మవారి దేవాలయాన్ని కెసిఆర్ ఆశీస్సులతో రూ.50 లక్షలతో అద్భుతంగా నిర్మించు కున్నామన్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడకలోని పట్టాభిరామ దేవాలయాన్ని దర్శించుకొని దేవాలయ ధ్వజ స్తంభం ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించారు.
సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పెద్దలింగారెడ్డిపల్లిలో మహంకాళి అమ్మవారి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చిన్నకోడూరు మండల పరిధిలోని రామంచ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీ పెద్దమ్మ దేవా లయ పునర్ నిర్మాణ పనులకు హరీష్‌రావు భూమి పూజ చేశారు.

# రాజన్న కోడెలపై రాజకీయం వద్దు

### మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాజన్న కోడెలపై ఎటువంటి రాజకీయాలు చేయవద్దని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రతిపక్ష పార్టీలకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గడిచిన 10 యేళ్లలో వేములవాడ దేవస్థానానికి సంబం ధించి దేవాదాయ శాఖకు సంబంధించి బిఆర్ఎస్ పాలనలో ఏంచేశారో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో వేములవాడ టెంపుల్ కి కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. కోడెల దుస్థితికి పాపం కేసీఆర్ పాలనదేనని, కోడెల ఘటన జరిగిన వెంటనే తమ ప్రభుత్వం స్పందించిందన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఈ విషయంలో బురద రాజకీయం చేయడం సరి కాదన్నారు.
తమ హయాంలో సక్సెస్‌ఫుల్‌గా సరస్వతీ పుష్కరాలు నిర్వహించామని, 30 లక్షల మంది భక్తులు వచ్చినా ఎక్కడా చిన్న ఇబ్బంది జరగ కుండా నిర్వహించామన్నారు. ఇక భద్రకాళి ఆలయం విస్తరణ పనులు కోట్లాది రూపాయలతో చేపట్టామన్నారు. యాదగిరిగుట్ట మీద కేసీఆర్ బొమ్మలను చెక్కించుకున్న వాళ్లకు అసలు దేవుళ్ల విషయంలో మాట్లాడే అర్హత ఉందా అని సురేఖ ప్రశ్నించారు. యాదగిరిగుట్టకి తాము రూ. 63 కేజీల బంగారంతో గోపురం తాపడం చేయిం చామన్నారు. సామూహిక కోటి దీపో త్సవం, పలు నదీ హారతి కార్యక్రమాలు, కాళేశ్వ రం, యాదగిరిగుట్టలకు మహా కుంభాభిషేకం చేశామన్నారు.గత పదేండ్ల పాటు రాష్ట్ర సంపదను ఇష్టారీతిన దోచుకున్న కల్వకుంట్ల దండుపాళ్యం బ్యాచ్ నేడు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుంటే.ఉద్వేగం పేరుతో మనల్ని ఉన్మాదులను చేసే కుట్రకు పాల్పడుతు ఒడటం బాధాకరమన్నారు. కేసీఆర్ కుటుంబంలో అంతర్గత గొడవలతో బీఆర్ఎస్ నాయకులకు ఏం మాట్లాడాలో.... ఏ విధంగా స్పందించాలో అర్థం కావడం లేదన్నారు. వేములవాడ రాజన్న దగ్గర మొక్కులు మొక్కి రూ.100 కోట్లు ఇస్తానని దేవుడిని మోసం చేసిన ఘనత కేసీఆర్, కేటీఆర్ లది కాదా? అని ఆమె ప్రశ్నించారు. అప్పుడు కేసీఆర్ హామీ ఇచ్చినట్లు వేములవాడకు వంద కోట్లు ఖర్చు పెడితే గోశాల కూడా బాగుపడేది కదాని ప్రశ్నించారు. కోడెల మొక్కులు,కోడెలు సమర్పించుకోవటం భక్తుల నమ్మకం, విశ్వాసాలకు సంబంధించిందన్నారు. వాటిని కూడా రాజకీయం చేయటం బీఆర్ఎస్ పార్టీ నీచ రాజకీయానికి, ఆ పార్టీ నాయకుల నీచ మనస్తత్వానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. కేసీఆర్ పదేండ్ల అరిష్టపు పాలన ఇప్పటికీ వేములవాడను వెంటాడుతోందన్నారు. ఆ పాపం బీఆర్ఎస్ పార్టీని కూడా వెంటాడుతుందని.. అందుకే ఆ పార్టీలో లుకలుకలు తెరపైకి వస్తున్నాయన్నారు.
రాజన్న దేవాలయం విస్తరించేందుకు వేగంగా చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. ఒక్కో నెలలో భక్తులు ఎక్కువ సంఖ్యలో కోడెలను సమర్పి స్తారని, ఇది అక్కడ అందరికీ తెలిసిందేనని, కొన్నిసార్లు అనారోగ్యంతో ఉన్న కోడెలను భక్తులు ఆలయం వద్ద వదిలేసి వెళుతారని.. వాటిని కూడా సంరక్షించిన బాధ్యత ఆలయంపై ఉంటుందని అన్నారు. కోడెలు జబ్బు పడ్డప్పుడు, వాటి సంరక్షణకు 12 మందితో పశువైద్య అధికారుల బృందాన్ని తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రతి రోజూ సరిపడేంత పచ్చి గడ్డి అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోవులను కాపాడాలని, గోశాలలను అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని గుర్తు చేశారు.

# రాజేంద్రనగర్‌లో దంపతుల దారుణహత్య

### కత్తులతో పొడిచి కిరాతకంగా చంపిన దుండగులు

### అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం : డిసిపి సిహెచ్ శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్

**హైదరాబాద్ (అత్తాపూర్) జూన్ 6, ప్రభాతవార్త :** భార్యాభర్తలను అత్యంత కిరాతకంగా గుర్తు తెలి యని దుండగులు కత్తులతో పొడిచి చంపిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జనచైతన్య ఫేస్-2లో చోటుచేసుకుంది. సమా చారాన్ని అందుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుకొని ఆధారాలు సేకరించి మృత దేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ వివరాల ప్రకారం.. హైదర్‌గూడా జనచైతన్య ఫేస్-2లో దంపతులు షేక్‌అబ్దుల్లా (70) రిజ్వానా బేగం (65)లు నివాసముంటున్నారు. వీరు 40 రోజుల క్రితమే ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. భర్త షేక్ అబ్దులా (70) బ్యాంకు ఎంప్లాయిగా చేసి రిటైర్ అయ్యాడు. భార్య ఓ ప్రైవేట్ కాలేజీలో హెచ్ఒడిగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. అయితే బిల్డింగ్‌ను వీరు సొంతం గానే నిర్మించుకొని మిగతా పోర్షన్లు రెంట్‌కి ఇచ్చి, ఒక డూప్లెక్స్‌లో నివాసం ఉంటున్నారని తెలిపారు. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌ను విచారించగా గురువారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు వచ్చారని, మమ్మల్ని మసాజ్ గురించి బుక్ చేసుకున్నారని చెప్పడంతో వాచ్‌మెన్ యజ మానికి ఫోన్‌చేసి వీళ్లను తీసుకెళ్లి వారి పోర్షన్ దగ్గర వదిలి వచ్చినట్లు తెలిపారు. అన్ని కోణాల్లో విచారణ చేపట్టామని, వీరిద్దరే దంపతులను హత్య చేసినట్లు అనుమానిస్తున్నట్లు తెలిపారు. మృతులకు నాలుగురు పిల్లలు ఉన్నారని పిల్లలు ఇద్దరు యుఎస్‌లో, ఇద్దరు లండన్‌లో ఉండడం వల్ల ఎలాంటి సమాచారం లభించలేదన్నారు. కత్తులతో పొడిచి హత్య చేసినట్లు ఆధారాలు ఉన్నాయని క్లూస్‌టీం, డాగ్స్ స్క్వాడ్‌తో అన్ని ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి సిసి కెమె రాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని తొందర గానే కేసు చేధిస్తామని డిసిపి వెల్లడించారు.

# గురుకులాల అద్దె బకాయిలు తక్షణమే చెల్లించాలి

### గురుకుల విద్య నిర్వీర్యానికి ప్రభుత్వం కుట్ర : ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న వివిధ గురుకులాల అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని గురుకుల విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ మండిపడ్డారు. గురుకుల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, నాణ్యమైన ఆహారం అందించడంలో సర్కార్ వైఫల్యం చెందిందన్నారు.
అద్దె భవనాల్లో కొనసాగుతున్న 650 గురుకుల పాఠశాలల కిరాయిలు దాదాపు పది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈనెల 12 నుండి విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో .. భవన యాజమాన్యాలు ఆలోపు బిల్లులు చెల్లించకపోతే భవనాలకు తాళాలు వేస్తామని చెబుతున్నరాని.. కాబట్టి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న గురుకులాల అద్దె బకాయిలు రూ.215 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ విద్యార్థులకు గురుకులాలు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని.. అలాంటి గురుకులాలకు కనీసం కిరాయిలు చెల్లించకుండా ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటన్నారు. ఈ నెల12 నుంచి విద్యార్థులు హాస్టల్స్ వస్తే కిరాయిలు చెల్లించకపోతే భవన యాజమాన్యాలు తాళాలు వేస్తే విద్యార్థులు రోడ్డు మీద ఉండే పరిస్థితి వస్తుందని.. ప్రభుత్వం వెంటనే అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల కిరాయిలు చెల్లించాలన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం గురుకులాలకు సొంత భవనాలు నిర్మించేలా నిధులు కేటాయించాలని, విద్యా సంవత్సరం ప్రారంభ నేపథ్యంలో గురుకుల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేసి మంచి నాణ్యమైన ఆహారం అందించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# అద్భుత సాహితీమూర్తి ఆచార్య ఎస్వీ రామారావు

### ఆచార్య కొలకలూరి ఇనాక్ అభినందన



ఆచార్య ఎస్వీ రామారావును ఘనంగా సత్కరిస్తున్న కొలకలూరి ఇనాక్, పద్మనాభరావు, సురేష్‌చంద్ర, ఫణీంద్ర, గౌరీశంకర్, నరసింహాచార్య, దత్తాత్రేయశర్మ తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 6, ప్రభాతవార్త :** ఆచార్య ఎస్.వి.రామారావు నిరంతర అద్భుత సాహితీమూర్తి, అక్షర తపస్వి అని శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. విమర్శ అనేటటువంటిది లేనిరోజుల్లో విశ్వవిద్యాలయాల్లో విమర్శ ప్రక్రియను ప్రారంభించారని, అధ్యాప కుడుగా సౌమనస్యం, సుందర భావజాలం, భావయుక్తం, మంచితనం, ప్రేమ మమకారాలు, చైతన్యం ఆయన రచనల్లో ఉన్నాయన్నారు. విద్యా ర్థిని ప్రేమించే గొప్పవ్యక్తిత్వం ఉన్న ఏకైకవ్యక్తి ఎస్వీరామారావు అని స్పష్టం చేశారు. సాహిత్యం అధ్యాపకధర్మంలో, ఆలోచన. పరిశోధన నిర్వి రామ తపస్సుచేస్తున్న ఎస్వీ 85వ జన్మదిన మహో త్సవం విద్యార్థులంతా కలిసిచేయడం గొప్పవిశేషమన్నారు. 1924 తర్వాత 2000దాకా తెలుగుసాహిత్యంలో వచ్చిన రచయి తలందర్నీ పరిచయం చేయాలన్న ఆయన ప్రయ త్నం అనితరసాధ్యమని, నిజానికి విశ్వవిద్యా లయాల వంటివి చేయాల్సిన పని ఇదన్నారు.
బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య ఎస్.వి.రామారావు 85వ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యా లయం లోని డా. నందమూరి తారక రామారావు కళా వేదికలో శతజయంతి సాహితీమూర్తులు, విమర్శ నారామం ఆచార్య ఎస్వీ రామారావు సమగ్ర సాహిత్య సమాలోచన గ్రంథాల ఆవి ష్కరణ దత్తాత్రేయశర్మ, డా. లలితావాణి, సాధన నర సింహాచార్య, డా. ఆచార్య ఫణీంద్రల నేతృ త్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య కొలకలూరి ఇనాక్ శతజయంతి (సాహితీమూర్తులు) గ్రంథాన్ని; సభాధ్యక్షుడు దూరదర్శన్ మాజీ సంచాలకుడు డా. ఆర్.అనంతపద్మనాభరావు విమర్శ నారామం (ఆచార్య ఎస్వీ రామారావు-సమగ్ర సాహిత్య సమాలోచన) గ్రంథాలను విశిష్ట అతిథులు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, సురేష్‌చంద్రశర్మ, ఆచార్య సాగి కమలాకరశర్మ తదితరులతో కలిసి ఆవిష్కరించి ఎస్వీ రామారావును ఘనంగా సత్కరించారు. అనంతరం పద్మనాభరావు అధ్యక్షోపన్యాసంలో 85 ఏళ్లయినా నిరంతర సాహితీ శ్రామికుడని, పుస్తకాలు వ్రాస్తూనే ఉన్నారని అన్నారు. డా. ఆచార్య ఫణీంద్ర శతజయంతి; ఆచార్య టి. గౌరీశంకర్ విమర్శనారామం గ్రంథాల సమీక్ష కావించారు. చివరిగా 30 మంది ప్రముఖ సాహిత్య, సాంస్కృతిక సంస్థల సారథులకు ఘనంగా ఆత్మీయ సత్కారం చేశారు. సభకు ముందు ఆచార్య సాగి కమలాకరశర్మ, ఆచార్య వేణు, ఆచార్య ఫణీంద్ర ప్రభృతులు పాల్గొన్న గోలకొండ సాహితీ వైభవం సాహిత్యరూపకం ప్రదర్శించారు.

# 18 నుంచి గ్రూప్-3 అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

### జూలై 8 వరకు కొనసాగింపు

### షెడ్యూల్ ప్రకటించిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 1388 గ్రూప్-3 పోస్టుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 18 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) ప్రకటించింది. ఈ నెల 18 నుంచి జులై 8 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను కొనసాగించనున్నట్టు కమిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 1388 గ్రూప్-3 పోస్టుల భర్తీ కోసం టిజిపిఎస్‌సి 2022 డిసెంబర్ 31న నోటిఫికేషన్ నంబర్.29/2022ను జారీ చేసింది. ఫలితాల ప్రకటన అనంతరం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈ నెల 18 నుండి జులై 8 వరకు ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహించనున్నారు. ఎవరైనా ఈ తేదిల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరు కాలేకపోతే వారికి రిజర్వ్ డేగా నిర్ణయించిన జులై 9న ఉదయం 10:30 నుండి సాయంత్రం 5.30 వరకు సురవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాలయం పబ్లిక్ గార్డెన్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థుల జాబితా కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులు వెరిఫికేషన్ మెటీరియల్, రోజు వారీగా షెడ్యూల్‌ను ఈ నెల 10 నుండి కమిషన్ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలని కార్యదర్శి ప్రకటించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వచ్చేటపుడు అభ్యర్థులు అవసరమైన అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్‌లను, స్వీయధృవీకరిం చబడిన ఫోటోస్టాట్ కాపీల సెట్‌ను తప్పకుండా తీసుకురావాలని సూచించారు.

## ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలు కాపాడిన డయల్ 112

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** నగరంలోని బంజారాహిల్స్‌లో గల కమాండ్ కంట్రోల్ కేంద్రంగా పనిచేస్తున్న డయల్ 112 ఆపదలో వున్న వ్యక్తి ప్రాణా లను కాపాడిన ఘటన ఇది. కమాండ్ కంట్రోల్ డైరక్టర్ కమలాసన్ రెడ్డి దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. గురువారం రాత్రి పది గంటల ఏడు నిమిషాలకు డయల్ 112కు ఒక ఫోన్ వచ్చింది. కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని తంగోపిపేట్ తాండాలో ఓ వ్యక్తిని కొందరు కత్తులతో పొడి చారని, బాధితుడి పరిస్థితి తీవ్రంగా వుందని, అతనికి వెంటనే వైద్యం అందించాల్సిన అవసరం వుందని, నిందితులను పట్టుకునేందుకు పోలీసుల అవసరం కూ డా వుందని ఫోన్ చేసిన వ్యక్తి తెలిపాడు. దీనిపై వెంటనే స్పందించిన డయల్ 112 సిబ్బంది కామారెడ్డి జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఇదే సమయంలో బాన్సువాడ రూరల్ పోలీసులను అలర్ట్ చేసి ఘటనా స్థలికి వెళ్లాలని ఆదేశించి, సమీపంలోని అంబులెన్స్‌ను కూడా అక్కడకు పంపారు. డయల్ 112 చొరవ కారణంగా పోలీసులతో పాటు అంబులెన్స్ సిబ్బంది నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలికి చేరుకుని బాధితుడిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి త రలించి వైద్య సేవలందేలా చేశారు. ఇప్పుడు అతని పరిస్థితి పరవాలేదని, కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు. కాగా బాధితుడిని కత్తులతో పొడిచి పారిపో యిన వారి కోసం బాన్సువాడ రూరల్ పోలీసులు గాలింపు చేబట్టారు. రాష్ట్రంలో ఆపదలో వున్న వారిని డయల్ 112 ఆదుకునేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని కమాండ్ కంట్రోల్ డైరక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు.

## మంత్రి పొంగులేటికి ట్రెసా కృతజ్ఞతలు

**హైదరాబాద్ జూన్ 6. ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల తిరుగు బదలీలు చేపట్టాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) కృతజ్ఞతలు తెలిపింది. శుక్రవారం ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిశారు.ఈ సందర్భంగా మంత్రి బదిలీల విషయంలో ట్రెసా కృషిని అభినందిస్తూ బదిలీలు త్వరలోనే పూర్తవుతాయని, రెవెన్యూ ఉద్యోగులందరూ కొత్త చట్టం, రెవెన్యూ సదస్సుల నేపథ్యంలో ప్రజలకు మేలైన సర్వీసులు అందించాలని కోరినట్లు రవీందర్ రెడ్డి తెలిపారు.బదిలీల విషయంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపినందులకు ట్రెసా పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు.మంత్రిని కలిసిన వారిలో ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతం కుమార్, రాజ్‌కుమార్, రమన్ రెడ్డి, చక్రవర్తి, పకీల్, రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## గురుకుల కళాశాలలో తొలగించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

### మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు హాసేన్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 6, ప్రభాతవార్త:** స్టాండర్డ్ గురుకుల కళాశాలలో పనిచేస్తున్న వార్డెన్స్,అసిస్టెంట్ కేర్ టేకర్స్‌లను తొలగించడం అన్యా యమని, వెంటనే విధులలోకి తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హాసేన్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి రాసిన లేఖ పత్రులను శుక్రవారం పత్రికలకు విడుదల చేశారు. కొన్ని సంవత్సరాల నుంచి నడుస్తున్న స్టాండర్డ్ గురుకుల కళా శాల లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ గురుకులాలలో పని చేస్తున్న వార్డెన్స్, అసిస్టెంట్ కేర్ టేకర్స్, 240 మంది ఉద్యోగాలను నిర్ధాక్షణంగా తొలగించడం జరిగిందని, వీళ్ళందరూ 10 సంవత్సరాల బోధన అనుభవం, పోస్ట్ గ్రాడ్యుయేషన్ బి.ఎడ్ అర్హత ఉన్నవారు. వారిని ఇంటర్వ్యూ నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన తీసుకున్నారని, పది సంవత్స రాల అనుభవం ఉండి, ఈ ఉద్యోగం మీదనే వారి కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారని, ఈ ఉద్యోగం లేకపోతే వారు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలు మొత్తం రోడ్డుమీద పడే అవకాశం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

## లాసెట్-2025 పరీక్షకు 79 శాతం మంది హాజరు

### 10న ప్రాథమిక కీ విడుదల

**హైదరాబాద్ జూన్ 6. ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో యుజి, పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం శుక్రవారం నిర్వహించిన లాసెట్-2025, పిజి లాసెట్-2025 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకి 79.02 శాతం మంది హాజరైనట్టు లాసెట్-2025, పిజి లాసెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ బి విజయలక్ష్మి తెలిపారు. పరీక్షకి 57,715 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 45,609 మంది హాజరయ్యారు. మూడు సెషన్‌లలో పరీక్షను నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు మూడు సంవత్సరాల లా కోర్సులో ప్రవేశ పరీక్షను నిర్వహించగా.. దరఖాస్తు చేసుకున్న 20,719 మందిలో 16,109 మంది(77.75శాతం) పరీక్షలకు హాజరయ్యారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు 5 వరకు నిర్వహించిన పరీక్షకు 20,491 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 16,009 మంది(78.13 శాతం) మంది హాజరయ్యారు. 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ లా కోరుతోపాటు పిజి లా కోర్సులో ప్రవేశాల పరీక్షను సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించగా.. ఇందుకు 16,505 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 13,491 మంది(81.74 శాతం) హాజరయ్యారు. ఉదయం పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 76 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. సాయంత్రం సెషన్‌కి 65 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తంగా లాసెట్, పిజి లాసెట్‌కి 57,715 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 45,609 మంది(79.02 శాతం) పరీక్షలకి హాజరయ్యారు. పరీక్షలకి సంబంధించిన ప్రాథమిక కీని ఈ నెల 10న విడుదల చేయనున్నట్టు కన్వీనర్ తెలిపారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలను ఈ నెల 14 వరకు స్వీకరించనున్నట్టు ప్రకటించారు.

## మాజీ సర్పంచ్‌ల అరెస్టును ఖండిస్తున్నాం

### జెఎసి అధ్యక్షుడు సర్వి యాదయ్యగౌడ్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగిన మాజీ సర్పంచ్‌ల అరెస్టులను ఖండిస్తున్నట్లు మాజీ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించకుండా కక్ష సాధింపు చర్యకు పాల్పడుతూ రాజకీయాలు చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి ఏ జిల్లాకు పర్యటన చేస్తే జిల్లాకు సంబంధించిన ప్రశ్నించే గొంతికలను అర్ధరాత్రి ఇళ్ల ముందట పోలీసులను పెట్టి అరెస్టు చేపియ్యడం సిగ్గుమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ ప్రజా పాలనలో అరెస్టులు నిర్బంధాలు నా పరిపాలనంటే గ్రామా అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సంబంధించిన సర్పంచులు అడుగుతే అర్ధరాత్రి పోలీసులను పెట్టి అరెస్ట్ చేయించడమేనా మీ ప్రజాపాలన అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని చెప్పి శంకుస్థాపనలు చేయడం ఏందో అర్థం కావడం లేదన్నారు.మా పెండింగ్ బిల్లులు చెల్లించమని 17 నెలలుగా ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇస్తూ గాంధీ మార్గంలో మార్గంలో నిరసనలు తెలుపుతూ మొత్తుకున్నా కనికరం లేని రాక్షస పాలన మాకు వద్దు అన్నారు.రేవంత్ రెడ్డి ప్రాజాపాలనకు ప్రజలు వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారాని ఆయన హెచ్చరించారు. ఈ ప్రభుత్వం ప్రజల్ని దృష్టి మళ్లిం చాలనే కాళేశ్వరం కమిషన్ పేరుతో ప్రతిపక్ష నేతలకు నోటీసులు ఇస్తోందని ఆయన ఆరోపించారు. కక్షపూరిత రాజకీయాలతో ప్రభుత్వం నడిపిస్తున్నారనే అంశాన్ని ప్రజలు గ్రహిస్తున్నారనే అంశాన్ని గుర్తుపెట్టుకో వాలన్నారు. మీరు ప్రజా పాలన మీద దృష్టి పెట్టి మీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# 'హరి హర వీర మల్లు' కాస్త ఆలస్యం..

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాలలో హరి హర వీర మల్లు ఒకటి. ఈ చిత్ర విడుదల గురించి జరుగుతున్న ప్రచారాలు, పెరుగుతున్న ఊహాగానాలు నేపథ్యంలో నిర్మాతలు అధికారిక ప్రకటన విడుదల చేశారు. అచంచలమైన ఓపిక మరియు నమ్మకంతో హరి హర వీరమల్లు సినిమాకు తోడుగా నిలిచిన అభిమా నులు, శ్రేయోభిలాషులు మరియు సినీ ప్రేమికులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. గతంలో ప్రకటించిన జూన్ 12వ తేదీకి చిత్రాన్ని మీ ముందుకు తీసుకురావడానికి అవిశ్రాంత ప్రయత్నాలు చేస్తున్నాము. అయినప్పటికీ ఆ తేదీకి చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకు రాలేకపోతున్నామని తెలియజేస్తున్నాము. కష్టమైనయిన ప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ యొక్క ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మరింత గొప్పగా మలచాలనేదే మా ప్రయత్నం. ప్రతి ఫ్రేమ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అద్భుతమైన చిత్రంగా మలిచే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాము. అందుకే మేము మరికొంత సమయం తీసుకుంటున్నాము. మీ ఎదురు చూపులకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాము. మరోవైపు, సామాజిక మాధ్యమాల్లో హరి హర వీరమల్లు చిత్రం గురించి తప్పుడు వార్తలు ప్రచారమవ్వడం మేము గమనించాము. చాలామంది తమకు తోచినది రాసేస్తున్నారు. ధృవీకరించని వార్తలను నమ్మవద్దని, వాటిని వ్యాప్తి చేయవద్దని మేము ప్రతి ఒక్కరినీ కోరుతున్నాము. దయచేసి మా అధికారిక హ్యాండిల్స్ ద్వారా మాత్రమే సినిమాకి సంబంధించిన అప్డేట్ల కోసం వేచి ఉండండి. అప్పటి వరకు,



ఎటువంటి ప్రచారాలను నిజమని భావించకండి.హరి హర వీరమల్లు చిత్రం ఒక అద్భుతమైన ప్రయాణం. వందలాది మంది కళాకారులు, సాంకేతిక నిపుణులు కలిసి వెండితెర పై అద్భుతాన్ని సృష్టించడానికి 24 గంటలూ తమ శక్తికి మించి కృషి చేస్తున్నారు. ఈ ఆలస్యం మన సహనాన్ని పరీక్షించవచ్చు. కానీ, అంత కంటే గొప్పది ఏదో రూపుదిద్దుకుంటుందని కూడా ఇది సూచిస్తుంది. ప్రతి దృశ్యం ఆశ్చర్యపరిచేలా, ప్రతి శబ్దం ప్రతిధ్వనించేలా, ప్రతి సన్నివేశం ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేయాలనే లక్ష్యంతో చిత్ర బృందం నిర్మాణాంతర కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. హరి హర వీరమల్లు యొక్క భారీ మరియు శక్తివంతమైన థియేట్రికల్ ట్రైలర్ త్వరలో విడుదల కానుందని తెలియజేయడానికి మేము చాలా సంతోషిస్తున్నాము. ట్రైలర్‌తో పాటు, కొత్త విడుదల తేదీని కూడా తెలియజేస్తాము. కాబట్టి భారీ ప్రకటన కోసం వేచి ఉండండి. సినిమాపై రోజు రోజుకి అంచనాలు పెరిగి పోతున్నాయి. అద్భుతమైన ట్రైలర్‌ను మీతో పంచుకోవడానికి మేము ఆసక్తిగా ఎదురు చూస్తున్నాము. అద్భుతాన్ని చూడటానికి సిద్ధంగా ఉండండి. ఈ చిత్రానికి ఎ.ఎం. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

# ఈ నెలలోనే 'మోగ్లీ 2025' టీజర్

తన తొలి చిత్రం బబుల్ గమ్‌లో తన అద్భుతమైన నటనతో అలరించిన యంగ్ హీరో రోషన్ కనకాల ప్రస్తుతం మోగ్లీ 2025లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి నేషనల్ అవార్డ్ విన్నింగ్ కలర్ ఫోటో డైరెక్టర్ సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై విజనరీ ప్రొడ్యూసర్ టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ మారేడుమిల్లిలో బిగ్ క్లైమాక్స్ యాక్షన్ షెడ్యూల్ పూర్తి చేశారు. 15 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్ లో మ్యాసీవ్ యాక్షన్ సీక్వెన్స్‌లని షూట్ చేశారు. ఈ క్లైమాక్స్ సీక్వెన్స్‌లో రోషన్ కనకాల చాలా రిస్క్ తీసుకుని యాక్షన్ స్టంట్స్‌ని పెర్ఫార్మ్ చేశారు. ఈ సీన్స్ సినిమాలో మేజర్ హైలెట్‌గా వుండబోతున్నాయి. మారేడు మిల్లిలో మూడో షెడ్యూల్ పూర్తి చేశారు. ఇంకొక్క షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ఈ నెలలోనే టీజర్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమాలో విజువల్స్, యాక్షన్ హైలెట్‌గా ఉండబోతున్నాయి. ఈ సినిమాలో మ్యూజిక్‌కి చాలా ఇంపార్టెన్స్ ఉంది. మోగ్లీ ఆల్బమ్, బ్యాగ్రౌండ్ స్కోర్ అవుట్ స్టాండింగ్‌గా ఉండబోతుంది. ఆడియన్స్‌కి చాలా కొత్త ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా గ్లింప్స్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ గ్లింప్స్ రోషన్‌ను హైఆక్టేన్ యాక్షన్ అవతార్‌లో ప్రజెంట్ చేసింది. ఈ చిత్రంతో సాక్షిసాగర్ మడోల్కర్ హీరోయిన్‌గా ఆరంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. కాల భైరవ సంగీతం అందిస్తున్నారు. కోదాటి పవన్ కళ్యాణ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కిరణ్ మామిడి ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌ను పర్యవేక్షిస్తుండగా, నటరాజ్ మాదిగొండ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రాఫర్ చేస్తున్నారు. స్క్రీన్‌ప్లేను రామ మారుతి ఎం, రాధాకృష్ణ రెడ్డి రాశారు. ప్రతిభావంతులైన తారాగణం, టెక్నికల్ టీంతో రూపొందుతున్న మోగ్లీ 2025 సినీ ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. మోగ్లీ 2025 ఈ సంవత్సరం చివర్లో విడుదల కానుంది. తారాగణం: రోషన్ కనకాల, సాక్షిసాగర్ మడోల్కర్, బండి సరోజ్ కుమార్, సాంకేతిక సిబ్బంది:రచన, దర్శకత్వం: సందీప్ రాజ్,నిర్మాతలు: టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్,బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంగీతం: కాలభైరవ,డిఓపి: రామ మారుతి ఎం ఎడిటర్: కోదాటి పవన్ కళ్యాణ్, ఆర్ట్: కిరణ్ మామిడి, యాక్షన్: నటరాజ్ మాడిగొండ సహ రచయితలు: రామ మారుతి. ఎం రాధా కృష్ణ రెడ్డి పీఆర్వో: వంశీ శేఖర్.



# ప్రేక్షకులను థియేటర్లకు ఎలా రప్పించాలన్నదే ముఖ్యం

ఎగ్జిబిటర్స్, ప్రొడ్యూసర్స్ గ్రహించవలసింది, కరెక్ట్ చేసుకోవాల్సింది పర్సంటేజ్ సిస్టం కాదు.. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించడం ఎలా అని..! ఇప్పుడున్న అర్ధ రూపాయి వ్యాపారంలో నీది పావుల.. నాది పావలా అని కొట్టుకోవడం కాదు.. మునపటిలా మన వ్యాపారాన్ని రూపాయికి ఎలా తీసుకెళ్లాలి అనేది ఆలోచించాలి తప్ప.. ఇలాగ సినిమా విడుదలైన 28 రోజుల్లోపే ఓటిటికి ఇవ్వాలి అనే ట్రెండ్ కొనసాగితే .. రాబోయే నాలుగైదు ఏళ్లలో 90 శాతం సింగిల్ స్క్రీన్స్ మూసుకుపోతాయి. ఈ విషయం పెద్ద హీరోలు కూడా ఆలోచించాలి. మీరు రెండు సంవత్సరాలకు ఒక సినిమా మూడు సంవత్సరాలకు ఒక సినిమా చేస్తూ పోతే థియేటర్ల నుంచి ప్రేక్షకులు కూడా దూరమైపోతారు. ఈరెండు మూడేళ్లలో చాలా మంది థియేటర్ ఓనర్స్ వాటిని మెయింటైన్ చేయలేక మూసేస్తారు. సింగిల్ స్క్రీన్స్ మూత పడిన ట్టైతే ఓన్లీ మల్టీప్లెక్స్ థియేటర్స్ అయితే పెద్ద హీరోలందరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే మీ సినిమా థియేటర్స్ ద్వారావచ్చే ఆదాయం కేవలం 43 మాత్రమే నిర్మాతలకు వెళుతుంది.



నిర్మాత బన్నీ వాసు

# నాగార్జున ఇంట పెళ్లి బాజాలు

టాలీవుడ్‌కి చెందిన ప్రముఖ కుటుంబాల్లో అక్కినేని కుటుంబం కూడా ఒకటి. మరి అక్కినేని కుటుంబంలో కింగ్ నాగార్జున వారసుడు అఖిల్ అక్కినేని పెళ్లిపై గత కొన్ని రోజులు నుంచి వినిపిస్తున్న వార్తల కోసం అందరికీ తెలిసిందే.అయితే ఈ పెళ్లి ఎట్టకేలకు అట్టహాసంగా ఈ జూన్ 6 తెల్లవారు జామున 3 గంటలకి జరిగింది. నూతన వధూవరులు అఖిల్ ఇంకా జైనాబ్‌లు వేద మంత్రాలు సాక్షిగా పెళ్లి బంధంతో ఒకటయ్యారు. అక్కినేని నాగార్జున స్వగృహంలోనే ఈ పెళ్లి గ్రాండ్‌గా జరగడం విశేషం. మరి మెగాస్టార్ చిరంజీవి ఇంకా తన వారసుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ దంపతులు ఇంకా పలువురు రాజకీయనాయకులు సహా బిజినెస్ మ్యాగ్నెట్ పలువురు కూడా హాజరయ్యి కొత్త జంటకి తమ ఆశీస్సులుఅందించారు. ఈఆదివారం గ్రాండ్‌గా రిసెప్షన్‌ని ప్లాన్ చేయగా దీనికి మరింతమంది ముఖ్య అతిథులు హాజరు కానున్నారట.



# 'వనం' టీజర్ లాంచ్

వృక్షో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. ఇలాంటి మంచి సందేశాన్నిస్తూ వనాలను సంరక్షించుకోవాలనే నేపథ్యంతో పూర్తి తెలంగాణ పల్లెటూరి బ్యాక్ డ్రాప్‌లో చిత్రీకరించిన అరుదైన సినిమా కలివి వనం. ఈ చిత్రంలో రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, బిత్తిరి సత్తి, బలగం సత్య నారాయణ, మహేంద్ర నాథ్, సతీష్ శ్రీ చరణ్, అశోక్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. హీరోయిన్‌గా నాగదుర్గ పరిచయమవుతోంది. కలివి వనం సినిమాను ఏఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్ నరేంద్ర రచనా దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిలు నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న చిత్ర టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు.. ఈ కార్యక్రమానికి మీడియా మిత్రులు జర్నలిస్ట్ టీ.యఫ్.జె.ఏ. ప్రెసిడెంట్ లక్ష్మి నారాయణ,జర్నలిస్ట్ టీ.యఫ్.జె.ఏ. వైస్ ప్రెసిడెంట్ వై.జె రాంబాబు, గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డు జ్యూరీ మెంబెర్ లక్ష్మి నారాయణ, సినీజోష్ సీఈఓ రాంబాబు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాఘవ, దుప్పుర్ల సత్యనారాయణల చేతుల మీదుగా చిత్ర టీజర్‌ను గ్రాండ్‌గా విడుదల చేశారు. అనంతరం దుప్పుర్ల సత్యనారాయణ మాట్లాడుతూ, పంచభూతాల్లాగే చెట్టు కూడా ప్రకృతి మాత. పంచభూతాలతో పాట ఆ చెట్టు తల్లి ఆశీస్సులు ఈ చిత్రానికి ఉండాలి. వనాలు బాగుంటే జనాలు బాగుంటారు. నాకు కూడా చెట్లంటే ఇష్టం. అభివృద్ధి పేరుతో చెట్లను నరకడం అన్యాయం. కలివి వనం చిత్రంతో పర్యావరణం గురించి మంచి సందేశం ఇచ్చారు. ఈ సినిమా మన సమాజానికి ఒక మార్గం వేయాలి, పర్యావరణ రక్షణ గురించి మన ప్రజల్లో ఆలోచన రేకెత్తించాలి అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ మదీన్ ఎస్.కె మాట్లాడుతూ, నేను ఈ చిత్రానికి మ్యూజిక్ చేయగలను అని నమ్మి అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ రాజ్ అన్నకు, ప్రొడ్యూసర్స్ మల్లికార్జున్, విష్ణువర్ధన్ రెడ్డికి థ్యాంక్స్. నేను ఎక్కువగా మాట్లాడకున్నా, నేను కంపోజ్ చేసిన టీజర్ మాట్లాడుతుంది. ఈసినిమాకు మంచి మ్యూజిక్ ఇచ్చేందుకు నా వంతు ప్రయత్నం చేశానని భావిస్తున్నా. నేను రిక్వెస్ట్ చేయగానే పాట రాసిన కాసర్ల శ్యామ్‌అన్నకు థ్యాంక్స్ అన్నారు. నటుడు బలగం సత్యనారాయణ మాట్లాడుతూ, సామాజిక స్పృహతో చేసిన సినిమా కలివి వనం. బలగం చిత్రంతో నాకు ఎంత పేరొచ్చిందో ఈ చిత్రానికి కూడా అలాంటి గుర్తింపే వస్తుందని ఆశిస్తున్నా. నటుడు సతీష్ కుమార్ మాట్లాడుతూ, అందరికీ వరల్డ్ ఎన్విరాన్ మెంట్ డే శుభాకాంక్షలు. మన పర్యావరణాన్ని మనం కాపాడుకుం దామనే మంచి కాన్సెప్ట్‌తో కలివి వనం సినిమాను డైరెక్టర్ రాజ్ రూపొందించారు. ఈ టీమ్‌తో నాకు సుదీర్ఘ అనుబంధం ఉంది. ఈ చిత్రంలో నేనొక ఇంపా ర్టెంట్ రోల్ ప్లే చేశాను. ఈ చిత్రంతో ప్రేక్షకుల రివార్డ్స్‌తో పాటు అవార్డ్స్ దక్కాలి.



# 'మిత్ర మండలి' ఫస్ట్ లుక్

బన్నీ వాస్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న నూతన చిత్రం నుంచి ఇటీవల విడుదలైన ప్రీ లుక్‌కి విశేష స్పందన లభించిన సంగతి తెలిసిందే. ముసుగు అవతారాలలో ఉన్న నటులు ఎవరో తెలుసుకోవాలనే ఆసక్తి అందరిలో కలిగింది. దీని గురించి సామాజికమాధ్యమాల్లో కూడా తెగ చర్చ జరిగింది. తాజాగా ఈ చిత్రం నుంచి టైటిల్‌తో కూడిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు నిర్మాతలు.ఈ చిత్రానికి మిత్ర మండలి అనే ఆసక్తికర టైటిల్ ను ఖరారు చేశారు. టైటిల్‌తో పాటు, అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా విడుదలైంది. ఫస్ట్ లుక్ అందరి అంచనాలను అందుకునేలా కట్టిపడేసేలా ఉంది. ఈ పోస్టర్ నీలిరంగు ముసుగుల వెనుక ఉన్న గ్యాంగ్ ను పరిచయం చేసింది. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అపరిమిత వినోదాన్ని అందించడానికి ఈ గ్యాంగ్ సిద్ధమవుతోంది. సోషల్ మీడియా సంచలనం నిహారిక ఎన్.ఎం. మిత్ర మండలి చిత్రంతో తెలుగులోకి అరంగేట్రం చేస్తుండటం విశేషం. సోషల్ మీడియా ద్వారా వివిధ భాషల ప్రేక్షకులకు చేరువైన నిహారిక.. ఇటీవల మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకనింగ్ కోసం టామ్ క్రూజ్‌తో కలిసి పనిచేసి వార్తల్లో నిలిచారు. అద్భుతమైన నటన, కామిక్ టైమింగ్, భిన్నమైన పాత్రల ఎంపికతో ప్రియదర్శి తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయనకు మ్యాడ్ ఫేమ్ విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా వంటి ప్రతిభగల నటులు తోడయ్యారు. ఈ నలుగురు కలిసి మిత్ర మండలితో అద్భుతమైన వినోదాన్ని అందిస్తారు అనడంలో సందేహం లేదు. బన్నీ వాస్ తాను నూతనంగా ప్రారంభించిన బి.వి. వర్క్స్ పతాకంపై మిత్ర మండలి చిత్రాన్ని సమర్పిస్తున్నారు.





ఈషా రెబ్బా న్యూ లుక్

# 'బ్యాచిలర్స్ ప్రేమకథలు' ప్రారంభం

యస్.యం. 4 ఫిలిమ్స్ బ్యానర్ పై గీత సింగ్, కార్తీక్, కాశీ మదన్, ఇషాని, చలానా అగ్నిహోత్రి, శృతి లయ నటీనటులుగా యం.యన్. వి సాగర్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న చిత్రం బ్యాచిలర్స్ ప్రేమ కథలు. ఈ చిత్రం పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో ఘనంగా జరుపుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ప్రముఖ దర్శకులు వి. సముద్ర కెమెరా స్విచ్చాన్ చేయగా, ప్రముఖ దర్శకులు వీర శంకర్ క్లాప్ ఇచ్చారు. అనంతరం చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చిత్ర దర్శక, నిర్మాత, సాగర్ మాట్లాడుతూ, ఇంతకుముందు నేను తీసిన కాలం రాసిన కథలు సినిమాకు ప్రేక్షకులనుండి మంచి రెస్పాన్స్ వచ్చింది.ఆ ఉత్సాహంతో దానికి సీక్వెల్‌గా బ్యాచిలర్స్ ప్రేమ కథలు సినిమా తీస్తున్నాను ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు మంచి షోషల్ మెసేజ్ ఇవ్వబోతున్నాను.అలాగే ఇందులో కూడా నూతన నటీనటులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాను. ఈ నెలలో షూటింగ్ స్టార్ట్ చేసుకుంటున్న ఈ సినిమాను త్వరలో షూటింగ్ పూర్తి చేసుకొని 2025 లోనే విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. నటి గీతా సింగ్ మాట్లాడుతూ, అడియన్స్ అందరూ నా పాత్రకు కామెడీ ఎక్స్పెక్ట్ చేస్తారు. కానీ అందుకు భిన్నంగా ఈ సినిమాలో ఎమోషనల్ పాత్ర చేయబోతున్నాను. ఈ సినిమా ద్వారా సెకండ్ ఇన్నింగ్ స్టార్ట్ చేసే అవకాశం కల్పించిన దర్శక, నిర్మాత సాగర్‌కి నా ధన్యవాదాలు అన్నారు.నటుడు కార్తీక్ మాట్లాడుతూ, యూత్ మెచ్చే మంచి మెసేజ్ ఉన్న ఇలాంటి సినిమా ద్వారా ఇండస్ట్రీకు పరిచయం చేస్తున్న సాగర్‌కి నా ధన్యవాదాలు. నటుడు కాశీ మదన్ మాట్లాడుతూ, ఇప్పటివరకు బ్యాచులర్స్ పై వచ్చిన సినిమాలన్నీ మంచి హిట్ అయ్యాయి. ఇప్పుడు అదే కోవలో వస్తున్న బ్యాచిలర్స్ ప్రేమకథలు సినిమాను కూడా ప్రేక్షకులందరూ ఆదరించి ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. డి ఓ పి. ప్రసాద్ ఎస్ మాట్లాడుతూ, ఇలాంటి



మంచి కాన్సెప్ట్ ఉన్న సినిమాలు యూత్‌ని ఆకట్టుకుంటాయి. నటి ఇషాని మాట్లాడుతూ, బెంగళూరులో మోడలింగ్ చేస్తూ సినిమాలో నటించాలని హంటింగ్‌చేస్తున్న నాకు యస్.యం. 4 ఫిలిమ్స్ బ్యానర్‌లో వస్తున్న బ్యాచిలర్స్ ప్రేమ కథలు సినిమాలో నటించే అవకాశం కల్పించిన దర్శక, నిర్మాత సాగర్‌కి నా ధన్యవాదాలు. నటి శృతి లయ మాట్లాడుతూ, ఈ స్టోరీ విన్నప్పుడు చాలా ఎక్సైట్‌గా ఫీల్ అయ్యాను మంచి సోషల్ మెసేజ్ ఇస్తున్న ఇలాంటి సినిమాలో నటించే అవకాశం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు.

# బాలీవుడ్ సినిమాలో 'రష్మిక'కు మళ్లీ ఛాన్స్

ప్రస్తుతం స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న జెట్ స్పీడ్‌లో దూసుకెళుతోంది. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ వరుసగా క్రేజీ ఆఫర్లు అందుకుంటోంది అందాల తార. ముఖ్యంగా బాలీవుడ్‌లో ఈ బ్యూటీకి వరుసగా సినిమా ఛాన్సులు వస్తున్నాయి. ఇటీవల సల్మాన్ ఖాన్‌తో కలిసి సికందర్ సినిమాలో నటించింది రష్మిక. రంజాన్ సందర్భంగా విడుదలైన ఈ సినిమా పెద్దగా ఆడలేదు. అయితే ఒక ఫ్లాప్ సినిమా వచ్చినప్పటికీ, రష్మికకు ఇప్పుడు మరో మంచి బాలీవుడ్ సినిమా అవకాశం వచ్చింది. 2012లో విడుదలైన కాక్‌టెయిల్ సూపర్ హిట్‌గా నిలిచింది. సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొనే, దయానా పెంటీ నటించిన ఈ మల్టీ స్టారర్ మూవీ హిందీ ఆడియెన్స్‌ను బాగా అలరించింది. ఒక మోడ్రన్ అమ్మాయి, ఒక ట్రెడిషినల్ లేడీ, ప్లేబాయ్ లాంటి అబ్బాయి మధ్య జరిగే ముక్కోణపు ప్రేమకథగా ఈ మూవీ తెరకెక్కింది. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్‌గా కాక్‌టెయిల్ 2 నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రష్మికకు హీరోయిన్ పాత్ర ఇచ్చారు. కాక్‌టెయిల్ 2 చిత్రానికి లవ్ రంజన్ దర్శకత్వం వహిస్తుండగా, మ్యాడ్‌లాక్ విజయన్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.కాక్‌టెయిల్ లాగే, కాక్‌టెయిల్ 2 కూడా ముక్కోణపు ప్రేమ కథగా తెరకెక్కనుంది. ఇందులో రష్మిక మందన్న ఒక కీలక పాత్రలో నటించనుంది. అలాగే కృతి సనన్ కూడా సెకెండ్ ఫిమేల్ లీడ్‌గా యాక్ట్ చేస్తోంది. షాహిద్ కపూర్ ప్లే బాయ్ పాత్రలో కనిపించనున్నాడని సమాచారం.



# జీన్స్‌తో నిద్ర వద్దు !



ఎరుపెక్కడం.. వంటి సమస్యలొస్తాయి. కాబట్టి సాధ్యమైనంత తక్కువ సమయం జీన్స్ ధరించేలా చూసుకోవ డం మంచిదంటున్నారు నిపుణులు. ముఖ్యంగా కాలంతో సంబంధం లేకుండా చెమట ఎక్కువగా వచ్చేవారు ఈ విషయంలో మరింత అలర్ట్‌గా ఉండడం మంచి దంటున్నారు.

సందర్భం ఏదైనా.. కొంతమంది జీన్స్‌లోనే సౌకర్యంగా ఫీలవుతారు. అయినా ఇంటికొచ్చాక ఈ దుస్తులు మార్చుకొని వదులుగా, సౌకర్యవంతంగా ఉండే నైట్‌వేర్ ధరిస్తుంటాం. కానీ ఒక్కోసారి అనుకోకుండా స్నేహితుల ఇంటికి వెళ్లినా లేదంటే ప్రయాణాల్లో.. అదే జీన్స్‌లో నిద్రపోవాల్సి రావచ్చు. దీనివల్ల అసౌకర్యమే కాదు. ఆరోగ్యపరంగానూ కొన్ని సమస్యలు తప్పవంటు న్నారు నిపుణులు. ముఖ్యంగా ప్రత్యుత్పత్తి వ్యవస్థపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం..

**అందుకే ఫంగల్ ఇన్ఫెక్షన్లు !** జీన్స్ .. డెనిమ్ ఫ్యాబ్రిక్‌తో తయారవుతుంది. త్వరగా చెమటను పీల్చుకునే స్వభావం ఈ మెటీరియల్‌కు ఉండదు. అందులోనూ స్కిన్ టైట్ జీన్స్ అయితే ఇక చెప్పే పనే లేదు. ఫలితంగా జననేంద్రియాల వద్ద చెమట అలాగే ఉండిపోతుంది. ఈ తేమతోనే గంటల తరబడి ఉండిపోవడం వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. ఇది క్రమంగా ప్రత్యుత్పత్తి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలాగే బిగుతైన దుస్తుల వల్ల ఆయా శరీర భాగాలకు గాలి ప్రసరణ సరిగ్గా జరగక.. అక్కడి చర్మంపై దురద, దద్దుర్లు,

**నిద్రకు అంతరాయం !** సాధారణంగా నిద్రలోకి జారుకున్న కొన్ని గంటలకు శరీర ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతూ వస్తుంది. అయితే జీన్స్ ధరించి నిద్రపోయినప్పుడు గాలి ప్రసరణ సరిగ్గా జరగక శరీర ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. తద్వారా నిద్రకు అంత రాయం ఏర్పడుతుందని ఓ అధ్యయనంలో తేలింది. అంతేకాదు. జీన్స్ వంటి బిగుతైన దుస్తులు ధరించి పడుకోవడం వల్ల అసౌకర్యంగానూ అనిపిస్తుంటుంది. ఇది కూడా సుఖనిద్రను దూరం చేస్తుందని చెబుతున్నారు నిపుణులు.

**నెలసరి నొప్పి తీవ్రంగా...** జీన్స్ వంటి బిగుతైన దుస్తులు ధరించి నిద్ర పోవడం వల్ల గర్భాశయం, పొత్తి కడుపు, జననేంద్రియాలపై ఒత్తిడి పడుతుంది. అలాగే ఆయా భాగాలకు రక్తప్రసరణ కూడా సాఫీగా సాగదు. వీటన్నింటి మూలంగా నెలసరి సమయంలో నొప్పి మరింత తీవ్రమవుతుంది. మరోవైపు ఇలాంటి బిగుతైన దుస్తుల వల్ల నడుంనొప్పి, కడుపుబ్బరం, వంటి సమస్యలు వచ్చే అవకాశాలూ ఎక్కువంటున్నారు నిపుణులు. కాబట్టి పడుకునేటప్పుడైనా, ఇతర సమయాల్లో అయినా సాధ్యమైనంత వరకు వదులుగా ఉండే కాటన్ దుస్తులకు ప్రాధాన్యమివ్వడం మంచిది. □

# భావితరాలకు ఆదర్శం ప్రవక్తల జీవితం

**నేడు బక్రీద్. ముస్లింలు ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే రెండు పండగల్లో రెండవది బక్రీద్. మక్కాలో శనివారం బక్రీద్ పండగ సందర్భంగా ఈదుల్ అజ్‌హా ప్రార్థనల్ని కోట్లాది మంది భక్తులు ఆచరించనున్నారు. భారత దేశంలో నేడు జరుపుకోనున్నారు .**

ప్రపంచంలోని ముస్లింలు నమాజు ఆచరించి వెళ్ళి ఖుర్‌బానీ ఇవ్వాల్సి ఉంటుంది కాబట్టి ఉదయం 9గంటల లోపల అన్ని ఈద్‌గాహ్‌లలో నమాజులు పూర్తి చేయుటకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఖుర్బానీ ప్రాధాన్యత: ముస్లిం సోదరులు ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండగల్లో రెండు ప్రధానమైనవి. ఇందులో 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించి జరుపుకు పండగను రంజాన్ అంటారు. ఇస్లాం మత వ్యాప్తి కోసం దేవుని ఆజ్ఞ కోసం తన కన్నబిడ్డను సైతం తన చేతులతో బలి (ఖుర్బానీ) ఇచ్చిన రోజూ బక్రీద్ అంటారు. మానవుడు ఆచరించాల్సి న నాలుగు ధర్మాలను పవిత్ర రంజాన్ మాసంలో ఆచరించగా ఐదవది అయిన హాజ్ సందర్శనం బక్రీద్‌లో ఆచరిస్తారు. 'బక్రీ' అంటే మేక అని ఈద్ అంటే 'పండగ' అని అర్థం. బక్రీద్ అంటే దైవాజ్ఞను పాటించే భక్తులు దేనైనా సమర్పిస్తారు (ఖుర్బానీ )అనటానికి నిదర్శనంగా చెప్పవచ్చు. మానవుని సృష్టించిన అల్లాహ్ ప్రపంచంలో అన్ని విధాల సదుపాయాల్ని కల్పించి వాటిని అనుభవిస్తూ తనను ధ్యానం చేయమని ఆదేశించాడు. ఈ ఆదేశాలను ఆచరించిన ప్రవక్తల జీవితాలను భావితరాలకు అందించేందుకు పవిత్ర ఖుర్ ఆన్‌లో పలు సంఘటనలను పొందుపరచారు. అలాగే హదీసుల్లో వివరించారు. బక్రీద్ ప్రాధాన్యతకు సంబంధించి ఖురాన్‌లోని అల్ తౌబా 24లో పేర్కొన్నారు. ఇబ్రహీం సొలైఅలా అలాహోసొల్లాం భగవంతుని ఆజ్ఞతో తన కన్న బిడ్డను బలి ఇవ్వటం గమనిస్తే 'త్యాగనిరతి'కి నిదర్శనంగా చెప్పవచ్చు, ఈ పండగ సందర్భంగా జరిపే ప్రార్థనలను 'ఈదుల్ ఆజహ్' అని చెబుతారు. పండగలంటే కొత్త బట్టలు ధరించటం, సంతోషంగా గడపడమే కాదు. అన్ని జన్మల్లో కెల్లా అత్యుత్తమమైన మానవ జన్మను ప్రసాదించిన భగవంతునికి కృతజ్ఞతలు తెల్పుకుంటూ, భక్తి ప్రవత్తులతో ఆయన సన్నిధిలో సామూహికంగా మోకరిల్లి తమ జీవితాలను సన్మార్గంలో నడుపుటకు ప్రార్థిస్తూ పునరంకితం చేసుకోవటం అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలోనే పవిత్ర స్థలమైన 'మక్కాలో' హాజ్ జరపటం అని చెప్పవచ్చు. బక్రీద్ ప్రాధాన్యత ఏమిటి- బిడ్డను బలిఇచ్చిన వైనం ఏమిటి? బక్రీద్ అంటే మేకను బలి ఇవ్వటం అని చెబుతారు. అయితే ఈ సంఘటన వెనుక సంఘటనలు ఏమిటని పరిశీలిస్తే భగవంతుని ఆజ్ఞ కోసం కన్నబిడ్డలను కూడా నిర్దాక్షిణ్యంగా బలి ఇచ్చే ప్రవక్తలున్నారా? అనే కథనం సాక్ష్యంగా ఉంది. ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం ఖలీలుల్లా భగవంతుని మార్గంలో నడుస్తుండే వారు. అయితే వారి తాత తండ్రులు విగ్రహారాధన చేసే వారు. కానీ ఇబ్రహీం మాత్రం విగ్రహారాధన కూడదనే వారు. భగవంతుడు బావి తరాలకు తమ భక్తుల చరిత్రలు చాటిచెప్ప టానికి ఎన్నో పరీక్షలు చేసే వారు. అలాంటి పరీక్షల్లో ఇబ్రహీం ఖలీలుల్లా కూడా ఒకరై ఇస్లాం చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. ఇబ్రహీం ఖలీలుల్లాను 'దేవుని మిత్రుడనే' పేరు కూడా ఉంది. ఆతన్ని భగవంతుడు పరీక్షించ దలచారు. 80 సంవత్సరాల వయసు వరకు ఇబ్రహీం ఖలీలుల్లాకు సంతతి లేదు. తరువాత వారి ప్రార్థనలతో రెండవ భార్య హాజీరాకు ఓ మగసంతానం కల్గింది. ఈ బిడ్డకు వారు ఇస్మాయిల్‌జబీ ఉల్లా అని పేరు పెట్టారు. 80 సంవత్సరాల తరువాత మగసంతానం కల్గటంతో ఇబ్రహీం ఖలీలుల్లా వారి భార్యలు సారా సొల్లే అలాహోసొల్లాం, హాజీరాలు ఎంతో ప్రేమానురాగాలతో చూసుకునే వారు. అయితే దేవుడు ఆయన్ను పరీక్షించదలచి దైవదూత జిబ్రాయిల్ ద్వారా ఓ సందేశాన్ని పంపారు. దాని ప్రకారం 80 సంవత్సరాల తరువాత జన్మించిన చిన్నారిని, పురిటిలో ఉన్న భార్య హాజిరాను నేటి జమ్ జమ్ బావి ఉన్న చోట నాడు మనుషులే కాదు. కనీసం పక్షులు కూడా సంచరించని ఎడారిలో కనీసం నీటి చుక్క కంటికి కనబడని ప్రాంతంలో వదలి పెట్టారు. భార్య హాజీరా తనను ఎందుకు ఇక్కడ వదలి పెడుతున్నారని ప్రశ్నించగా ఇది దైవాజ్ఞ అని ఇబ్రహీం ఖలీలుల్లా సమాధానం చెప్పటం గమనించదగ్గ విషయం. ఆమెతో పాటు ఇష్కఇజా(చర్మపు సంచి)లో ఖర్జూరపు కాయలు, కొంత నీటిని మాత్రమే ఉంచారు. ఎడారిలో ఓ పెద్ద కొండ వెనుక వదలి పెట్టారు. ఆయన ఇచ్చిన ఖర్జూరపు కాయలు, నీరు పూర్తికాగా మంచినీటి కోసం ఆమె పరితపించి పడిన అగచాట్లు వర్ణనా తీతం. ఆ చిన్నారి పాలకోసం ఏడుస్తూ నేలమీద కాలు రువ్వగా వచ్చిన నీటి కొలనే నేడు 'జమ్ జమ్' అంటారు. హాజిరా నీటి కోసం ఆహారం కోసం పరితపించిన ప్రాంతాన్నే 'నేడు హాజ్‌కు వెళ్ళు యాత్రికులు' సంచరించే సఫా, మరువా మైదానా లంటారు. ఈ ప్రాంతాల్లో నేడు హాజ్ యాత్రికులు తప్పని సరిగా (ఫర్జ్) సందర్శిస్తారు. దేవుని ఆజ్ఞతో బిడ్డను బలి ఇచ్చిన ప్రవక్తః తరువాత ఇస్మాయిల్‌జబీ ఉల్లాకు నాలుగుసంవత్సరాల వయస్సు వచ్చింది. రోజుల బిడ్డగా ఉన్నపుడే పరీక్షలను ఎదుర్కొన్న ఆయనకు మరో అగ్నిపరీక్ష ఎదురైంది. తన తండ్రి ఇబ్రాహీం ఖలీలుల్లా ఎంతో ప్రేమగా చూసుకునే వారు. భగవంతుడు మరో సారి తన మిత్రుడు అయిన ఇబ్రాహీం ఖలీలుల్లాకు పరీక్ష పెట్టారు. ఆయన కలలో వరుసగా మూడు రోజులు 'నీకు అత్యంత ప్రీతిపాత్రమైన దానినిత్యజించాలని' వచ్చింది. మొదటి రోజు కలకు పరిహారంగా ఒంటెలను ఖుర్బానీ ఇస్తారు. రెండవ రోజూ అలాగే కల వచ్చింది. 60 సురఖ్ (బాగా ఆరోగ్యంగా) ఉన్న ఎరుపు రంగు కల్గిన ఒంటెలను బలిదానం ఇచ్చారు. మూడో రోజు కూడా అలాగే కల వచ్చింది. దాంతో ఖలీలుల్లా ఆలోచనలో పడ్డారు. తనకు ప్రపంచంలో అన్నింటి కన్నా అత్యంత ప్రీతిపాత్రమైనది తన బిడ్డ ఇస్మాయిల్. కాబట్టి దైవాజ్ఞ తన బిడ్డను బలి కోరుతోందని నిర్ణయించుకున్నారు. అయితే కన్నతండ్రి కడుపుతీపి ఆతన్ని కలచి వేస్తున్నా భగవంతుని ఆజ్ఞను పాటించటం తన ధర్మంగా భావించారు. దాంతో తన సతీమణిని ఇస్మాయిల్‌ను తన సే న్నహితుని మిలాఖత్( కలప టానికి) కోసం తీసుకెళుతున్నాను చక్కగా అలంకరించాలని సూచిస్తారు. భర్త మాటను జవదాటని హాజీరా ఇస్మాయిల్‌ను ముస్తాబు చేసారు. అయితే 'సైతాన్' హాజీరాను, ఇస్మాయిల్‌ను పలుమార్లు రెచ్చగొడుతూ ఇ బ్రహీం భగవంతుని ఆజ్ఞతో బలి ఇవ్వటానికి తీసుకెళుతున్నారని భగ్నపరచుటకు ప్రయత్నించినా ఫలించలేదు. ఆ చిన్నారి ఇస్మాయిల్‌ను సైతాన్ నిన్ను మీ తండ్రి భగవంతుని ఆజ్ఞతో బలి ఇవ్వటానికి తీసుకెళుతున్నారన్నపుడు దేవును ఆజ్ఞను పాటించటం కన్నా తనకు ఏం కావాలని ప్రశ్నించటం గమనించదగ్గ విషయం. ఇబ్రహీం చేతిలో తాడు(రోప్) కత్తి కళ్ళ నుంచి నీరు పెల్లుబుతుండగా గుండె నిండా విషాదంతో మైదానంలోకి తీసుకెళ్ళారు. అయితే తండ్రి తనను బలి ఇచ్చే టప్పుడు ఆయన చేతులు వణుతాయని తాను గిల గిల్లాడే సమయంలో ఓర్చుకోలేరు కాబట్టి తండ్రీ!నన్ను బలి ఇచ్చేటప్పుడు మీరు కళ్ళకు గంతలు కట్టుకోండి. నా కాళ్ళు చేతులు కట్టిపడేయండి, నన్ను బోర్లా పడుకోబెట్టండి అని సూచించటం ఆ తండ్రి గుండెల్ని పిండివేసింది. ఆ తండ్రి కొడుకుల త్యాగనిరతి భావితరాలకు మార్గదర్శకంగా మారింది. అయితే బలి ఇచ్చే సమయంలో కత్తి తెగకపోవటం ఇబ్రాహీం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయటం కత్తి నుంచి అశరీర వాణి 'ఇబ్రహీం నేను నీ ఆజ్ఞను పాటించాలా? దేవుని ఆజ్ఞను పాటించాలా? అని' ప్రశ్నించటం సత్యసంధతకు నిదర్శనంగా నిలిచింది. దేవుడు తన మిత్రుని దైవాజ్ఞ పాలనను మెచ్చి జిబ్రాయిల్ ద్వారా స్వర్గం నుంచి ఓ దుంబా( మంచి జాతి పొట్టేలు లాంటిది)ను పంపటం కత్తి దాని మెడమీద తెగటం జరిగింది. దీనినే ఖుర్బానీ అంటారు. ఈ సంఘటనకు నిదర్శనంగా నేడు 'బక్రీద్'పండగను జరుపుకుంటున్నారు.






- ఎస్.రహంతుల్లా,

# వారి అడుగుజాడల్లోనే పిల్లలు

**పిల్లలు అన్ని విషయాలు నేర్చుకునేది తమ తల్లిదండ్రుల నుంచే కదా! అయితే ఆడవారు తమ నైపుణ్యాలతో అందనంత ఎత్తుకు ఎదుగుతోన్న ఈ రోజుల్లోనూ కొన్ని చోట్ల మహిళలను ఎదగనివ్వకుండా చేస్తున్నాయి పలు మూసధోరణులు.** వీటిని బద్దలుకొట్టాలనే విషయాన్ని అమ్మాయిలు ఎదిగే క్రమంలో ఉద్యోగం చేస్తోన్న తమ తల్లుల్ని చూసే నేర్చుకుంటుంటారు. ఉద్యోగం చేసే అమ్మలు. తమ కూతుళ్లపై ఎంతవరకు ప్రభావం చూపుతున్నారు? అనే అంశంపై హార్వర్డ్ యూనివర్శిటీ గతంలో నిర్వహించిన ఒక అధ్యయనంలో సైతం ఈ విషయం నిరూపితమైంది. ఇందులో భాగంగా.. చాలామంది ఉద్యోగినుల కూతుళ్లు ఉన్నత విద్యార్హతలతో, మంచి ఉద్యోగం చేస్తూ, ఎక్కువ సంపాదిస్తున్నట్లు తేలింది. కాబట్టి వర్కింగ్ మదర్స్ ఇలా కెరీర్ విషయంలోనూ తమ కూతుళ్లకు మార్గదర్శకంగా నిలుస్తారన్నమాట!



చీకూ-చింతా లేకుండా పిల్లలతో గడిపే తల్లులే ఎక్కువగా హ్యాపీగా ఉంటారని పలు అధ్యయనాల్లో రుజువైంది. చాలామంది ఉద్యోగినుల్లో అటు ఆఫీసు పనులు, ఇటు ఇంటి పనులు, పిల్లలకు సమయాన్ని కేటాయించడం తప్ప మరే అనవసర ఆలోచనలు మదిలో మెదిలే అవకాశమే ఉండదు. □

**సమయం విలువ తెలుస్తుంది....** ఉద్యోగం చేసే తల్లులకు ప్రతి క్షణం ఎంతో విలువైనది. ఎందుకంటే ఇటు ఇంటి పనులు, అటు ఆఫీసు బాధ్యతలతో పాటు పిల్లల బాధ్యతల చూసుకోవడానికి కూడా సమానంగా సమయం కేటాయించాల్సి ఉంటుంది. ఇందులోనూ వర్కింగ్ మదర్స్ సక్సెస్ సాధించడంతో తమ తల్లుల్ని చూసి వారి పిల్లలకూ క్రమశిక్షణ, సమయ పాలన అలవడతాయి. ఇంట్లో ఉండి అనవసర విషయాలకు ఆందోళన చెందుతూ, తమ ఒత్తిళ్లను, చికాకును పిల్లలపై రుద్దే తల్లుల కంటే ఉద్యోగ బాధ్యతలు నిర్వరిస్తూ, ఎలాంటి

# వెంరువునిచ్చే స్క్రబ్

పెళ్లిల్లో కాబోయే వధువులు షాపింగ్ లూ, స్నేహితులతో పార్టీలూ అంటూ తరచూ బయటే తిరగాల్సి వస్తుంది. దీంతో వివాహ సమయానికి ముఖం కళావిహీనంగా మారుతుంది. ఇలాంటప్పుడు చర్మం పునరుత్తేజం పొందడానికి ఈ సహజ స్క్రబ్‌లు మేలు చేస్తాయి. ఎండ ప్రభావానికి చర్మం నిర్జీవంగా మారిందా? కప్పు అరటిపండు గుజ్జుకి చెంచా చక్కెర కలిపి ముఖానికి రాసి రుద్దండి. ఇలా పది నిమిషాలు చేసి శుభ్రం చేస్తే చాలు. ఇందులో ఉండే విటమిన్ ఎ,బి,ఇ పొటాషియం వంటి పోషకాలు చర్మంపై మృతకణాలను తొలగించి మృదువుగా మారుస్తుంది. రెండు చెంచాల కాఫీ పొడిలో



తీరా

కాస్త తేనె కలిపి ఓ పదినిమి షాల పాటు ముఖాన్ని రుద్దండి. కాఫీ స్కబ్ ముఖంపై ఉన్న మృతకణాలను సులువుగా తొలగిస్తుంది. చర్మాన్ని బిగుతుగా చేసి, ప్రకాశవంతంగా మారు స్తుంది. రెండు టేబుల్ స్పూన్ల ఓట్స్‌లో కాసిని పాలు, తేనె, గులాబీనీళ్ల కలిపి ముఖానికి రాయాలి. మునివేళ్లతో కనీసం పది నిమిషాలైనా రుద్దిచల్లటి నీటితో కడగాలి. ఇలా చేయడంవల్ల మొటిమలు, మచ్చలు తగ్గ చర్మం కాంతి మంతంగా మెరుస్తుంది. . కప్పు కలబందలో రెండు చెంచాల చక్కెర, నిమ్మను కలిపి ముఖానికి స్క్రబ్ చేయాలి. ఇది కంటికింద నల్లటి వలయాలను దూరంచేసి, చర్మాన్ని తేమగా ఉంచుతాయి. □

# హెయిర్ స్ట్రెయిట్‌నింగ్‌గా..

**ఉంగరాల జుట్టు చూడటానికి** బాగున్నా దాంతో అంత ఈజీ కాదు. సహజంగానే ఓ పట్టాన చిక్కులు రావు. ఇక తలస్నానం చేసినప్పుడయితే ఆ బాధ వర్ణనాతీతం. చాలామంది అది పడలేకే స్ట్రెయిట్‌నింగ్ వైపు అడుగులు వేస్తుంటారు. ఏవేవో ప్రయత్నాలు చేసి స్ట్రెయిట్ చేయించినా కొద్ది రోజులకే మళ్లీ మొదటికొస్తుంది. పైగా ఆ సమయంలో వాడే రసాయనాలు భవిష్యత్తులో కిడ్నీలపై ప్రభావం చూపించే అవకాశం ఉదంటున్నారు నిపుణులు. జుత్తుకి తీసుకునే ట్రీట్‌మెంట్ వల్ల శరీర భాగాలు పాడవడమేంటి అనుకుంటున్నారా? అయితే దీనికి ఇంగ్లాండ్‌లో జరిగిన ఓ ఘటనే ఉదాహరణ. ఓ మహిళ మూడేళ్లలో మూడుసార్లు స్ట్రెయింగ్‌నింగ్



ట్రీట్‌మెంట్ తీసుకుందట. అలా తీసుకున్నా ప్రతిసారీ వాంతులు, విరేచ నాలు, జ్వరం, వెన్నునొప్పి లాంటివి వచ్చి విపరీతంగా బాధని అనుభవిం చిందట. అంతేనా.. స్ట్రెయిట్‌నింగ్ ట్రీట్‌మెంట్‌లో వాడే క్రీముల్లో ఉండే గ్లైఆక్సిలిక్ ఆమ్లం చర్మం ద్వారా శరీరంలోకి చొచ్చుకెళ్లి ఆక్సిలిక్ ఆమ్లాన్ని విడుదల చేస్తుందట. దానివల్ల కాల్షియం అధికమై చిన్న చిన్న క్రిస్టల్స్‌గా తయారై కిడ్నీలు పాడయ్యాయట. అందుకే దీర్ఘకాలిక కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు స్ట్రెయిట్‌నింగ్ దూరంగా ఉండటమే మంచిది. సాధారణంగా ఈ అలవాటు ఉన్నవారు మూడు నుంచి నాలుగు నెలలపాటు విరామం తీసుకోవాలి. వెంటవెంటనే తీసుకోవడం వల్ల జుట్టూ పాడవుతుంది. ఆరోగ్యమూ దెబ్బతింటుంది. రసాయనాలపాళ్లు అధికంగా ఉన్నవీ, గడువు ముగిసిన ఉత్పత్తులూ వాడి ప్రాణం మీదకితెచ్చుకోవద్దం టున్నారు పరిశోధకులు. మీ శరీరానికి ఏం కావాలో ఏం వద్దో మీకు ఓ అంచనా ఉంటుంది. ఏదైనా రసాయనలు పడటం లేదు అనిపించినప్పుడు దానికి దూరంగా ఉండండి. తప్పదు అనుకున్నప్పుడు ఏవైనా ఇంటి చిట్కాలు ప్రయత్నించండి. అంతేతప్ప బాధని భరించి ప్రయోగాలు చేయకండి. అది ఎప్పటికైనా మీ ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని గమనించుకోండి. □

# ఇంటర్వ్యూలో ఇలా వద్దు..

కొంతమందికి ఇంటర్వ్యూ అంటేనే భయం, ఆందోళనలతో చెమటలు పడుతుంటాయి. మరి ఈ సమస్య నుంచి బయట పడేదెలా అంటారా.. ఈ చిట్కాలు మీ కోసమే. చాలామంది ఇంటర్వ్యూకి కొన్ని రోజుల ముందే అన్నీ చదువుకుని, ప్రాక్టీస్ అయి సిద్ధంగా ఉంటారు. తీరా భయంతో తెలిసిన ప్రశ్నలకీ సమాధానం తప్పుగా చెబుతుంటారు. తరవాత అయ్యో నాకు తెలుసు కదా అనుకుంటారు. దీనికి కారణం వారు మానసికంగా సన్నద్ధం కాలేకపోవడమే. ఇలాంటి సందర్భంలోనే మన బలహీనతలను బలంగా ఉ పయోగించుకోగలగాలి. మీకు అంతగా ఇబ్బందిగా ఉంటే నేను అసౌకర్యంగా ఫీలవు తున్నాను అని వారికి చెప్పండి. వారే అర్థం చేసుకుంటారు. లేదా ఇంటర్వ్యూకి వెళ్లే ముందు ఒకసారి అద్దం ముందు సాధన చేయండి. కాస్త భయం పోతుంది. ఇంటర్వ్యూకి సమయపాలన చాలా ముఖ్యం. ఆలస్యంగా వెళితే మీకు టైమ్ మేనేజ్‌మెంట్ లేదు అనుకుంటారు. ఈ సమయపాలనను బట్టే ఈ ఉద్యోగానికి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో వారికి తెలుస్తుంది. అందుకే ఎప్పుడైనా ఇంటర్వ్యూకి 15 నిమిషాల ముందు చేరుకోవడం మంచిది. అంతేకాదు, కొన్ని కంపెనీలు దుస్తుల కోడ్ పెడుతుంటాయి. వాటిని తప్పకుండా అనుసరించాలి. ఎందుకంటే మనడ్రెసింగ్‌ని బట్టీ కొన్నిసార్లు ఉద్యోగానికి ఎంపిక చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్వ్యూలో ప్రవర్తన కూడా చాలా ముఖ్యం. కొంతమంది కంగారులో ఫోన్ ఆన్‌లో పెట్టి ఇంటర్వ్యూ గదిలోకి వెళ్తుంటారు. అదేమో అప్పుడే మోగుతుంది. నిర్లక్ష్యంగా పరిగణిస్తారు జాగ్రత్త! ఆదేకాదు అవతలివారు మాట్లాడుతున్నప్పుడు మీరు దిక్కులు చూసినా, అతిగా నవ్వినా క్రమశిక్షణ లేదు అనుకుని రిజెక్ట్ చేస్తారు. కాబట్టి లోనికి వెళ్లేముందే అన్నీ సరి చూసుకోండి. ఇంటర్వ్యూ చేసేవాళ్లపట్ల మర్యాదగా ప్రవర్తించాలి. □



# అప్పటికప్పుడు వేడిగా..



**వర్షం చలి మొదలయిపోయింది.** ఎంత వేడిగా వండి వడ్డిదామను కున్నా భోజనాల బల్ల మీద కూర్చునే సరికి వంటకాలన్నీ చల్లారిపోతుంటాయి. తిరిగి వాటిని వేడిచేయాలంటే వేరే పాత్రలోకి తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. మళ్లీ వాటన్నింటినీ తోముకోవాలి. ఇంత పని లేకుండా.. మీరే సమయంలోనైనా వేడి తినాలనుకుంటే ఈ గ్రేవీ వార్మర్ మీ దగ్గర ఉంటే చాలు. చూడాడనికి చక్కని సెరామిక్ బౌల్‌లా ఉంది కదా! అదే దీని ప్రత్యేకత. వండిన వంటలనీ ఈ బౌల్‌కి తీసుకుంటే చాలు. దీనికి అడుగున కరెంట్‌తో పనిచేసే ఒక బేస్ ఉంటుంది. దానికి కాసేపు ఛార్జింగ్ పెట్టి తీసేస్తే చాలు. ఈ బేస్‌పై వార్మర్‌ని ఉంచితే గంటపాటు వంటకాలు వేడిగా ఉంటాయి. డైనింగ్ టేబుల్‌పై తక్కువ స్థలంలో అందంగా అమరిపోతుంది. □



# పొగాకు జీవితాన్ని హరిస్తుంది



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఆరోగ్య భాగ్యం

పొగాకు మానేయడం మీ ఆరోగ్యానికి మరియు అందరికి విజయం శుభ్రంగా ఊపిరి పీల్చుకొని పచ్చగా జీవించండి. ఈ రోజే పొగాకు మానేయండి. మీరు పొగ త్రాగని ప్రతి సిగరెట్ మీ ఆరోగ్యానికి విజయం. పొగాకు మీ శ్వాసని దొంగలిస్తుంది. అది మీ జీవితాన్ని దొంగలించనివ్వకండి. ఇలా పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాల్ని వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తోంది. అందుకే ప్రతి ఏటా మే 31న ప్రపంచవ్యాప్తంగా దీన్ని నిర్వహిస్తూ జాతీయ ధూమపానరహిత నెలగా జూన్ మాసాన్ని ప్రకటించడమైనది. ధూమపానం యొక్క దుష్ప్రబావాల్ని ఎలా, ఏ విధంగా గుర్తించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలో తెలుసుకుందాం. భారతదేశంలో 1508లో పొగాకుని దక్షిణ అమెరికా వారు ప్రవేశపెట్టడంతో క్రమేణా ఇది ఒక ప్రధాన వాణిజ్య పంట అయింది. ప్రపంచ మార్కెట్‌లో పొగాకు దాదాపు 80% వాటాని కల్గి ఉంటుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా పొగతాగే వారి సంఖ్య పెరిగిపోతుంది. పొగాకు ఉత్పత్తుల్ని వివిధ రకాల పదార్థాలతో తయారు చేస్తారు. పొగాకు వాటి సంకలనాల్ని కాల్చినపుడు ఉత్పత్తి అయ్యే పొగలో 4000 కంటే ఎక్కువ రసాయన సమ్మేళనాలు, 40 కేన్సర్ కారకాలు, 70% నికోటిన్, టార్ ఉంటుంది. ఇవి చాలా వరకు విషపూరితమైనవి. వీటలోని హైడ్రోకార్బన్స్, కార్బన్‌డయాక్సైడ్, కార్బన్‌మోనక్సైడ్ వాయువులు శరీరం లోపలికి పోయి ఆక్సిజన్ లేకుండా చేయడం వల్ల రక్త నాళాల్లో రక్తం గడ్డకట్టి గుండె, రక్తనాళాల వ్యాధులకు కారణమవుతుంది. ఎండిన పొగాకు ఆకుల్ని ప్రధానంగా సిగరెట్స్, బీడీలు, సిగార్లు, పైపులు, షిపాలలో ఉంచి త్రాగడానికి ఉపయోగిస్తారు. వీటిని స్నప్, చూయింగ్ పొగాకు, డిప్పింగ్ పొగాకు, స్నస్‌గా కూడా తినవచ్చు. దీంతో మనదేశంలో 35 కోట్ల మంది ధూమపానానికి బానిసలైన వారున్నారని అంచనా ప్రతిరోజు సుమారు 5వేల మందికి పైగా కొత్తగా ధూమపానం ప్రారంభిస్తున్నారు. ముఖ్యంగా వారిలో 15 సంవత్సరాలు దాటిన యుక్త వయస్కులుండడం ఆందోళన కల్గించే విషయం అనే చెప్పాలి. రోజుకు 10 సిగరెట్స్ త్రాగితే కేన్సర్ వచ్చే అవకాశాలు 10 రెట్లు ఎక్కువ. అలాగే రోజుకు 25 సిగరెట్స్ తాగితే కేన్సర్ వచ్చే అవకాశాలు 25 రెట్లు ఎక్కువగా ఉంటుంది పొగ తాగే వారిలో ఆల్కహాల్ అలవాటుంటే వారికి కేన్సర్ వచ్చే అవకాశాలు పదింతలుంటుంది. ప్రతి 10 మందిలో 8 మంది వివిధ కేన్సర్స్ తో మరణిస్తున్నారు. కేన్సర్‌తో మరణించేవారిలో 30శాతం మేరకు ఊపిరితిత్తుల కేన్సర్‌తో మరణిస్తున్నారు. దీంతోపాటు గర్భాశయ కేన్సర్, మూత్రాశయం, కిడ్నీ, కాలేయం, పాంక్రియా టిక్ కేన్సర్లు, లింఫోమా, మల, ప్రేగు కేన్సర్, అన్నవాహిక, స్వంపేటిక, నోరు గొంతు, కడుపు కేన్సర్స్ 48.3% కేసుల్లో కన్పిస్తాయి. □



# లక్నో టీమ్‌లో భారీ మార్పులు

## కోచింగ్ స్టాఫ్, ప్లేయర్లపై వేటు

## యాజమాన్యం కఠిన నిర్ణయాలు



**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 18వ సీజన్ ముగిసి పట్టుమని వారం రోజులైనా కాలేదు. అప్పుడే కొన్ని జట్లు కోచింగ్ సిబ్బంది మార్చే పనిలో బిజీగా మారాయి. ఇందులో భాగంగా వరుసగా రెండుసార్లు సీజన్లలో నిరాశపరిచిన లక్నో సూపర్‌జెయింట్స్ తన టీమ్‌లో భారీ మార్పులకు సిద్ధం అవుతోంది. కెప్టెన్ కెఎల్ రాహుల్‌తో జట్టు నిర్వహణ సమస్యల కారణంగా లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌ను పూర్తిగా మార్చాల్సి వచ్చింది. గతేడాది జరిగిన ఐపిఎల్ మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు కొంతమంది మంచి ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంది. అయితే, ఈ ఏడాది కూడా వారు ట్రోఫీని గెలవలేకపోయారు. ఈ సీజనులో ఆడిన 14 మ్యాచ్‌లలో 6 మ్యాచ్‌లలో మాత్రమే వారు గెలిచారు. ప్రారంభంలో గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, సీజన్ చివరి నాటికి వారు 7వ స్థానంలో ఉన్నారు. దీని కారణంగా, జట్టు యాజమాన్యం కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. తమ ఫ్రాంచైజీ నిరుడు, ఈ ఏడాది ప్లే ఆఫ్స్‌కు చేరకపోవడంతో లక్నో ఫ్రాంచైజీ చైర్మన్ సంజీవ్ గొయెంకా అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కోచింగ్ స్టాఫ్‌లోని కొందరిపై వేటు తప్పదన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. వీళ్లలో మెంటార్ జహీర్ ఖాన్ పేరు కూడా ఉండే అవకాశం ఉందని లక్నో వర్గాలు చెబుతున్నాయి. టీమిండియా 2011లో వరల్డ్ కప్ గెలుపొందిన తర్వాత జట్టులో సభ్యుడైన జహీర్ ఖాన్ నిరుడు లక్నో కోచింగ్ యూనిట్లో చేరాడు. హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్ తో కలిసి మెంటార్‌గా వ్యూహరచనలు చేశాడు మాజీ పేసర్. అయితే ఈ ఐపిఎల్ 18వ సీజన్ లక్నో తీవ్రంగా నిరాశపరిచింది. ఆరంభంలో అదుర్స్ అనిపించినా కీలక మ్యాచుల్లో మాత్రం ఓడిపోయింది. 14 మ్యాచుల్లో 6విజయాలతో ప్లేఆఫ్స్ బెర్తుకు దూరం అయ్యింది. ఇక వేలంలో రికార్డు ధర పలికిన కెప్టెన్ రిషభ్ పంత్ ఆఖరి మ్యాచులో సెంచరీ మినహా పెద్దగా రాణించినట్లు అనిపించలేదు. అతన్ని సానబెట్టడంలో మెంటార్‌గా జహీర్ ఖాన్ విఫలమయ్యాడని సంజీవ్ గొయెంకా భావిస్తున్నారు.

అయితే ఈ సీజన్‌లో చెలరేగి ఆడాలనుకున్న లక్నో మైదానంలో మాత్రం తేలిపోయింది. మరోవైపు హిట్టర్ నికోలస్ పూరన్, మిడిలార్డర్‌లో సమద్ తేలిపోవడంతో ఆ జట్టు విజయావకాశాలు దెబ్బతిన్నాయి. దాంతో వచ్చే సీజన్‌కు పక్కాగా సిద్ధం కావాలనే ఆలోచనతో ఉన్న ఆయన కొత్త మెంటార్ కోసం చూస్తున్నాడని తెలుస్తోంది. అదే నిజం అయితే లక్నో మెంటార్‌గా జహీర్ పదవీ కాలం ఈ ఏడాదితో ముగియనుందని చెప్పవచ్చు.



## ఫిఫా ప్రపంచ కప్ విజేత అల్వారెజ్

## 1-0తో చిలీ ఔట్

**న్యూఢిల్లీ:** ఫిఫా ప్రపంచ కప్-2026 క్వాలిఫైయర్‌లో అర్జెంటీనా ప్రత్యర్థి చిలీని ఓడించడంతో జూలియన్ అల్వారెజ్ విజేతగా నిలిచాడు. శాంటియాగోలో శుక్రవారం జరిగిన వారి ఫిఫా ప్రపంచ కప్ 2026 క్వాలిఫైయర్ అర్జెంటీనాకు 1-0 తేడాతో పేలవమైన విజయంగా ముగిసింది, జూలియన్ అల్వారెజ్ 23వ నిమిషంలో విజేతగా నిలిచాడు. ఇప్పటికే ప్రపంచ కప్‌కు అర్హత సాధించిన అర్జెంటీనా, దాని కెప్టెన్ మెస్సీతో ఆటను ప్రారంభించింది. నికో పాజ్, జూలియన్ అల్వారెజ్ మరియు గియోవన్నీ సిమియోన్ వంటి యువకులు తమ జట్టును గెలిపించుకునేందుకు తీవ్ర యత్నాలు చేశారు. అయితే, లక్ష్యం వైపు తొలి షాట్ చిలీ కొట్టింది. అలెక్సిస్ సాంచెజ్ బాక్స్ వెలుపల నుండి గోల్ కొట్టాడు, 3వ నిమిషంలో ఎమిలి యానో మార్టినెజ్ దానిని సేవ్ చేశాడు. చివరి మూడవ బంతిలో థియాగో అల్మాడ అల్వారెజ్‌కి త్రూ బాల్‌ను అందించాడు, అతను బంతిని గోల్ కీపర్ బ్రయాన్ కోర్టెస్‌పైకి చిప్ చేశాడు. దీంతో బంతి వుడ్‌వర్క్ లోపలి భాగాన్ని తాకిన తర్వాత లైన్‌దాటింది. విరామం తర్వాత చిలీ తిరిగి ఆటలోకి ప్రవేశించడానికి ప్రయత్నించింది, గంట సమయం తర్వాత దాదాపు కొన్ని నిమిషాల పాటు గోల్ చేసే ప్రయత్నం చేసింది, లక్ష్యాన్ని మూడుసార్లు షూట్ చేసింది. కానీ మార్టినెజ్ యొక్క శీఘ్ర ప్రతిచర్యలు మరియు అర్జెంటీనా యొక్క అప్రమత్తమైన తక్కువ బ్లాక్ అల్బిసెలెస్టేకు పూర్తి పాయింట్లను నిర్ధారించాయి. ఈ ఫలితం స్టాండింగ్స్‌లో అర్జెంటీనాకు తిరుగులేని ఆధిక్యాన్ని ఇచ్చింది, ఫలితంగా చిలీ పట్టికలో అట్టడుగున నిలిచింది, దీంతో ప్రపంచ కప్ కల బహుశా ముగిసే అవకాశం ఉంది. తదుపరి మ్యాచ్‌లో అర్జెంటీనా కొలంబియాతో తలపడనుంది, చిలీ బొలీవియాతో తలపడనుంది, రెండు మ్యాచ్‌లు ఈ నెల 10న జరగనున్నాయి. టాప్ ఆరు జట్లు 2026 ప్రపంచ కప్‌కు అర్హత సాధిస్తాయి.





### టెన్నిస్ టోర్నీలో.. హైదరాబాద్ అమ్మాయి

## రష్మిక సంచలనం



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ75 మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సంచలనం సృష్టించింది. అమెరికాలోని సౌత్ కరోలినాలోని సమ్టర్‌లో జరిగిన ఈ టోర్నీలో సింగిల్స్ విభాగంలో తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 335 ర్యాంకర్ రష్మిక 3-6, 6-3, 6-3తో టాప్ సీడ్, ప్రపంచ 212వ ర్యాంకర్ అమెరికాకు చెందిన హనా చాంగ్‌ను బోల్తా కొట్టించింది. 2 గంటల 31 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఒక ఏస్ కొట్టి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయిన రష్మిక ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. ప్రి క్వార్టర్ ఫైనల్లో అమెరికాకే చెందిన జూలియా ఫ్లిగ్నెర్‌తో రష్మిక తలపడనుంది. కాగా డబుల్స్‌లో రష్మిక (భారత్)-కేథరిన్ సెబోవ్ (కెనడా) జోడీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. తొలి రౌండ్‌లో రష్మిక-కేథరీన్ ద్వయం 7-6 (8/6), 6-4తో అమెరికా ద్వయం అక్లి-డలేనా హెవిట్‌పై గెలిచింది.

### ఇండొనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్‌లో..

## సాత్విక్-చిరాగ్ ఓటమి



**న్యూఢిల్లీ:** ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్‌లో భారత్‌కు చెందిన డబుల్ ద్వయం రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-శెట్టి చిరాగ్‌లు ఓటమి పాలయ్యారు. సాత్విక్-చిరాగ్ ఓటమితో పోటీలో భారత జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ఈ టోర్నీలో భారత్ క్రీడాకారుల పోరు ముగిసింది. బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌లో వరుసగా రెండో వారం, మాజీ ప్రపంచ నంబర్ 1 పురుషుల డబుల్స్ జోడీ, భారత్‌కు చెందిన సాత్విక్-చిరాగ్ చివరి వరకూ పోటీలో నిలిచారు, కానీ ఇండోనేషియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌లో వారి ప్రచారం అర్ధంతరంగా ముగిసింది. జకర్తాలో శుక్రవారం 43 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో 19-21, 16-21 తేడాతో మలేషియాకు చెందిన ప్రపంచ నంబర్ 7 మాన్ వీ చోంగ్-టీ కై వున్ చేతిలో భారత్ జోడీ ఓటమిపాలైంది. జకార్తాలో జరిగిన ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో వారు మరోసారి వెనుకబడి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఇది ఈ సంవత్సరం మూడవ బ్యాడ్మింటన్ మేజర్ ఈవెంట్. 2023 ఛాంపియన్‌లైన స్వాక్-చిరాగ్, 68 నిమిషాల రెండవ రౌండ్ పోరులో ప్రపంచ 16వ ర్యాంక్ డానిష్ జంట రాస్మస్ క్జెర్ మరియు ఫ్రెడరిక్ సోగార్డ్‌పై 16-21, 21-18, 22-20 తేడాతో విజయం సాధించి, ఒత్తిడిలో కూడా గొప్ప స్వభావాన్ని ప్రదర్శించారు. గత వారం సింగపూర్ ఓపెన్ సూపర్ 750లో సెమీఫైనల్‌కు చేరుకున్న సాత్విక్-చిరాగ్ జకార్తాలో తమ అత్యుత్తమ ప్రదర్శనను కనబరచలేదు. సింగపూర్‌లో జరిగిన సెమీఫైనల్‌కు వెళ్లే మార్గంలో కొత్త ప్రపంచ నంబర్ 1 జోడీ గో స్జె ఫీ మరియు నూర్ ఇజ్జుద్దీన్‌లను ఓడించారు, అక్కడ వారు చివరికి ఆరోన్ చియా మరియు సోహ్ వూయి యిక్‌లలో తమ ప్రత్యర్థు చేతిలో ఓడిపోయారు.

### ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 3..

## వరుస ఓటములతో భారత్ ఆర్చర్లు

**న్యూఢిల్లీ:** చైనాలో జరిగిన మునుపటి దశలో 2 స్వర్ణాలు, ఒక రజతం, 4 కాంస్య పతకాలను సాధించిన భారతదేశ ఆర్చర్లు, ప్రస్తుతం జరుగుతున్న ఈవెంట్‌లో ఇంకా విజయాల మార్కును దాటలేకపోయారు. టర్కీలోని అంటాల్యలో శుక్రవారం జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 3లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన కాంపౌండ్ ఆర్చర్లు టర్కీలో నిరాశపరిచే ప్రచారాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. మహిళల వ్యక్తిగత ఈవెంట్ క్వార్టర్ ఫైనల్‌లో మెక్సికన్ మరియానా బెర్నాల్ 159-152 తేడాతో విజయం సాధించడంతో భారత్‌కు చెందిన మధుర ధమన్ గోంకర్‌కు నిష్క్రమణ తప్పలేదు. బెర్నాల్ స్వదేశీయురాలు ఆండ్రియా బెకెరా ప్రపంచ ఛాంపియన్, భారత్‌కు చెందిన అదితి స్వామిని 152-147 తేడాతో ఓడించింది. ఇక ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో అభిషేక్ వర్మను 157-154 తేడాతో ఓడించిన భారత్‌కు చెందిన రిషబ్ యాదవ్, పురుషుల విభాగంలో క్వార్టర్స్‌లో ఫ్రెంచ్‌కు చెందిన నికోలస్ గిరార్డ్ చేతిలో 149-157 తేడాతో ఓడిపోయాడు. అలాగే ప్రపంచ ఛాంపియన్ భారత్‌కు చెందిన ఓజాస్ డియోటేల్ అమెరికన్ జేమ్స్ లూట్జ్ చేతిలో తొలి రౌండ్‌లో షాక్ తిన్నాడు, ఆ మ్యాచ్‌లో అతను 157-161 తేడాతో ఓడిపోయాడు. కాగా కాంపౌండ్ టీమ్ ఈవెంట్ నుంచి భారత్ నిష్క్రమించింది. అయితే కాంపౌండ్ మరియు రికర్వ్ ఈవెంట్లలో మిక్స్‌డ్ విభాగంలో వరుస అపజయాల నుండి బయట పడాలని భారత్ ఆర్చలు పట్టుదలతో ఉన్నారు.


# ఆర్‌బిఐ రెపోరేట్ @ 0.5%

**ముంబై, జూన్ 6:** విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ కీలక వడ్డీ రేట్లను ముచ్చటగా మూడోసారి ఆర్‌బీఐ సవరించింది. ఈసారి రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. తాజా తగ్గింపుతో రెపో రేటు 6 శాతం నుంచి 5.50 శాతానికి దిగొచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లోనూ కీలక వడ్డీరేట్లను కేంద్ర బ్యాంకు 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో కలుపుకుంటే.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రెపోరేటు ఒకశాతం వరకు తగ్గింది. వడ్డీరేటు తగ్గింపుతో గృహ, వాహన, ఇతర రుణగ్రహీతలపై వడ్డీ భారం ఇంకాస్త తగ్గనుంది. అంతేగాక, మార్కెట్‌లో ద్రవ్య లభ్యత పెరగనుంది. ఇక, స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటును 5.25 శాతంగా, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటును 5.75శాతం ఉంచినట్లు గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ద్రవ్య పరపతి విధాన కమిటీ సర్దుబాటు వైఖరి నుంచి స్థిర విధానానికి మారాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితులు నెలకొన్నా భారత ఆర్థికవ్యవస్థ బలంగా, స్థిరంగా కొనసాగుతోంది. వేగంగా వృద్ధి చెందుతోంది. పెట్టుబడిదారులకు అపార అవకాశాలు కల్పిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. తొలి త్రైమాసికంలో 6.5శాతం, రెండో త్రైమాసికంలో 6.7శాతం జీడీపీ నమోదవ్వొచ్చని అంచనా. మూడు, నాలుగు త్రైమాసికాల్లో వృద్ధి రేటు వరుసగా 6.6 శాతం, 6.4శాతం ఉండొచ్చు. ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పడుతుండటంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాలను 4 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గిస్తున్నాం. బ్యాంకుల వద్ద నగదు నిల్వల నిష్పత్తిని 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నాం. రూ.2.5లక్షల కోట్ల బ్యాంకు నిధులను విడుదల చేయనున్నాం. దీంతో బ్యాంకు మరిన్ని రుణాలు మంజూరు చేసేందుకు వీలు కల్పించినట్లవుతుంది. ఈఏడాది జనవరి నుంచి రూ.9.5లక్షల కోట్లు ద్రవ్యాన్ని వ్యవస్థలోకి తీసుకొచ్చాం. విదేశీ మారక నిల్వలు 691.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీంతో మరో 11 నెలల వరకు దిగుమతులకు ఇబ్బంది ఉండదు. ఈక్విటీల్లో లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం ఇవి 1.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.



## టెస్లాకు 150 బిలియన్ డాలర్ల లాస్!

**వాషింగ్టన్, జూన్ 6:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య స్నేహ బంధం చెడింది. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు సొంత డబ్బును నీళ్లలా ఖర్చు చేసిన మస్క్ ఇప్పుడు అదే ట్రంప్ వాటిల్లింది. ఆయన సంస్థ టెస్లా షేర్లు భారీగా పతనమయ్యాయి. గురువారం నాటి ట్రేడింగ్‌లో టెస్లా షేర్లు ఏకంగా 14శాతం పతనమయ్యాయి. దాదాపు 152 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.13 లక్షల కోట్లన్న మాట. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 1 లక్ష కోట్ల మార్క్‌ను కోల్పోయి 916 బిలియన్ డాలర్లకు పడిపోయింది. టెస్లా సంపద ఒక్క రోజులోనే ఈ స్థాయిలో తరిగిపోవడం సంస్థ చరిత్రలోనే ఇదే తొలిసారి కావడం గమనార్హం. వైఖరిని తప్పుబడుతున్నారు. ఇటీవల డోజ్ శాఖ నుంచి వైదొలిగిన మస్క్.. బహిరంగంగానే ట్రంప్‌పై సంచలన ఆరోపణలు చేస్తున్నారు. అదే సమయంలో మస్క్‌కుట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మస్క్‌కు తీవ్ర నష్టం అమెరికన్లకు పన్ను తగ్గించేందుకు బిగ్ ట్యాక్స్ బ్రేక్ బిల్లును ట్రంప్ యంత్రాంగం తీసుకొచ్చింది. ట్రంప్‌మస్క్ మధ్య దూరానికి ఈ బిల్లే ప్రధాన కారణమని చెప్తున్నారు. ఈ బిల్లుతో ధనికులకు 4.5 లక్షల కోట్ల డాలర్ల మేర లబ్ధి చేకూరి, పేదలకు ఉద్దేశించిన సంక్షేమ పథకాలు మరుగున పడుతాయని మస్క్ తప్పుబడుతున్నారు. ఇదో అసహ్యకరమైనబిల్లుగా ఆయన అభివర్ణించారు. రుణ పరి మితిని పెంచి అమెరికా ఆర్థికాన్ని దివాలా తీయించేలా ఉన్న ఇలాంటి బిల్లుకు మద్దతిచ్చిన వారికి సిగ్గు ఉండాలని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కిల్ ది బిల్ అంటూ ట్వీట్ చేశారు. అయితే, ఎలక్ట్రిక్ కార్లకు రాయితీ తగ్గింపు అంశం బిల్లులో ఉండటం వల్లే మస్క్ దీన్ని వ్యతిరేకిస్తున్నారని ట్రంప్ వర్గం ఎదురుదాడికి దిగుతున్నది.




## చిన్న మొత్తం గోల్డ్ లోన్స్‌కు ఆర్‌బిఐ సవరింపులు

**న్యూఢిల్లీ, జూన్ 6:** బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలను జారీ చేయనున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఒకటి రెండు రోజుల్లో కొత్త రూల్స్ వస్తాయని పరపతి విధాన సమీక్ష నిర్ణయాల వెల్లడి సందర్భంగా ఈ అంశంపై ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.2.5 లక్షల కంటే తక్కువ రుణాలు తీసుకునే వారికి లోన్‌టువాల్యూ 75 శాతం నుంచి 85 శాతానికి సవరిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సూచన మేరకు ఆర్‌బీఐ తన మార్గదర్శకాలను సవరించినట్లు తెలుస్తోంది. పసిడి రుణాల విషయంలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఒకేతరహా నిబంధనలు ఉండాలన్న ఉద్దేశంతో ఆర్‌బీఐ ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేసిన సంగతి తెలిసిందే. రుణ గరిష్ఠ విలువ, తనఖా రుణం తరహా, చెల్లింపులకు సంబంధించిన రూల్స్‌ను ఇందులో పొందుపరిచింది. మరోవైపు ఆర్‌బీఐ గవర్నర్ నుంచి ఈ ప్రకటన రావడంతో బంగారం తాకట్టు పెట్టి రుణాలు జారీ చేసే సంస్థల షేర్లు రాణించాయి. ముఖ్యంగా మణప్పురం షేర్లు 5.64 శాతం మేర రాణించి రూ.247వద్ద, ముత్తూట్ ఫైనాన్స్ షేర్లు 6.98శాతం లాభంతో రూ.2,454 వద్ద స్థిరపడ్డాయి.



## తగ్గనున్న హోమ్‌లోన్ ఇఎంఐ భారం

# వాణిజ్యం

**న్యూఢిల్లీ, జూన్ 6:** నెలవారీ చెల్లింపుల వాయిదా భారం మోస్తున్న గృహ వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి శుభవార్త చెప్పింది. కీలక వడ్డీరేట్లను ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించి మరింత ఊరట కల్పించింది. ఆర్‌బీఐ ఇలా రెపోరేటును సవరించడం ఈ ఏడాదిలో ఇది మూడోసారి. మొత్తంగా ఇప్పటివరకు ఒక శాతం వరకు వడ్డీరేటును తగ్గించింది. తాజా నిర్ణయంతో గృహ రుణగ్రహీతలపై ఈఎంఐ భారం మరింత తగ్గనుంది. ఫ్లోటింగ్ రేట్‌పై గృహ రుణాన్ని తీసుకున్న వారికి సవరించిన వడ్డీరేటు ఆధారంగా ఊరట లభించనుంది. 2019 అక్టోబర్ 1 తర్వాత జారీ చేసిన గృహ రుణాలన్నీ ఫ్లోటింగ్ రేటుతో జారీ అయినవే. కాబట్టి వారికి బ్యాంకులు ఆ మేరకు వడ్డీ రేట్లను సవరిస్తాయి. పాత వినియోగదారులకే కాదు.. కొత్తగా రుణాలు తీసుకునే వారు తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు. పైగా ఎక్కువ మొత్తంరుణం పొందేందుకు అవకాశం ఉంటుందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో రుణగ్రహీతల ముందు ఇప్పుడు రెండు ఆప్షన్లు ఉండబోతున్నాయి. ఒకటి ఈఎంఐ తగ్గించుకోవడం. రెండోది కాలవ్యవధి తగ్గించుకోవడం. దీంట్లో రెండో ఆప్షన్ ఎంచుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో వడ్డీని ఆదా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఉదాహరణకు ఈ ఏడాది జనవరిలో 20 ఏళ్ల కాల వ్యవధికి రూ.50 లక్షల రుణం తీసుకున్నారనుకుందాం. అప్పట్లో బ్యాంకు వడ్డీరేటు 8.50శాతం ఉంటే.. నెలకు రూ.43,391 చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆర్‌బీఐ మూడు దఫాల్లో వడ్డీ రేట్లను సవరించడంతో ఈఎంఐ మొత్తం రూ.40,280కి తగ్గనుంది. అంటేనెలకు దాదాపు రూ.3వేల పైనే ఆదా అవుతుంది. దీర్ఘకాలంలో మొత్తంగా దాదాపు రూ.7.12 లక్షల మేర వడ్డీ భారం తగ్గుతుంది. ఒకవేళ ఈఎంఐని స్థిరంగా ఉంచుకొని కాలవ్యవధిని మార్చుకుంటే గనుక.. రుణ చెల్లింపు గడువు దాదాపు మూడు సంవత్సరాల వరకు తగ్గుతుంది. ఈ ఏడాది జనవరిలో 240 నెలల కాల వ్యవధికి రూ.50 లక్షల రుణం తీసుకున్నారనుకుంటే.. ఆర్‌బీఐ ఊరటతో ఈ కాలవ్యవధి 206 నెలలకు తగ్గుతుంది. అంటే వడ్డీ భారం దాదాపు రూ.14.78 లక్షల మేర ఆదా అవుతుంది.


## ఫీచర్ ఫోన్లలోనూ ఫోన్‌పే!

**న్యూఢిల్లీ, జూన్ 6:** ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే ఫీచర్ ఫోన్ వినియోగదారుల కోసం యూపీఐ ఆధారిత చెల్లింపు సేవల్ని ప్రవేశపెట్టనుంది. దీనికోసం జీఎస్‌పే టెక్నాలజీ కన్వర్‌జేషనల్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్ గప్‌చుప్‌ను కొనుగోలు చేసింది. ఈ విషయాన్ని కంపెనీ స్వయంగా వెల్లడించింది. రానున్న త్రైమాసికాల్లో భారత్‌లో కొత్త ఫీచర్ ఫోన్‌ల కోసం సొంత యూపీఐ మొబైల్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపింది. జీఎస్‌పే అనేది నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అభివృద్ధి చేసిన యూపీఐ 123పే ఆధారంగా పనిచేస్తుంది. ఫీచర్ ఫోన్లు వినియోగించే వారికి యూపీఐ సేవలు అందించేందుకు ఇది సాయపడుతుంది. ఫోన్‌పే ఫీచర్ ఫోన్ల కోసం తీసుకురానున్న కొత్త యాప్ ద్వారా పీ2పీ లావాదేవీలు, ఆఫ్‌లైన్ క్యూఆర్ చెల్లింపులు, ఇతర యూపీఐ వినియోగదారుల నుంచి మొబైల్ నంబర్ ద్వారా చెల్లింపులు చేయడం వంటి ఫీచర్లు అందించనుంది. దీంతో ఫీచర్ ఫోన్‌లు, స్మార్ట్‌ఫోన్‌ల మధ్య చెల్లింపులు చేయడం కూడా త్వరలో సాధ్యం కానుంది. ప్రస్తుతం నోకియాకు చెందిన కొన్ని ఫీచర్ ఫోన్లలో గప్‌చుప్ అప్లికేషన్ అందుబాటులో ఉంది. ఈ యాప్‌లో ఎస్సెమ్మెస్ ద్వారా మీ అకౌంట్ నంబర్‌ను అనుసంధానం చేయొచ్చు. తర్వాత యాప్‌లోని పే ఆప్షన్ ఉపయోగించి మొబైల్ నంబర్ లేదా యూపీఐ ఐడీ ద్వారా పేమెంట్స్ చేయొచ్చు. త్వరలో ఇదే స్థానంలో ఫోన్‌పే కొత్త అప్లికేషన్ తీసుకురానుంది. ఫీచర్‌ఫోన్ వినియోగదారులకు డిజిటల్ చెల్లింపుల సేవలు అందిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫోన్‌పే సహ వ్యవస్థాపకుడు, సీఈఓ సమీర్ నిగమ్ తెలిపారు.




## రెపోరేట్ ఎఫెక్ట్: లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, జూన్ 6:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ ప్రకటనకు ముందు ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు కీలక వడ్డీ రేట్ల సవరించిన అనంతరం దూసుకెళ్లాయి. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లోనూ కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. ఇప్పుడు ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అప్పటి వరకు నష్టాల్లో ట్రేడయిన సూచీలు ఈ ప్రకటనతో లాభాల బాట పట్టాయి. బ్యాంక్, ఆటో, రియాల్టీ షేర్లు రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 800 పాయింట్ల మేర పెరగ్గా.. నిఫ్టీ 25,000 పైన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 81,434.24 పాయింట్ల (క్రితం ముగింపు 81,442.04) వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఆర్‌బీఐ ప్రకటన ముందు కాసేపు నష్టాల్లో ట్రేడయింది. ఆ తర్వాత రాణించిన సూచీ ఇంట్రాడేలో 82,299.89 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 746 పాయింట్ల లాభంతో 82188.99వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 25,029 వద్ద గరిష్ఠాన్ని చేరి, చివరకు 252 పాయింట్ల లాభంతో 25003 వద్ద ముగిసింది. బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, మారుతీ సుజుకీ, ఇండస్ ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫిన్ సర్వ్, ఎటర్నల్, టాటాస్టీల్, ఎంఅండ్ఎం, కోటక్ మహీంద్రా బ్యాంక్, టైటాన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్‌సిమెంట్ షేర్లులాభపడ్డాయి. భారతీఎయిర్ టెల్, సన్‌ఫార్మా మాత్రమే నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.06 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,379 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.